
ఆంధ్రజ్యోతి
ప్రకాశం జిల్లా వార్తలు 5
మంగళవారం 1, అక్టోబరు 2024



ఈయన కనిగిరి మండలం గురవాజీపేటలోని మిట్టమీదపల్లికి చెందిన వృద్ధుడు ఇంజం చినగురవయ్య. ఈయనకు రెండెకరాల పొలముంది. ఆ పొలానికి ఇరువైపులా ఉన్నవారు ఆయన్ను పొలంలోకి వెళ్లకుండా అడ్డుకుంటున్నారు. ఈ విషయంపై రెండుసార్లు తహసీల్దార్ కార్యాలయంలో అర్జీ ఇచ్చినా పట్టించుకోలేదు. ఆయన మనవడు కూడా వచ్చి అర్జీ ఇచ్చినా స్పందన లేదు. చినగురవయ్య ఇప్పటికీ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. అతని సమస్య మాత్రం పరిష్కారం కాలేదు.


ఒంగోలులో ప్రజల సమస్యలు వింటున్న కలెక్టర్, ఇతర అధికారులు

ఈయన అర్ధవీడు మండలం బోగోలుకు చెందిన చేగిరెడ్డి యలమందారెడ్డి. ఈయనకు గ్రామంలో ఐదు సర్వే నంబర్లలో 65 సెంట్ల భూమి ఉంది. అది పూర్వీకుల నుంచి సంక్రమించింది. ఆ స్థలాలు కొందరి ఆధీనంలో ఉన్నాయి. తన స్థలాలను తనకు ఇప్పించాలని యలమందారెడ్డి 2006 నుంచి అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఆక్రమణదారులకు రాజకీయ బలం ఉండటంతో యలమందారెడ్డి అర్జీలను అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ 18 ఏళ్లలో వివిధ స్థాయిల్లో 433 సార్లు అర్జీలిచ్చినా న్యాయం జరగలేదు. కనీసం ఏదో ఒక అధికారి కనికరించి న్యాయం చేయకపోతాడా అనే ఆశతో యలమందారెడ్డి ఒంటరిపోరాటం చేస్తూనే ఉన్నారు.



వింటున్నారంతే..!

మండలాల్లో మొక్కుబడిగా 'మీ కోసం'

ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారుల తీరు 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్నట్టుంది. నిర్లక్ష్యంతో కొందరు, రాజకీయ ఒత్తిళ్లతో మరికొందరు ప్రజాఫిర్యాదులను బుట్టదాఖలు చేస్తున్నారు. జిల్లాస్థాయిలో కొంత మెరుగ్గా ఉన్నా మండలాల్లో ప్రభుత్వ లక్ష్యానికి అధికారులు తూట్లు పొడుస్తున్నారు. ప్రతి సోమవారం నిర్వహించే 'మీకోసం' (ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ) కార్యక్రమంలో వచ్చే అర్జీల పరిష్కారంలో నిర్లిప్తత కనిపిస్తోంది. అర్జీదారులను వందల సార్లు కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారు. కనీసం ఎన్ని వినతులు వచ్చాయో కూడా నమోదు చేయడం లేదు. జిల్లాలోని పలు మండలాల్లో 'ఆంధ్రజ్యోతి' సోమవారం నిర్వహించిన విజిట్‌లో అనేక ఆసక్తికర విషయాలు వెలుగుచూశాయి.

ఆంధ్రజ్యోతి విజిట్

- అర్జీలన్నీ బుట్టదాఖలు చేస్తున్న అధికారులు
- వేళకు రారు.. సమస్యలు పట్టించుకోరు
- కొన్నిచోట్ల ఇద్దరు, ముగ్గురే దర్శనం
- వచ్చే వినతులు నమోదు చేయని వైనం
- ఎన్నిసార్లు తిరిగినా అపరిష్కృతంగానే సమస్యలు
- కలెక్టరేట్‌లో కొంత మెరుగు.. క్షేత్రస్థాయిలో అధ్వానం
- 'ఆంధ్రజ్యోతి' పరిశీలనలో వెలుగులోకి..

ఒంగోలు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారంలో అత్యంత కీలకమైన మండల స్థాయి అధికారుల పనితీరు అధ్వానంగా ఉంది. ప్రజలు వినతులిచ్చేందుకు వస్తే చాలా మండలాల్లో అధికారులు అందుబాటులో ఉండటం లేదు. అధికారులున్న చోట కూడా వారి సమస్యలను పట్టించుకోవడం లేదు. ప్రతి సోమవారం ప్రజా సమస్యలపై అధికారులు వినతులు స్వీకరించాలి. అవకాశం ఉన్న వాటికి తక్షణం, కాని వాటికి నిర్ధిష్ట కాలంలో పరిష్కారం చూపాలని ప్రభుత్వం ఆదేశించింది. పరిష్కారమయ్యే అవకాశం లేని సమస్యలైతే ఆ విషయాన్ని అర్జీదారుడికి లిఖితపూర్వకంగా తెలపాలి. అందుకోసం జిల్లా, మండలస్థాయిలో ప్రజా విజ్ఞప్తుల దినోత్సవాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోంది.

ప్రజా వినతులపై ప్రభుత్వం దృష్టి

కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలపై దృష్టిపెట్టింది. అందుకోసం పీజీఆర్ఎస్ (ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ) పేరుతో ప్రతి సోమవారం జిల్లా, మండలస్థాయిలో వినతుల స్వీకరణకు శ్రీకారం చుట్టింది. ఆ సమయంలో వచ్చే అర్జీల పరిష్కారంపై అధికారులు క్షేత్రస్థాయిలో సమీక్షలు చేయాలని చెప్పింది. అయితే జిల్లాలో ఈ విధానం అమలు అధ్వానంగా అఘోరిస్తోంది. కలెక్టరేట్‌లో మాత్రమే కొంత మెరుగ్గా నడుస్తోంది.


కనిగిరి ఆర్డీవో కార్యాలయంలో మీకోసంకు హాజరైన ఒకే ఒక్క అధికారి

కలెక్టరేట్‌లో ఇలా..

కలెక్టరేట్‌లో కలెక్టర్, జేసీతోపాటు పది, పన్నెండు శాఖల అధికారులు ప్రజా వినతులను స్వీకరిస్తున్నారు. అర్జీలను చూసి అక్కడికక్కడ జిల్లా అధికారులు, అవసరమైతే మండల స్థాయి అధికారులతో కలెక్టర్, జేసీ, డీఆర్వో స్థాయి అధికారులు మాట్లాడి పరిష్కారాలు చూపుతున్నారు. ప్రజల నుంచి వచ్చే వినతుల వివరాలను కలెక్టరేట్‌లో నమోదు చేసి రసీదులు కూడా ఇస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో ఇప్పటి వరకూ కలెక్టరేట్‌లో నిర్వహించిన, వివిధ ప్రాంతాల్లో కలెక్టర్ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వినతుల స్వీకరణతోపాటు సీఎం కార్యాలయం నుంచి పరిశీలన కోసం వచ్చినవి కలిపి 4,488 అర్జీలు జిల్లా యంత్రాంగానికి అందాయి. అందులో 3,457 పరిష్కారం అయ్యాయి. 1,031 వివిధ స్థాయిలో పెండింగ్‌లో ఉన్నాయి.

మండలాల్లో అధికారుల తీరుకు నిదర్శనాలివే..

మండల స్థాయిలో పరిస్థితి దారుణంగా ఉంది. సోమవారం జిల్లావ్యాప్తంగా మీకోసం జరుగుతున్న తీరును 'ఆంధ్రజ్యోతి' బృందం పరిశీలించగా మండలాల్లో మొక్కుబడిగా జరుగుతున్నట్లు బహిర్గతమైంది. అధికారుల వ్యవహారశైలితో కొన్నిచోట్ల సమస్యలు చెప్పేందుకు కూడా ప్రజలు ముందుకు రావడం లేదు.

- చాలా మండలాల్లో ఉదయం పది గంటలకు అధికారులే హాజరుకాలేదు. వివిధ శాఖల నుంచి పది మంది అధికారులు ఉండాల్సి ఉంటే ఎక్కువ మండలాల్లో ఇద్దరు, ముగ్గురే వినతులను స్వీకరిస్తున్నారు.
- కొన్ని మండల కార్యాలయాల వద్ద అధికారుల కోసం అర్జీలు పట్టుకొని ప్రజలు వేచి చూస్తుండగా, మరికొన్ని చోట్ల ఏళ్ల తరబడి తిరుగుతున్నారు. అయినప్పటికీ సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- కనిగిరి ఆర్డీవో కార్యాలయంలో ఉదయం పది గంటలకు ఒక్క అధికారి మాత్రమే కనిపించారు. చాలాచోట్ల ఇదే పరిస్థితి కనిపించింది.
- పెద్దారవీడు, కురిచేడు మండల కార్యాలయాలకు నిర్ణీత సమయానికి ఒక్క అధికారి కూడా రాలేదు.
- కంభం, దర్శి, మార్కాపురం గిద్దలూరు, దొనకొండ, కొమరోలు, పుల్లలచెరువు, ముండ్లమూరు, పొదిలి, బేస్తవారపేట, కొనకనమిట్ల, ఒంగోలు... ఇలా ఏ మండల కార్యాలయంలో చూసినా ఇద్దరు, ముగ్గురు లేదా నలుగురికి మించి అధికారులు హాజరుకాకపోవడం కనిపించింది.
- సబ్ కలెక్టర్ పర్యవేక్షణలో సాగే మార్కాపురం డివిజన్ కేంద్రంలోనూ కొద్దిమంది అధికారులే కనిపించారు.
- పామూరులో తహసీల్దార్ వచ్చి కొద్దిసేపటికే బయటకు వెళ్లడంతో అర్జీదారులు ఆయన కోసం గంటల తరబడి నిరీక్షిస్తూ కనిపించారు.


పామూరులో తహసీల్దార్ కోసం ఎదురుచూస్తున్న అర్జీదారులు

పెద్దారవీడు మండలం సానికవరానికి చెందిన గొట్టిముక్కల పెద్దలక్ష్మయ్య పదేళ్లుగా రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. తన తల్లికి ఎర్రగొండపాలెం మండలం గుర్రపుసాల గ్రామ ఇలాకాలో సర్వే నెంబర్ 923లో 3.78 ఎకరాల భూమి ఉందని, పాస్‌బుక్, మాన్యువల్ అడంగల్‌లో పేర్లు కనిపిస్తున్నాయని, ఆన్‌లైన్‌లో మాత్రం నమోదు చేయడం లేదని చెబుతున్నారు. ఈ సమస్యపై ఇప్పటికే తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ అనేక సార్లు తిరిగినా పరిష్కారం కాలేదని పెదలక్ష్మయ్య వాపోయారు.



నాలుగేళ్లుగా తిరుగుతున్నానయ్యా..

భూ సమస్య పరిష్కారం కోసం నాలుగేళ్లుగా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాను. గత ప్రభుత్వంలో ఎవరూ పట్టించుకోలేదు. ఈ ప్రభుత్వంలోనైనా పరిష్కారం అవుతుందన్న ఆశతో వచ్చాను. మాకు 2.56 ఎకరాల సాగభూమి ఉంది. అధికారులు 2.30 ఎకరాల భూమిని మాత్రమే రికార్డుల్లో ఎక్కించారు. 26 సెంట్ల భూమిని రికార్డులో ఎక్కించుకోవడానికి నాలుగేళ్లుగా తిరుగుతున్నా పని జరగడం లేదు. ఇప్పుడైనా అధికారులు స్పందించి తమ సమస్యను పరిష్కరించాలి.

- జంపాల సత్యనారాయణ, రైతు, తూర్పువెంకటాపురం

ఆన్‌లైన్.. ఆఫ్‌లైన్

- రెండు విధాలా అవకాశం
- జిల్లాలో 171 మద్యం దుకాణాలు
- నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ
- 11న లాటరీ

ఒంగోలు (క్రైం), సెప్టెంబరు 30 : నూతన మద్యం విధానం అమలులో భాగంగా ప్రైవేటు దుకాణాల ఏర్పాటుకు రెండు విధాలా దరఖాస్తుకు ప్రభుత్వం అనుమతిచ్చింది. జిల్లాలో 171 దుకాణాలను ఏర్పాటు చేస్తోంది. మంగళవారం నుంచి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఈనెల 9 వరకూ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారు. 10వ తేదీన దరఖాస్తులు పరిశీలించి, 11న కలెక్టర్ సమక్షంలో లాటరీ తీసి మద్యం దుకాణాలు కేటాయిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా 4 శ్లాబ్‌లలో మద్యం షాపులు కేటాయించనున్నారు. మండలాన్ని యూనిట్‌గా తీసుకొన్నారు.

- దరఖాస్తు ఫీజు రూ.2 లక్షలుగా నిర్ణయించారు. డీడీల ద్వారా కానీ, డిజిటల్ పేమెంట్ కానీ చేయవచ్చు. ఆ ఫీజు తిరిగి ఇవ్వరు.
- ఒకరు ఎన్ని దరఖాస్తులైనా చేసుకోవచ్చు. మద్యం దుకాణం మాత్రం ఒక్కటే కేటాయిస్తారు.
- మద్యం దుకాణాల కాలపరిమితి రెండేళ్లు మాత్రమే. రెండో సంవత్సరం లైసెన్స్ ఫీజు 10 శాతం పెంచి చెల్లించాలి.
- మునిసిపల్ కార్పొరేషన్ పరిధి నుంచి ఐదు కిలో మీటర్ల వరకు దుకాణాల ఏర్పాటుకు ఒకే శ్లాబ్ వర్తిస్తుంది. నగర పంచాయతీల నుంచి రెండు కిలోమీటర్ల పరిధి వరకు ఒకే శ్లాబ్ ఉంటుంది.
- మద్యం దుకాణాలకు నేరుగా దరఖాస్తు సమర్పించే వారు నేరుగా ఆయా సర్కిల్ కార్యాలయాల్లో ఇవ్వాలి.
- దరఖాస్తుదారుడు గుర్తింపు కార్డుతోపాటు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తెచ్చుకోవాలి.

విద్యుత్ శాఖ ఎస్ఈగా కట్టా వెంకటేశ్వర్లు



ఒంగోలు(క్రైం), సెప్టెంబరు 30: విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్ఈ)గా కట్టా వెంకటేశ్వర్లు సోమవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఒంగోలులో ట్రాన్స్‌కో విజిలెన్స్ ఈఈగా పనిచేస్తున్న వెంకటేశ్వరును ఇన్‌చార్జి ఎస్ఈగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఇక్కడ ఎస్ఈగా పని చేస్తున్న కేవీజీ సత్యనారాయణను హెడ్ క్వార్టర్‌లోని సీఎండీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. వెంకటేశ్వర్లును ఒంగోలు ఈఈ మాకినేని హరిబాబుతోపాటు పలువురు అధికారులు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



టీచర్ల సిఫార్సు బదిలీలు

- రంగం సిద్ధంచేసిన ప్రభుత్వం
- వివరణ కోసం డీఈవోలకు జాబితాలు

ఒంగోలు (విద్య), సెప్టెంబరు 30: ఉపాధ్యాయుల సిఫార్సు బదిలీలకు కూటమి సర్కారు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. గత వైసీపీ పాలనలో అభ్యర్థన మేరకు జరిగిన బదిలీలు అక్రమమంటూ హడావుడి చేసిన కూటమి పెద్దలు తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే అదే తరహా బదిలీలు చేపట్టేందుకు డీఈవోల నుంచి వివరణ కోరడం పెద్ద సంచలనమైంది. సిఫార్సు బదిలీలు చేపట్టేందుకు దరఖాస్తు చేసుకున్న టీచర్ల వివరాలను జిల్లా విద్యాశాఖాధికారులకు పంపి వాటిపై రిమార్కు కోరారు. కూటమి ప్రభుత్వ పాలన పారదర్శకంగా ఉంటుందని, విద్యాశాఖలో గత ప్రభుత్వ తప్పిదాలకు ఫుల్‌స్టాప్ పడుతుందని గట్టిగా విశ్వసించిన టీచర్లను తాజా పరిణామాలు తీవ్ర నిరాశకు గురిచేశాయి.

డీఈవోలకు జాబితాలు

సిఫార్సు బదిలీల కోసం ప్రభుత్వానికి అభ్యర్థన లేఖలు సమర్పించిన టీచర్ల వివరాలు రాష్ట్ర పాఠశాల విద్య కమిషనర్ కార్యాలయం నుంచి డైరెక్టర్ పార్వతి పేరుతో డీఈవో కార్యాలయాలకు అందాయి. ఆయా ఉపాధ్యాయులు ప్రస్తుతం పనిచేస్తున్న స్థానం, బదిలీ కోరుకుంటున్న స్థానం, తదితర వివరాలను కూడా పంపారు. ప్రస్తుతం అమలులో ఉన్న నిబంధనల ప్రకారం ఆ టీచర్లను బదిలీ చేయవచ్చు. వారి అభ్యర్థనను పరిశీలించి సమగ్ర నివేదికను సమర్పించాలని డీఈవోలను పార్వతి కోరారు.

మంత్రిగారూ.. మాట తప్పొద్దు

మంత్రి లోకేష్‌గారూ.. ఆడిన మాట తప్పి మళ్లీ సిఫార్సు బదిలీలకు తెరలేపవద్దని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చెన్నుపాటి మంజుల, కె.భానుమూర్తి సోమవారం ఒక సంయుక్త ప్రకటనలో కోరారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన సిఫార్సు బదిలీలను అందరూ తీవ్రంగా వ్యతిరేకించారని గుర్తు చేశారు. శాస్త్రీయ పద్ధతిలో జరిగే కౌన్సెలింగ్ బదిలీలకు తూట్లు పొడిచి సిఫార్సులకు రంగం సిద్ధం చేయడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామ న్నారు. తక్షణమే వాటికి స్వస్తి చెప్పాలని డిమాండ్ చేశారు. టీచర్ల బదిలీలు అంటూ జరిగితే కౌన్సెలింగ్ విధానంలోనే చేపట్టాలన్నారు.

స్కూటీని ఢీకొన్న లారీ క్రీడాకారిణి మృతి

మరో యువకుడికి తీవ్రగాయాలు


కావలి రూరల్, సెప్టెంబరు 30: కావలి శివార్లలోని మద్దూరుపాడు వద్ద ఆదివారం అర్ధరాత్రి గుర్తుతెలియని లారీ స్కూటీని ఢీకొంది. దీంతో ఫుట్‌బాల్ క్రీడాకారిణి సన్నిబోయిన మైథిలి (15) మృతిచెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. కావలిరూరల్ పోలీసుల కథనం మేరకు.. ప్రకాశం జిల్లా పొన్నలూరు మండలం చెరుకూరుకు చెందిన వేణు కుమార్తె మైథిలి అదే మండలంలోని ముండ్లమూరిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో 10వతరగతి చదువుతూ ఫుట్‌బాల్ క్రీడాకారిణిగా రాణిస్తోంది. గుంటూరు జిల్లా వినుకొండలో జరిగిన పోటీలకు వెళ్లి 29న తిరిగి ఒంగోలుకు చేరుకుంది. రాత్రివేళ స్వగ్రామం వెళ్లేందుకు బస్సులు లేక తన పక్కింటి కృపాకర్‌ను స్కూటీ తీసుకుని ఒంగోలు రావాలని కోరడంతో అతను వచ్చాడు. అనంతరం ఒంగోలు నుంచి ఇంటికి బయల్దేరిన వారు శింగరాయకొండ నుంచి కందుకూరు మీదుగా చెరుకూరుకు వెళ్లాల్సి ఉంది. అయితే దారితప్పి కావలి బైపాస్‌కు చేరుకున్నారు. మద్దూరుపాడు ఆర్‌కే దాబా వద్ద స్కూటీని రోడ్డు మార్జిన్‌లో ఆపి ఫోన్‌లో లోకేషన్ చూస్తున్నారు. అదేసమయంలో వెనుక వైపు నుంచి వచ్చిన గుర్తుతెలియని లారీ ఢీకొనడంతో మైథిలి కాళ్లు నుజ్జునుజ్జయ్యాయి. కృపాకర్‌కూ తీవ్రగాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన వారిని 108 వాహనంలో కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మైథిలి మృతి చెందింది. నెల్లూరులో కృపాకర్ చికిత్స పొందుతున్నాడు. కావలి రూరల్ సీఐ రాజేశ్వరరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఎస్ఐ బాజిబాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చేపలు దండిగా.. బోట్లు నిండుగా

- కె.పల్లెపాలెం మత్స్యకారులకు టన్నుల కొద్దీపడ్డ చేపలు
- కరువుతీరా వలలకు చిక్కిన కానాగంతల రకం

కొత్తపట్నం(ఒంగోలు నగరం), సెప్టెంబరు 30 : వరుస తుఫాన్లతో వేట సాగక దిగాలుపడ్డ మత్స్యకారుల పంట పండింది. ఆదివారం సాయంత్రం వేటకు వెళ్లిన వారి వలలకు దండిగా చేపలు పడ్డాయి. వారు వేటకు తీసుకుపోయిన బోట్లు చేపలతో నిండిపోయాయి. టన్నుల కొద్దీ చేపలతో మత్స్యకారులు సోమవారం రాత్రికి ఒడ్డుకు చేరారు. ఒకటి కాదు రెండు కాదు వందకుపైగా పడవలతో వేటాడిన మత్స్యకారులకు బోలెడన్ని చేపలు పడ్డాయి. తీరానికి దగ్గరలోనే కానాగంతలు అనే రకం మత్స్యకారులకు వలకు టన్నుల కొద్దీ చిక్కాయి. సముద్రంలోకి వదిలిన వలలు చేపలతో నిండిపోయాయి. వాటిని బయటకు లాగి బోట్లలో వేసుకుని తీరానికి చేర్చుకున్నారు. దీంతో సోమవారం రాత్రి ఏడు గంటల నుంచి కొత్తపట్నం పల్లెపాలెం తీరం మత్స్యకారులతో కోలాహలంగా మారింది. ఒడ్డుకు చేరుతున్న పడవల నుంచి చేపలను ఇతర ప్రాంతాలకు తరలించేందుకు తీరంలో మత్స్యకారులు అప్పటికప్పుడే ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేసుకున్నారు. మత్స్యకారులు, వారి కుటుంబ సభ్యులు చేపలను పడవల నుంచి ఒడ్డుకు చేర్చుకునే పనిలో పడ్డారు. 50టన్నులకుపైగా చేపలు మత్స్యకారుల వలలకు చిక్కినట్లు చెబుతున్నారు. అలాగే తీరానికి వ్యాపారులు క్యూకట్టారు. మత్స్యకారులు వేటాడిన చేపలను కేరళ, గోవా, చెన్నై వంటి నగరాలకు తరలించేందుకు ప్రత్యేక వాహనాలు తీరానికి చేరుకున్నాయి. కానాగంతల రకానికి ఇతర ప్రాంతాల్లో డిమాండ్ ఉండటంతో వ్యాపారులు అప్పటికప్పుడే కొనుగోలు చేసి తరలింపు ప్రారంభించారు. ఒక్కో బోటుకు రూ.50వేలకుపైగా ఆదాయం వస్తుందని మత్స్యకారులు అంటున్నారు.


చేపలను కంటైనర్‌లోకి ఎత్తుతున్న మత్స్యకారులు


బోటు నిండుగా ఉన్న చేపలు


చిన్నారిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న కలెక్టర్ అన్సారియా

తల్లిదండ్రులకు చిన్నారి అప్పగింత

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 30 : శిశుగృహంలో పెరుగుతున్న చిన్నారిని తల్లిదండ్రులకు కలెక్టర్ తమీమ్ అన్సారియా అప్పగించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో సోమవారం జరిగిన కార్యక్రమంలో బాలిక తల్లిదండ్రులు కుండ భాస్కర్‌రెడ్డి, ఆయన సతీమణి నందిని దంపతులకు ఆ పాపను అప్పగించారు. పుల్లలచెరువుకు చెందిన భాస్కర్ రెడ్డి 2022లో నందిని(17)ను బాల్యవివాహం చేసుకొన్నారు. అనంతరం ఆమె గర్భవతి అయింది. ఈ విషయంపై (బాల్యవివాహం) ఎఫ్ఐఆర్ నమోదు చేయడంతో భాస్కర్‌రెడ్డి 60 రోజుల పాటు ఒంగోలు సెంట్రల్ జైలులో ఉన్నాడు. ఆ సమయంలో నందిని 2023లో పాపకు జన్మనిచ్చారు. ఆ పుట్టిన పాపను ఒంగోలులోని శిశుగృహంలో ఉంచారు. పాప తల్లి నందిని మేజర్ కావడంతో పెళ్లి చేసుకొని కలెక్టర్‌ను సంప్రదించారు. దీంతో కలెక్టర్ ఆ చిన్నారిని తల్లిదండ్రులకు అప్పగించాలని డీసీపీవోను ఆదేశించారు. దీంతో సోమవారం కలెక్టర్ అన్సారియా చేతుల మీదుగా ఆ పాపను తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ మాధురి, బాలలసంరక్షణ అధికారి పి. దినేష్‌కుమార్ తదితరులు ఉన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

కనీసవేతనాలు అమలు చేయాలి

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 30 : కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జీవీ కొండారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాకు జి. శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. ధర్నాను ప్రారంభించిన కొండారెడ్డి మాట్లాడుతూ నూతన ఆర్థిక విధానాలు ప్రవేశపెట్టిన తర్వాత ప్రభుత్వ,ప్రైవేటు శాఖల్లో ఉద్యోగులు, కార్మికులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జీతాలు ఇవ్వడంతో పాటు రెగ్యులర్ చేయాలన్నారు. అనంతరం జిల్లాలో అన్ని ప్రాంతాల్లో పరిశ్రమలు, ప్రభుత్వ శాఖల్లోసీఐటీయూ సర్వే చేసిన సమస్యలను కలెక్టర్ అన్సారియాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు, ఎం. రమేష్, తంగిరాల మహేష్, ఎం. సురేష్, కే రాజు, ఆంజనేయులు, ఇశ్రాయేల్, సత్యనారాయణ, బ్రహ్మయ్య, సామ్రాజ్యం, కుమారి, కల్పన, బీఈ రావు తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రంగారావు

నేటి నుంచి
విశాఖ ఉక్కు పరిరక్షణకు దీక్షలు

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 30 : విశాఖ ఉక్కును పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం నుంచి మూడు రోజుల పాటు నిరసన దీక్షలు నిర్వహిస్తున్నట్లు రైతు సంఘం నేత చుండూరి రంగారావు తెలిపారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సోమవారం కేంద్ర కార్మిక సంఘాలు, రైతు, విద్యార్థి, యువజన సంఘాలతో జరిగిన సమావేశానికి రంగారావు అధ్యక్షత వహించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటు పరం చేసేందుకు కుట్ర పన్నిందన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటు పరం కాకుండా కార్మిక సంఘాల సంయుక్త కిసాన్ మోర్చా, ప్రజాసంఘాలు అనేక ఉద్యమాలు నిర్వహిస్తూ వచ్చాయన్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం నుంచి మూడు రోజుల పాటు ఈ నిరసన దీక్షలు జరుగుతాయన్నారు. మంగళవారం యువజన, విద్యార్థి సంఘాలు, బుధవారం కార్మిక సంఘాల ఐక్యవేదిక, గురువారం రైతు సంఘాల ఆధ్వర్యంలో జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు ఎం. రమేష్, జి. శ్రీనివాసులు, జే జయంతిబాబు, పమిడి వెంకట్రావు, కే వీరారెడ్డి, ఎంఎస్ సాయి, ఆర్. మోహన్, సీహెచ్‌వినోద్, వీరాస్వామి, తంగిరాల మహేష్ తదితరులు ఉన్నారు.


మేడా సుబ్బారావు భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న జనార్దన్

మేడాకు దామచర్ల, ఉగ్ర నివాళులు

కొత్తపట్నం(ఒంగోలు నగరం) సెప్టెంబరు 30: కొత్తపట్నం మాజీ జడ్పీటీసీ, తెలుగుదేశం నాయకులు మేడా సుబ్బారావుకు ఆదివారం పలువురు ఘనంగా నివాళులు అర్పించారు. శనివారం సాయంత్రం కొత్తపట్నంలో ఆయన స్వగృహంలో సుబ్బారావు గుండె పోటుతో మరణించారు. ఆదివారం మధ్యాహ్నం ఒంగోలు శాసన సభ్యులు దామచర్ల జనార్దనరావు, కనిగిరి శాసన సభ్యులు ఉగ్ర నరసింహారెడ్డి మేడా సుబ్బారావు పార్థివదేహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఇంకా సీపీఐ జిల్లా నాయకులు ఆర్.వెంకటరావు, ఉప్పుటూరి ప్రకాశరావు, తెలుగుదేశం పార్టీ నాయకులు ద్వారగాపుల శ్రీనివాసరెడ్డి, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షులు బలగాని వెంకటనారాయణ, గేనం సుబ్బారావు, కెపల్లెపాలెం ఎంపీటీసీ నరసింహారావు, వైసీపీ నాయకులు వీరేపల్లి రామచంద్రారెడ్డి, అల్లూరు ఎంపీటీసీ శాంతారావు, ముట్టే కోటేశ్వరరావు, తంబి కాంతారావు తదితరులు నివాళులు అర్పించారు. కాగా సుబ్బారావు మృతదేహానికి ఆదివారం సాయంత్రం కొత్తపట్నంలో అంతిమ సంస్కారాలు నిర్వహించారు.

రెండో సెమిస్టర్ పాఠ్యపుస్తకాలు సిద్ధం

ఒంగోలు(విద్య),సెప్టెంబరు 30 : ప్రభుత్వ రంగ పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతివరకు చదువుతున్న విద్యార్థులకు రెండో సెమిస్టర్ పాఠ్యపుస్తకాలు సిద్ధంగా ఉన్నాయి. జిల్లాలో సెమిస్టర్-2కు 5,70,570 పాఠ్యపుస్తకాలు అవసరం కాగా అన్ని పుస్తకాలు అందుబాటులోకి వచ్చాయి. పాఠ్యపుస్తకాల గోడౌన్‌లో 32,733 పాఠ్యపుస్తకాలు నిల్వ ఉండగా, ప్రింటర్ల నుంచి 5,37,837 పాఠ్యపుస్తకాలు జిల్లాకు వచ్చాయి. వీటిని ఇప్పటికే జిల్లాలోని 38 మండల విద్యావనరుల కేంద్రాలకు చేర్చినట్లు పాఠ్యపుస్తకాల డిపో మేనేజర్ వైవీ శివాజీ తెలిపారు.

కార్పొరేషన్‌లో ఖాళీ కుర్చీలు !


కుర్చీలన్నీ ఖాళీగా ఉన్న కార్పొరేషన్‌లోని రెవెన్యూ కార్యాలయం

పౌరసేవలను పట్టించుకునే వారు కరువు

ఫీల్డ్‌వర్క్ పేరుతో కార్యాలయానికి రాని ఉద్యోగులు
పనుల కోసం కాళ్లరిగేలా తిరుగుతున్న ప్రజలు
నెలల తరబడి పెండింగ్‌లో దరఖాస్తులు
ఇదీ ఒంగోలు కార్పొరేషన్‌లో పరిస్థితి

ఒంగోలు (కార్పొరేషన్), సెప్టెంబరు 30 : ఒంగోలు నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్లక్ష్యం రాజ్యమేలుతోంది. ప్రతి ఉద్యోగి పదిగంటలకే ఆఫీసుకు రావాలని కమిషనర్ హెచ్చరించినా ఆ ఆదేశాలు కాగితాలకే పరిమితం అయ్యాయి. ఇంటి పన్నులు, ప్లానులు, పారిశుధ్యం, తాగునీటి సమస్యలు, ఇలా ప్రజలకు సంబంధించిన అంశాలన్నీ కార్పొరేషన్ కార్యాలయంతో అనుసంధానం అయి ఉంటాయి. అందుకోసం రోజూ వచ్చే అర్జీదారుల సంఖ్య కూడా ఎక్కువే. అయితే తాము కలవాల్సిన అధికారి ముఖం చూద్దామంటే కనీసం వారం, పది రోజులకు కూడా కనిపించే పరిస్థితి ఇక్కడ లేదు. ఎక్కువ మంది రెవెన్యూ సిబ్బంది ఫీల్డ్ వర్క్ పేరుతో ఉదయం 8గంటలకు సరదాగా వచ్చి సంతకం చేసి, వెళితే మళ్లీ ఎప్పుడొస్తారో తెలియని పరిస్థితి ఉంది. అలా అని వారివారి పరిధిలోని ఫైళ్లు పరిష్కరిస్తారా ? అంటే అదీ లేదు. రెవెన్యూ సెక్షన్‌లో 8 మంది ఆర్ఐలు ఉండగా వారి పరిధిలో నెలల తరబడి సుమారు 120కి పైగా అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయి. పన్నులు విధించాలని కొందరు, పన్నులు తగ్గించాలని కొందరు, ఖాళీ స్థలం పన్ను, కొత్తగా ఇంటి పన్ను వేయాలని కొందరు రోజుల తరబడి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు.

ఇదిలా ఉంచితే అభివృద్ధి పనుల ప్రతిపాదనలు అంటూ ఇంజనీరింగ్ విభాగంలోని కొందరు అధికారులు కార్పొరేషన్ కార్యాలయంలో కనిపించని పరిస్థితి ఉంది. మరోవైపు టౌన్‌ప్లానింగ్ విభాగంలోనూ ఫీల్డ్‌వర్క్ పేరుతో కార్యాలయానికి ఎప్పుడు వస్తారో తెలియదు. ఎప్పుడు వెళతారో కూడా తెలియదు. అయితే పారిశుధ్య విభాగానికి సంబంధించి యంత్రాంగం మాత్రమే ఫీల్డు వర్క్‌లో కనిపిస్తుండగా, ఇక అడ్మినిస్ట్రేషన్ విభాగంలో అటెండర్లు కూడా అధికారులుగానే చెలామణి అవుతున్నారు. తీరుబడిగా 11 గంటల తర్వాత వచ్చి ఫోన్‌లో కాలక్షేపానికే పరిమితం అవుతున్నారు. అయితే గత నెలలో కమిషనరు బాధ్యతలు తీసుకున్న తొలి రోజే ప్రతి ఒక్కరూ 10 గంటలకు ఆఫీసు రావాలని, 10.30 తర్వాత రిజిస్టర్ తన చాంబర్‌కు పంపించాలన్నారు. ఫీల్డ్ వర్క్‌లోకి వెళ్ళే సిబ్బంది తప్పనిసరిగా మూమెంట్ రిజిస్టర్‌లో ఏ పనిపై వెళుతున్నారో తెలియజేయాలని ఆదేశించారు. అయితే ఆదేశాలు ఆచరణలో మాత్రం సాధ్యపడటం లేదు. మరోవైపు నెలల తరబడి కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా ప్రజల గోడు మాత్రం పట్టించుకునే నాథుడే కార్పొరేషన్ కార్యాలయంలో కరువయ్యారు.

క్షేత్రస్థాయిలో సమస్యలపై దృష్టి

కలెక్టర్ అన్సారియా ఆదేశం


అర్జీదారుల సమస్యలపై మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

ఒంగోలు(కలెక్టరేట్),సెప్టెంబరు 30 : క్షేత్ర స్థాయిలో అర్జీదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. జిల్లాలోని సుదూర ప్రాంతాల నుంచి తమ సమస్యలు పరిష్కారం అవుతాయని ఎంతోఆశతో అర్జీదారులు వస్తున్నారని, వారి సమస్యలు నిర్ణీత గడువులోపు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సోమవారం జరిగిన కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. ఆయా అర్జీలపై కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. అర్జీదారుల సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి వాటికి సత్వరమే పరిష్కారం చూపే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గడువులోపు అర్జీలు పరిష్కారం కాకపోతే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రెవెన్యూ, పోలీస్‌శాఖలకు సంబంధించి ఎక్కువ సంఖ్యలో అర్జీలు వస్తుంటాయని, ఆ శాఖల అధికారులు వచ్చే అర్జీలపై ప్రత్యేకదృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వరకుమార్, లోకేశ్వరరావు, కుమార్, సునీల్‌కుమార్ తదితరులు ఉన్నారు.

భూ సమస్యను పరిష్కరించండి

35 ఏళ్ల నుంచి సాగు చేసుకుంటున్న తమ భూముల్లోకి దౌర్జన్యంగా ప్రవేశించి దాడిచేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని తాళ్లూరు మండలం తూర్పుగంగవరం పంచాయతీ పరిధిలోని ఏకలవ్య నగర్‌కు చెందిన గిరిజన(ఎస్టీ) ఎరుకుల కులస్థులు వేడుకున్నారు. అక్రమణదారులకు రెవెన్యూ అధికారులు సహకారం అందిస్తున్నారని, అందువల్ల తమకున్యాయం చేసి ఆదుకోవాలని పి వెంకట్రావు, పి. శేషయ్య, సుశీల, శ్రీనివాసరావు, రాంబాబు, సురేష్ తదితరులు కోరారు. ఈమేరకు సోమవారం కలెక్టర్‌అన్సారియాను కలిసి వినతి పత్రం అందజేశారు.

● నా భూమికి పట్టాదారుపుస్తకం మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని రాచర్ల మండలం జేపీ చెరువుకు చెందిన బూరగ బాలరంగస్వామి కోరారు. 1.70 ఎకరాల భూమిని కొనుగోలు చేశానని, ఆ భూమికి గతంలో రిజిస్టర్ డాక్యుమెంట్లు రాచర్ల తహసీల్దార్ మంజూరు చేసి పాసు బుక్ కూడా ఇచ్చారన్నారు. తాను కొనుగోలు చేసిన తర్వాత ఆ భూమిని ఆన్‌లైన్ చేయడం లేదన్నారు. తన భూమిని ఆన్‌లైన్ చేసి పాసుబుక్ మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

చీమకుర్తిలో స్పందన కరువు

చీమకుర్తి : ప్రజా సమస్యల పరిష్కారవేదిక ప్రజల నమ్మకం చూరగొనటంలో విఫలమవుతోంది. సోమవారం చీమకుర్తి మున్సిపాల్టీ పరిధిలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఒక్క అర్జీ కూడా రాకపోవటం పరిస్థితికి అద్దం పడుతోంది. ప్రజా సమస్యలను పరిష్కరిచంటంలో అధికారులు అవలంబిస్తున్న అలసత్వవైఖరితో ప్రజలు తమ సమస్యలు చెప్పుకోవటానికి కూడా ముందుకు రావటం లేదు. దీంతో మొక్కుబడిగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇక మండల పరిధిలో తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన వేదికలో తహసీల్దార్ బ్రహ్మయ్య, ఎంపీఈవో రాఘవేంద్రలు పాల్గొని వినతిపత్రాలు స్వీకరించారు. మ్యూటేషన్‌కు రెండు దరఖాస్తులు వచ్చాయి.


తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న అర్జీదారుడు

మొక్కుబడిగా గ్రీవెన్స్

సంతనూతలపాడు : సంతనూతలపాడు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన గ్రీవెన్స్ మొక్కుబడిగా సాగింది. ప్రజాసమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో కేవలం రెండు అర్జీలు మాత్రమే వచ్చాయని, అవి మ్యుటేషన్‌కు సంబంధించినవని తహసీల్దార్ వి.ఆదిలక్ష్మి తెలిపారు.

సాదాసీదాగా..

నాగులుప్పలపాడు : ప్రజల నుంచి వినతులు స్వీకరించి పరిష్కరించాలని జిల్లా అధికారుల నుంచి ఆదేశాలున్నా క్షేత్ర స్థాయిలో మాత్రం మొక్కుబడిగా సాగుతున్నాయి. సోమవారం మండల తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన మీకోసం వినతుల స్వీకరణలో ఒక్క అర్జీ మాత్రమే దాఖలయింది. తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో మహాలక్ష్మి, ఏపీఎం హనుమంతరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగరాజి , ఏడీఏ నాగభూషణరావు మినహా మిగిలిన శాఖల అధికారులెవరూ హాజరుకాలేదు.పోతవరం గ్రామానికి చెందిన వృద్ధురాలు పెద్దిపోగు మరియమ్మ తన వ్యవసాయ భూమికి సంబంధించిన వివరాలు కోరగా రెవెన్యూ రికార్డులు పరిశీలించి అందిస్తామని తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

అధికారుల గైర్హాజరు


దేవాలయ భూమిని కాపాడాలని వినతిపత్రం ఇస్తున్న గద్దల గుంటపాలెం సీతారామస్వామి ఆలయ కమిటీ సభ్యులు

ఒంగోలు(రూరల్) : ఒంగోలు మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన మీకోసం కార్యక్రమాలకు మండల స్థాయి అధికారులు గైర్హాజరయ్యారు. ఐసీడీఎస్, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఉపాధి హామీ, వెలుగు తదితర శాఖల అధికారులు పాల్గొనలేదు. తహసీల్దార్,వ్యవసాయశాఖ, ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ మాత్రమే పాల్గొన్నారు. భూమిని ఆన్‌లైన్ చేయమని మూడు నెలల నుంచి తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా డీటీ కొర్రీలు వేస్తూ నిలుపుదల చేస్తున్నారని కొప్పోలుకు చెందిన రైతు మన్నెం వెంకటసురేష్ బాబు తహసీల్దార్‌కు విన్నవించారు. అలాగే గద్దల గుంటపాలెం సీతారామస్వామి దేవాలయ భూమిని సర్వేచేసి హద్దులు వేయించాలని గద్దలగుంటపాలెం దేవాలయపాలక మండలి కమిటీ సభ్యులు తోటపల్లి రంగారావు, ఆరిగ నరసింహారావు, దండే వెంకటేశ్వరరావు,ఆరిగ శ్రీనివాసరావు , కొల్లా హనుమంతరావు తహసీల్దార్‌కు విన్నవించారు.

మద్దిపాడులో

మద్దిపాడు : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మీకోసంకు పంచాయతీ అధికారులు డుమ్మాకొట్టారు.ఆ శాఖ ఏఈ హాజరుకాలేదు. దీంతో తాగునీటి సమస్య ఉన్న గ్రామాలు ప్రజా ప్రతినిధులు వచ్చి వెనుతిరిగారు. మల్లవరం గ్రామంలో దేవస్థానం వద్ద గేటు నిర్మించారంటూ వెల్లంపల్లికి చెందిన ఆర్యవైశ్య సంఘ నాయకులు అర్జీ సమర్పించారు. భూ సమస్యను పరిష్కరించాలని రాచవారిపాలెం గ్రామానికి చెందిన మహిళలు కోరారు. తహసీల్దార్ సృజన్‌కుమార్, డీటీ ఆశాజ్యోతి, మండల పరిషత్ సూపరింటెండెంట్ ప్రసాద్ బాబు, మండల విద్యాశాఖ అధికారి, ఆంజనేయులు పాల్గొన్నారు.

చిట్టీల పేరుతో మోసం చేస్తే కఠినచర్యలు

- ఎస్పీ ఏఆర్ దామోదర్



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు(క్రైం)సెప్టెంబరు30: చిట్టీ పాటల పేరుతో ప్రజలను మోసం చేస్తే ఉపేక్షించేది లేదని ఎస్పీ ఏఆర్.దామోదర్ హెచ్చరించారు. సోమవారం ప్రజా సమస్యల ఫిర్యాదు వేదిక కార్యక్రమం సోమవారం స్థానిక ఎస్పీకార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి 97 మంది తమ సమస్యలను ఎస్పీకి నేరుగా విన్నవించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ చిట్టీ పాటల పేరుతో మోసం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చిట్టీలకు డబ్బు చెల్లించే వారు కూడ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనధికారికంగా చిట్లు వేసే వారి వద చిట్లు వేయవద్దని హితవు పలికారు. ప్రజా సమస్యల ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన వినతులను స్వయంగా పరిశీలించి సంబంధిత అధికార్లతో మాట్లాడారు.చట్టపరంగా ఫిర్యాదులను పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎస్వి.శ్రీధరరావు, కె.నాగేశ్వరరావు,సీఐలు సూర్యనారాయణ, పాండురంగారావు సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణిపై దాడి చేసిన ఏడుగురికి రెండేళ్ల జైలు

ఒంగోలు(క్రైం)సెప్టెంబరు30: గర్భిణిపైదాడి చేసిన ఏడుగురు నిందితులకు రెండేళ్ల జైలు , పదివేల జరిమానా విధిస్తు స్థానిక ఎక్సైజ్ కోర్టు న్యాయాధికారి కోమలివల్లి సోమవారం తీర్పునిచ్చారు. నాగులుప్పలపాడు మండలం కనపర్తికి చెందిన నిందితులు పులుగు విఠల్ రెడ్డి ,విజయసింహారెడ్డి, వెంగళరెడ్డి, నరసింహారెడ్డి అలియాస్ భూసిరెడ్డి ,ధనలక్ష్మి, చిలకమ్మ,గాంధీలపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి రెండేళ్ల జైలు శిక్ష, పదివేలు జరిమాన విధించారు.ప్రాసిక్యూషన్ కథనం మేరకు కనపర్తికి చెందిన దొంతిబోయిన లావణ్య గర్భవతి. పాత కక్షల నేపథ్యంలో 2018 డిసెంబరు 12 రాత్రి 10 గంటల సమయంలో పులుగు విఠల్ రెడ్డి మద్యంసేవించి లావణ్య ఇంటిపై రాళ్లు విసిరాడు. ఇదేమిటి అని లావణ్య అడిగినందుకు విఠల్ రెడ్డి తోపాటు మరో ఆరుగురు కలిసి దాడి చేశారు. దీంతో నాగులుప్పలపాడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసిన ఎస్సై సోమశేఖర్ దర్యాప్తు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. ఈమేరకు విచారించిన న్యాయాధికారి నేరం రుజువు కావడంతో నిందితులకు శిక్ష విధించారు. ప్రాసిక్యూషన్ తరపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.శ్రావణ్ కుమార్ వాదనలు వినిపించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు అప్పటి ఎస్సై జి.సోమశేఖర్, ఏఎస్సై పి.శ్రీనివాసరావు, కోర్టు కానిస్టేబుల్ డి.పోతురాజులను ఎస్పీ దామోదర్ అభినందించారు.

ఎన్‌సీసీకి పేస్ విద్యార్థుల ఎంపిక

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 30 : స్థానిక పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం జరిగిన ఎన్‌సీసీ ఎంపికలో 12మంది విద్యార్థినులు, 22 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఫిజికల్, మెడికల్, రన్నింగ్ తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని వీరిని ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో లెఫ్టినెంట్ కల్నల్ వి. మోహన్, ఎ.పృధ్వీ కృష్ణలు పాల్గొన్నారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ అభినందించారు.


హిజ్రాలతో అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

హిజ్రాలు బలవంతపు వసూళ్లకు పాల్పడితే చర్యలు

● **ఎస్పీ ఏఆర్.దామోదర్**

ఒంగోలు(క్రైం)సెప్టెంబరు30: హిజ్రాలు బలవంతపు వసూళ్లకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్పీ ఏఆర్ .దామోదర్ హెచ్చరించారు. సోమవారం స్థానిక పోలీసు కల్యాణ మండపంలో హిజ్రాలకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కొందరు హిజ్రాలు బలవంతపు వసూళ్లు, అసాంఘిక కార్యక్రమాల వలన సమాజంలో చిన్న చూపునకు గురవుతున్నారని అన్నారు. కొందరు గ్రూపులుగా విడిపోయి శాంతి భద్రతల సమస్యలు సృష్టిస్తున్నారని, అలాంటి వారిని ఉపేక్షించేది లేదని చెప్పారు. భిక్షాటన మానుకొని ప్రత్యామ్నాయ జీవనం కొనసాగించాలని కోరారు. ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టిందని వాటిని వినియోగించుకొని గౌరవంగా బతకాలని కోరారు. ఈ సందర్భంగా హిజ్రాలు ఎస్పీ మాటలకు పరివర్తన చెంది తాము గౌరంగా బతుకుతామని చెప్పారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ అశోక్ బాబు, డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు,ఎఆర్ డీఎస్పీ చంద్రశేఖర్, సీఐలు రాఘవేంద్రరావు , శ్రీకాంత్ బాబు ,అజయ్ కుమార్ , హజరత్తయ్య, ఆర్ఐలు రమణారెడ్డి, సీతారామి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ ఎస్ఈ బాధ్యతల స్వీకరణ


ఎస్ఈగా బాధ్యతలు స్వీకరించిన వరలక్ష్మిని అభినందిస్తున్న ఇరిగేషన్ ఎన్‌జీవో సంఘ నాయకులు

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 30 : ఇరిగేషన్ సర్కిల్ ఒంగోలు పర్యవేక్షక ఇంజనీర్ (ఎస్ఈ) డి. వరలక్ష్మి సోమవారం జలవనరులశాఖ ఎస్ఈ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెకు ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ ఎన్‌జీవో అసోసియేషన్ జిల్లా కమిటీ నాయకులు బొకే ఇచ్చి అభినందించారు. అసోసియేషన్ నాయకులు జి. కిరణ్‌కుమార్, తోట శ్రీనివాసరావు, వేముల సునీల్ కుమార్, పాలపర్తి వీరయ్య, బి. కృష్ణ కిషోర్, మగ్దుంషరీఫ్ తదితరులు ఉన్నారు.

రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన


రికార్డులు సరిచేస్తున్న సిబ్బంది

నాగులుప్పలపాడు సెప్టెంబరు 30 : జేసీ గోపాలకృష్ణ ఆదేశాల మేరకు స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఏళ్ల తరబడి అస్తవ్యస్తంగా ఉన్న రెవెన్యూ రికార్డులను ప్రక్షాళన చేసి భద్రపరచడంతో పాటు పౌర సేవల వివరాలతో కూడిన బోర్డులను ఏర్పాటు చేసేలా స్థానిక రెవెన్యూ అధికారులు కసరత్తు ప్రారంభించారు. సోమవారం కార్యాలయంలోని రికార్డు గదిలో క్రమ పద్ధతి లేకుండా పేరుకుపోయిన రికార్డులను తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ జయలక్ష్మీ ఆధ్వర్యంలో వీఆర్‌వోలు,రెవెన్యూ సిబ్బంది బయటకు తీసి గ్రామాల వారీగా క్రమపద్ధతిలో పెట్టారు.

స్వర్ణాంధ్రలో భాగస్వాములు కావాలి

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 30 : స్వర్ణాంధ్రసాధనలో అందరూ భాగస్వాములు కావాలని సమగ్రశిక్ష ఎఎంవో ఎం.రమేష్ పిలుపునిచ్చారు. స్థానిక డీఆర్‌ఆర్ఎం మునిసిపల్ స్కూలులో స్వర్ణాంధ్ర జిల్లా స్థాయి పోటీల ప్రారంభ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం 6నుంచి 10 తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, డిబేట్ పోటీలు నిర్వహించారు. వ్యాసరచనలో షేక్ వసీదా(బి.పేట), ఎ.జోషిరాణి (ఈతముక్కల), కే మహాలక్ష్మి (ఉప్పలపాడు), కన్సొలేషన్ బహుమతులకు బి. గంగాశ్రీ, ఇందుమతి, జి. దక్షిత, పి. కృష్ణ చైతన్యలు ఎంపికయ్యారు. వక్తృత్వంలో వై.లక్ష్మీఅనన్య, టి. తేజేశ్వరి, సీహెచ్ చారిత్‌లు ఎంపికయ్యారు. డిబేట్‌లో సీహెచ్ భవ్యశ్రీలక్ష్మి, షేక్ బసరన్నీసై , షేక్ రియారిజ్వానా, డి. స్వాతిక్, ఎస్, సాయిసహస్ర, కే. రిజితలు విజేతలుగా నిలిచారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేసినట్లు కన్వీనర్ రమేష్ తెలిపారు.

విద్యాసంస్థల బలోపేతానికి కంకణం

ఒంగోలు(విద్య),సెప్టెంబరు 30 : జాతీయ నూతన విద్యా విధానం ప్రకారం విద్యాసంస్థలను బలోపేతం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కంకణం కట్టుకున్నాయని ఆంధ్రకేసరి యూనివర్శిటీ వీసీ డీవీఆర్ మూర్తి అన్నారు. స్థానిక ఇందిరా ప్రియదర్శిని లా కళాశాలలో సోమవారం ఆంధ్రప్రదేశ్ యంగ్ థింక్స్ ఫోరం ఆధ్వర్యంలో ఎన్ఈపీ- 2020 దేశీయవిజ్ఞానం అనే అంశంపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సమావేశానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నటరాజకుమార్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో వీసీ మూర్తి మాట్లాడుతూ భారతీయ విద్యా విధానంలో ఉన్న మెళకువలను పిల్లలకు పాఠశాల దశ నుంచే నేర్పించాలన్నారు. ఈ కార్యక్రమలో ట్రిపుల్ ఐటీ కళాశాల సహాయ ఆచార్యులు కే మల్లికార్జునరావు, ఫోరం ప్రతినిధులు, కళాశాల యాజమాన్యం పాల్గొంది. ఈసందర్భంగా వీసీ మూర్తిని సత్కరించి మెమొంటోను అందజేశారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్

చదువుతో పాటు క్రీడల్లోనూ ముందుండాలి

● **వాలీబాల్ పోటీల ప్రారంభంలో ఎమ్మెల్యే విజయ్‌కుమార్**

సంతనూతలపాడు, సెప్టెంబరు 30: విద్యార్థులు చదువుతో పాటూ క్రీడల్లోను ముందుండాలని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని పేర్నమిట్ట జడ్పీహైస్కూల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయి అండర్-14 బాల,బాలికల వాలీబాల్ పోటీలను ఆయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతోందని, తాను చిన్నపుడు క్రీడలు ఎక్కువగా ఆడేవాడినని తెలిపారు. ప్రభుత్వం సైతం క్రీడలను ప్రోత్సహిస్తున్నదని అన్నారు. అనంతరం ఎమ్మెల్యేను పలువురు ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జనసేన సమన్వయకర్త కందుకూరిబాబు, ఎస్ఎంసీ చైర్మన్ శ్రీలత, ఎంఈవో వెంకారెడ్డి, సరస్వతి కాలేజ్ చైర్మన్ రమణారెడ్డి, పలువురు ఉపాధ్యాయులు, పీడీలు, పీఈటీలు, టీడీపీ, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విగ్రహాలకు 'జలాభిషేకం'

ఒంగోలు (కార్పొరేషన్), సెప్టెంబరు 30 : ఒంగోలు నగరంలోని 110 విగ్రహాలకు జలాభిషేకం నిర్వహిస్తున్నట్లు నగర కమిషనరు కే. వెంకటేశ్వరరావు తెలిపారు. గత కొన్ని రోజులుగా విగ్రహాలకు వేసిన దండలు ఎండిపోవడం, పక్షుల రెట్టలు వేయడం, దుమ్ము, దూళితో ఉన్నటువంటి విగ్రహాలకు ఇకపై ప్రతి నెలా 1వ తేదీన జలాభిషేకం నిర్వహించి శుద్ధి చేస్తామని జరుగుతుందని కమిషనరు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని మేయర్ గంగాడ సుజాత మంగళవారం ప్రారంభిస్తారని కమిషనరు తెలిపారు. ఈ సందర్భంగా ఆయా డివిజన్‌లలో ఉన్నటువంటి విగ్రహాల శుద్ధి కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అదేవిధంగా ఈ కార్యక్రమంలో శానిటరీ అధికారులు, సిబ్బంది, సచివాలయ శానిటరీ సెక్రటరీలు పాల్గొనాలని కమిషనరు తెలిపారు.

రేపు మర్రిపూడిలో ప్రత్యేక గ్రామసభ

దేశవ్యాప్తంగా 750 పంచాయతీల్లో నిర్వహణ

కేంద్రం ఆదేశాలతో అధికారుల ఏర్పాట్లు

హాజరుకానున్న మంత్రి స్వామి, కలెక్టర్

మర్రిపూడి, సెప్టెంబరు 30 : సబ్‌కీ యోజన - సబ్‌కా వికాస్ కార్యక్రమం కింద దేశవ్యాప్తంగా 750 గ్రామ పంచాయతీల్లో గాంధీ జయంతి సందర్భంగా బుధవారం గ్రామసభలు నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. అందులో మన రాష్ట్రంలోని ఐదు జిల్లాల్లో 12 పంచాయతీలు ఉన్నాయి. జిల్లాలో మర్రిపూడి పంచాయతీని ఎంపిక చేసింది. గ్రామంలో జరిగే సభకు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి హాజరు కానున్నారు. 9,931 మంది జనాభా కలిగిన మర్రిపూడిలో 1,680 నివాస గృహాలున్నాయి. పేరుకు మండల కేంద్రం అయినప్పటికీ ప్రజలు సమస్యలతో సహజీవనం చేస్తున్నారు.

పంచాయతీలో సమస్యలివీ..

- మండలంలోనే అతిపెద్దదైన ఇరిగేషన్ చెరువు ఇరవై ఏళ్లుగా నీరురాక ఒట్టిపోయింది. 400 ఎకరాలకుపైగా ఆయకట్టు భూములు బీళ్లుగా మారాయి. ముసి నుంచి సాగర్ కుడి కాలువ నీటిని పైపులైన్ ద్వారా మర్రిపూడి చెరువుకు సరఫరా చేయాలన్న ప్రతిపాదనలను గతప్రభుత్వ హయాంలో అధికారులు సిద్ధం చేశారు. కానీ అది కార్యరూపం దాల్చలేదు.
- మర్రిపూడి చెరువును సాగర్ జలాలతో నింపితే వల్లాయిపాలెం, చిమట, గంగపాలెం, గుండ్లసముద్రం, కెల్లంపల్లి, పన్నూరు, శివరాయునిపేట, కాకర్ల, రామాయపాలెం గ్రామాల చెరువులకు సాగునీరందడంతోపాటు 10 గ్రామాలకు తాగునీటి సమస్య తీరుతుంది.
- నిత్యం కరువు కాటకాలతో తల్లడిల్లే మండల ప్రజలు ఉపాధి పనుల కోసం ఇతర రాష్ట్రాలకు వలస వెళ్తున్నారు. దీంతో వారిపిల్లల విద్య కుంటుపడుతోంది.
- విద్యార్థులకు అవసరమైన వసతి గృహాన్ని ఏర్పాటు చేయాలని ఎన్నోఏళ్లుగా గ్రామస్థులు కోరుతున్నారు.
- వ్యవసాయ బోర్లపై ఆధారపడి రైతులు పంటలు సాగు చేస్తున్నారు.
- సోలార్ ఎనర్జీప్లాంట్ ద్వారా విద్యుత్ సరఫరా చేయాల్సిన అవసరం ఉంది.
- టంగుటూరు-పొదిలి ఆర్అండ్‌బీ రహదారిని అభివృద్ధి చేస్తే దర్శి-మార్కాపురం, కొండపి నియోజకవర్గాల ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగవుతాయి.



మర్రిపూడి గ్రామ ముఖచిత్రం



కాలువను శుభ్రం చేస్తున్న కార్మికుడు

- గ్రామంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేసి కొమ్మువానివాగుకు అనుసంధానం చేయవచ్చు.
- మర్రిపూడి పంచాయతీ పరిధిలోని పృథులగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. వీటన్నింటిపై ప్రత్యేక గ్రామ సభలో తీర్మానం చేసి నిధులు రాబట్టేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



అధికార,ప్రతిపక్ష కౌన్సిలర్ల మధ్య సభలో వాగ్వాదం

బిల్లులపై కౌన్సిల్‌లో గరం గరం

అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్ల మధ్య మాటల యుద్ధం

గత ఐదేళ్లలో మీరుచేసిన నిర్వాకం ఏమిటని ధ్వజమెత్తిన టీడీపీ

చీమకుర్తి,సెప్టెంబరు 30: బిల్లులపై అధికార,ప్రతిపక్ష కౌన్సిలర్ల మధ్య మాటల యుద్ధం జరిగింది. సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి అధ్యక్షతన జరిగిన అత్యవసర సమావేశం గరం గరంగా జరిగింది. వైసీపీ కౌన్సిలర్ సోమా శేషాద్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడునెలల్లో దాదాపు రూ.20 లక్షలు బిల్లులను అధికారులు కాంట్రాక్టర్లకు జమచేశారని ఆరోపించారు. వాటి వివరాలు కౌన్సిల్ ఆమోదం లేకుండా, కనీసం చైర్మన్ దృష్టికి తీసుకురాకుండా బిల్లులు జమచేయటంపై సభలో ప్రశ్నించారు. ఇకనుంచి చైర్మన్, వైసీపీ కౌన్సిలర్ల దృష్టికి తీసుకురాకుండా ఎటువంటి అభివృద్ధి పనిచేసినా అడ్డుకుంటామని,కౌన్సిల్ ఆమోదం ఇవ్వమని హెచ్చరించారు. దీనిపై టీడీపీ కౌన్సిలర్లు గొల్లపూడి రమాదేవి, గోరంట్ల అంజలీలు జోక్యం చేసుకున్నారు. మేము కౌన్సిలర్లుగా గెలవలేదా,మా దృష్టికి తీసుకురావద్దా అని ప్రశ్నించారు. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో మీరు చేసిన నిర్వాకం ఏమిటని ధ్వజమెత్తారు. మా వార్డుల్లో నెలకొన్న సమస్యలను ఎన్నిసార్లు కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చినా పట్టించుకున్నారా అని ప్రశ్నించారు. మా వార్డుల్లో జరిగే పనుల గురించి మాకు తెలియచేశారా.. ఇపుడు మాట్లాడుతున్నారు అని అనటంతో వాగ్వాదానికి దారితీసింది. మధ్యలో వైసీపీ కౌన్సిలర్లు భీమన రమేష్, పాటిబండ్ల గంగయ్యలు మాట్లాడుతూ మా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి,వాటికి మోక్షం కల్గించాలని కోరారు. తదుపరి ఎజెండాలోని 15 అంశాలకు కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది.బోర్ల మరమ్మతులకు అవసరమైన సామగ్రి కొనుగోలు, వీధిదీపాల కొనుగోలుకు ఆమోదం తెలిపారు. మురుగు కాలువల్లో పూడికతీతలకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.22లక్షలతో పనుల నిర్వహణకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ఈ సమావేశంలో కమిషనర్ రామకృష్ణయ్య,కౌన్సిలర్లు,అధికారులు పాల్గొన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం



పోషకాహారాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్, సీడీపీవో, ఎంఈవో

కొండపి, సెప్టెంబరు 30 : పోషకాహారం తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని తహసీల్దార్ పి.మురళి అన్నారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన పోషకాహార ప్రదర్శనను ఆయన పరిశీలించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ కొండపి ప్రాజెక్ట్ సీడీపీవో మాధవీలత, ఎంఈవో-2 కె.సురేఖ, సూపర్ వైజర్ విక్టోరియారాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

'మీకోసం'కు ఐదు వినతులు

కొండపి, సెప్టెంబరు 30 : తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీ కోసం ఐదు వినతులు వచ్చాయి. వాటిలో భూమి కొలతల కోసం రెండు, పొలం ఆన్‌లైన్ కోరుతూ రెండు, సరిహద్దు వివాదం పరిష్కారం కోరుతూ ఒకటి ఉన్నాయని తహసీల్దార్ పి.మురళి తెలిపారు. పొన్నలూరులో తహసీల్దార్ పుల్లారావు, జరుగుమల్లిలో తహసీల్దార్ బి.జనార్దన్ పాల్గొని ప్రజల నుంచి అర్జీలు తీసుకున్నారు.

టీడీపీ నాయకుడికి మంత్రి స్వామి, సత్య పరామర్శ

కొండపి, సెప్టెంబరు 30 : కొండపికి చెందిన టీడీపీ నాయకుడు నన్నూరి సుబ్బరామయ్య తల్లి రమణమ్మ రెండు రోజుల క్రితం మరణించారు. సోమవారం సాయంత్రం రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య కొండపి వచ్చి సుబ్బరామయ్యను పరామర్శించి సానుభూతి తెలిపారు.

పోర్టులు, హార్బర్ల అభివృద్ధికి కృషి

ఒంగోలు, చీరాల వాడరేవు వద్ద ఫిషింగ్ హార్బర్లు

మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య



కొండపిలో కేక్ కట్ చేస్తున్న సత్య

కొండపి, సెప్టెంబరు 30 : రాష్ట్రంలో పోర్టులు, హార్బర్ల అభివృద్ధికి కృషి చేస్తానని మారిటైం బోర్డు చైర్మన్‌గా నియమితులైన దామచర్ల సత్య తెలిపారు. సోమవారం సాయంత్రం స్థానిక మండల పరిషత్ అతిథి గృహంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలోని పోర్టులతోపాటు నిజాంపట్నం, జువ్వలేరు ఫిషింగ్ హార్బర్లు పూర్తి చేస్తామన్నారు. వీటికితోడు ఒంగోలు, చీరాల వాడరేవు ఫిషింగ్ హార్బర్లు ఏర్పాటుకు కృషి చేస్తానని సత్య తెలిపారు. 5వ తేదీ మధ్యాహ్నం 12.30 గంటలకు మంగళగిరిలోని బోర్డు కార్యాలయంలో తాను బాధ్యతలు స్వీకరిస్తానని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సత్య కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన్ను సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చాగంరెడ్డి నరసారెడ్డి, తిప్పారెడ్డి కృష్ణారెడ్డి, మారెడ్డి సుబ్బారెడ్డి, కూనంనేని రమేష్, కందిమళ్ల రమేష్, పోటు శ్రీనివాసరావు, ఆర్యవైశ్య సంఘం నాయకుడు పాదర్తి సుధాకర్ పాల్గొన్నారు. జరుగుమల్లి మండలం కామేపల్లిలోని పోలేరమ్మ ఆలయం, పొన్నలూరు మండలంలోని సంగమేశ్వరస్వామి ఆలయంలో సత్య ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట టీడీపీ నాయకులు ఉన్నారు.

సత్యకు సన్మానం

టంగుటూరు : మారిటైం బోర్డు చైర్మన్‌గా నియమితులైన సత్యను ఒంగోలు యోగా మిత్ర మండలి సన్మానించింది. వల్లూరు సమీపంలోని హైవేస్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో సత్య మాట్లాడుతూ వచ్చే ఐదేళ్లలో రామాయపట్నం పోర్టును పూర్తి చేస్తామన్నారు. యోగా మిత్రమండలి సభ్యుడు తాతా ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో శిద్దా సూర్యప్రకాష్, హర్షిణి కళాశాల కరస్పాండెంట్ గోరంట్ల రవికుమార్, అంజిరెడ్డి, ఆంజనేయులు, చక్రపాణి, శేషాంబరి పాల్గొన్నారు.

రోడ్ ఆక్రమించి వ్యాపారాలు చేస్తే చర్యలు : కమిషనరు



తనిఖీ చేస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు (కార్పొరేషన్), సెప్టెంబరు 30 : నగరంలో రోడ్డు పక్కన ఫుట్‌పాత్ వ్యాపారులు కేటాయించిన జోన్‌లలోనే చేసుకోవాలని, రోడ్‌లు, కాలువలు ఆక్రమిస్తే చర్యలు తప్పవని కమిషనర్ డాక్టర్ కే వెంకటేశ్వరరావు తెలిపారు. రామ్‌నగర్ 1వ లైను నుంచి 8వ లైను వరకు సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రీన్ బెల్ట్ ఆనుకుని ఉన్న ఫుట్‌పాత్ వ్యాపారులతో మాట్లాడారు. నగర ప్రజలకు ఇబ్బంది కలిగేలా రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు చేయకూడదన్నారు. అలాగే, జీజీహెచ్ ముందు అంబులెన్స్‌లు ఉండటాన్ని పరిశీలించిన కమిషనరు వాటికి అవసరమైన ప్రాంతాన్ని చూపాలని, అక్కడ వాహనాలు లేకుండా చూడాలని ట్రాఫిక్ పోలీసులకు సూచించారు. పర్యటనలో భాగంగా మెయిన్ డ్రైయిన్‌లను పరిశీలించిన కమిషనరు ప్రతి రోజూ కాలువల్లో పూడిక తీయాలన్నారు. అలాగే రోడ్లపై చెత్తా, చెదారం లేకుండా చూడాలని ఆదేశించారు. ఇకపై రోడ్డుకు ఇరువైపులా మార్కింగ్ చేస్తామని తెలిపారు. ఆ మార్క్ దాటి ఎవరూ కూడా ముందుకు రాకూడదని తెలిపారు. ఇదే సమయంలో పార్కులను పరిశీలించిన కమిషనరు 15వ ఆర్థిక సంఘం, ఎన్ క్యాప్ నిధులతో చేపట్టిన పార్కులు, పలు అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఇకపై నగరంలో ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామని, అలాగే పారిశుద్ధ్యం మెరుగు తదితర అంశాలపై రోజూ పర్యటించి అవసరమైన చర్యలు తీసుకుంటామని కమిషనరు తెలిపారు. పర్యటనలో కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఒక్కరోజే రూ. 2.10 కోట్లు పన్నుల వసూలు

నగరపాలక సంస్థకు చెల్లించాల్సిన ఆస్తి, నీటి పన్నులు ఒక రోజులోనే రూ. 2.10 కోట్లు వసూలు చేశామని కమిషనరు వెంకటేశ్వరరావు తెలిపారు. మొదటి అర్ధసంవత్సరం పన్నుల గడువు 30వ తేదీతో ముగిసినందున ఇంటి పన్ను రూ. 2.10 కోట్లు, నీటి పన్ను రూ. 20లక్షలు వసూలు చేసినట్లు తెలిపారు. గత సంవత్సరం ఆస్తి పన్ను, నీటి పన్ను రూ. 1.34 కోట్లు మాత్రమే వసూలు కాగా, ఈ ఏడాది సెప్టెంబరు నెలలోనే అదనంగా కోటి రూపాయలు వసూలు చేసినట్లు కమిషనరు తెలిపారు.

నష్టపరిహారం చెల్లించాలి

సంతనూతలపాడు, సెప్టెంబరు 30: మండలంలోని మైనంపాడులో బీపీసీఎల్ కంపెనీ చేపడుతున్న పైపులైన్ పనులకు సంబంధించి రైతులకు భూ పరిహారం, పంట నష్టపరిహారం చెల్లించిన తర్వాతే మొదలు పెట్టాలని ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు డిమాండ్ చేశారు. ఆసంఘం నాయకులు బీపీసీఎల్ జిల్లా మేనేజర్ వెంకటభానుతో చర్చించారు. భూమి నష్టపోయిన రైతులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం భూమి విలువకు రెండున్నర శాతం అదనంగా కలిపి ఇస్తున్నామని, ఇప్పటికే కొంత మంది రైతులకు నష్టపరిహారం ఇచ్చినట్లు మేనేజర్ తెలిపారు. భూమి , పంటనష్టపరిహారం రెండూ కలిపి ఇస్తేనే పనులు మొదలు పెట్టాలని, లేకుంటే అడ్డుకుంటామని హెచ్చరించారు. వెంటనే బీపీసీఎల్ జిల్లా మేనేజర్ భూసేకరణ డిప్యూటీ కలెక్టర్‌తో ఫోన్‌లో సంప్రదించిన అనంతరం రైతులకు నష్టపరిహారం చెల్లించిన తర్వాతే పనులు మొదలు పెడతామని తెలిపారు. రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, జే.జయంతి బాబు, పమిడి వెంకట్రావు, నాయకులు మాబు, బాలకోటయ్య, వెంకటేశ్వర్లు, పెద్దబ్బాయ్, సుబ్బారావు, అంజయ్య, బ్రహ్మయ్య, గోపి, నాయబ్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులను గుర్తించాలి

2న గ్రామసభలు నిర్వహించాలి

కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 30 : జిల్లాలో 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టేందుకు పనులు గుర్తించేందుకు అక్టోబరు 2న గ్రామ సభలు నిర్వహించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి మండల స్థాయి అధికారులతో సోమవారం సాయంత్రం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడారు. పూడిక తీత పనులకు ప్రాధాన్యత తగ్గించి దీర్ఘకాలిక ప్రయోజనాలు కలిగేలా ప్రజల అభిప్రాయాలను, స్థానిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని ప్రణాళికలు రూపొందించాలన్నారు. పనుల గుర్తింపుతో పాటు లేబర్ బడ్జెట్ రూపకల్పనపైనా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. వివిధ శాఖలకు సంబంధించిన కేసులపై ఆయా కోర్టుల్లో సత్వరమే పిటిషన్లు వేయాలన్నారు. కంటెంప్ట్ కేసులు త్వరగా పరిష్కారమయ్యేలా పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. మీ కోసం అర్జీల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. అర్జీలను పరిష్కరించకుండా కలెక్టరేట్‌లో పెండింగ్‌లో ఉందంటూ తప్పుడు ఎండార్స్‌మెంట్ అర్జీదారులకు ఇస్తే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్ రూపకల్పనకు అవసరమైన సూచనలు, సలహాలు ప్రజలు ఇచ్చేలా అవగాహన కల్పించాలన్నారు. సచివాలయ సిబ్బంది ప్రతి ఒక్కరూ వంద మందిని సర్వే చేసేలా పర్యవేక్షించాలన్నారు వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ గోపాలకృష్ణ, వివిధ శాఖల అధికారులు జి. జోసఫ్‌కుమార్, చిరంజీవి, లోకేశ్వరరావు, వెంకటేశ్వర్లు ఉన్నారు

భక్తుల మనోభావాలను దెబ్బతీసిన వైసీపీ ప్రభుత్వం

ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్



ప్రత్యేక పూజలు చేస్తున్న దామచర్ల, రియాజ్, రవిశంకర్

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 30 : తిరుమల కలియుగ దైవం వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రసాదాల్లో కల్తీ నెయ్యివాడి భక్తుల మనోభావాలు దెబ్బతీసే విధంగా గత వైసీపీ ప్రభుత్వం వ్యవహరించిందని ఒంగోలు శాసనసభ్యుడు దామచర్ల జనార్దన్ మండిపడ్డారు.ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత దీక్షకు మద్దతుగా జనసేన పార్టీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక సమతానగర్‌లోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఎమ్మెల్యే జనార్దన్, జనసేన పార్టీ అధ్యక్షుడు షేక్ రియాజ్, ఆపార్టీ నాయకుడు కంది రవిశంకర్‌లకు స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అక్కడ జరిగిన కార్యక్రమంలో దామచర్ల మాట్లాడుతూ అధికారాలు వస్తుంటాయి, పోతుంటాయని, కానీ మన ధర్మం మనం కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పవన్ కల్యాణ్ చేసే దీక్షకు ప్రతి ఒక్కరూ సంఘీభావం తెలపాలన్నారు. జనసేన పార్టీ అధ్యక్షుడు రియాజ్ మాట్లాడుతూ పవిత్రమైన ప్రసాదంగా స్వీకరించి తిరుమల లడ్డూకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. అటువంటి లడ్డూలో కల్తీ నెయ్యి వినియోగించడం దుర్మార్గంగా ఉందన్నారు. జనసేన పార్టీనాయకుడు కందిరవిశంకర్ మాట్లాడుతూ వేంకటేశ్వరస్వామి లడ్డూను కల్తీ చేయడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు చిట్టెం ప్రసాద్, చనపతి రాంబాబు, ముత్యాల కల్యాణ్, బొందిల శ్రీదేవి, పిల్లి రాజేష్, పల్ల ప్రమీల, కోమలి, ఆకుపాటి ఉష, సుంకర కల్యాణి, ముంతాజ్, టీడీపీ నాయకులు మేడికొండ మోహన్‌రావు, శిరిపురం వెంకట్రావు, రావుల పద్మజ, పసుపులేటి సునీత, కుసుమకుమారి, బోను దుర్గా, దుర్గా మల్లేశ్వరి ఉన్నారు.

ఎక్సైజ్ శాఖలో బదిలీల పర్వం పూర్తి

ఉమ్మడి జిల్లాలో 24మంది ఎస్సైలకు పోస్టింగ్‌లు

28 హెడ్ కానిస్టేబుళ్లు, 137 మంది కానిస్టేబుళ్లకు స్థానచలనం

ఒంగోలు(క్రైం), సెప్టెంబరు 30: ఎక్సైజ్ శాఖలో బదిలీల పర్వం పూర్తయ్యింది. ఎక్సైజ్‌లో ఎస్ఈబీ విలీనం కావడంతో డిప్యూటీ కమిషనర్ నుంచి కానిస్టేబుళ్ల వరకు బదిలీలు జరిగాయి. ఆ మేరకు 24 మంది ఎస్ఐలను బదిలీ చేస్తు డిప్యూటీ కమిషనర్ హేమంత్ నాగరాజు ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. అదేవిధంగా 24 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 137 మంది కానిస్టేబుళ్లను ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఖాజామొహిద్దీన్ జిల్లాలో ఆయా సర్కిల్ కార్యాలయలకు కేటాయిస్తు ఉత్తర్వులు ఇచ్చారు. ఉమ్మడి జిల్లాలో ఎస్సైల బదిలీలలో పి.రాజేంద్రప్రసాద్ ఏసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఒంగోలు, ఎం.శ్రీధర్‌బాబు పర్చూరు, డి.ప్రభుదాసు బాపట్ల, ఎస్.మౌనిక బాపట్ల, డి.మౌలాలి ఏసీ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు బదిలీ అయ్యారు. వి.సైమన్ పొదిలి, ఎస్.హర్షవర్ధనరెడ్డి అద్దంకి, బి.అశోక్‌కుమార్ ఒంగోలు, ఎం.సిరినగేష్ చీమకుర్తి, ఏ.శ్రీనివాసరావు బాపట్ల టాస్క్‌ఫోర్స్, డి.శ్రీకాంత్‌రెడ్డి మార్కాపురం టాస్క్‌ఫోర్స్, సీహెచ్.గీత ఒంగోలు, సీహెచ్.విష్ణునందిని పేర్నమిట్ట డిపో, ఎం.వి.గోపాల్‌క్రిష్ణ మార్కాపురం స్టేషన్, ఎంవి.కృష్ణారావు వైపాలెం, టి.రాజేశ్వరి రేపల్లే, పి.రవిఆంజనేయులు ఒంగోలు టాస్క్‌ఫోర్స్, టి.రాజశేఖరనాయుడు సింగరాయకొండ, వై.శ్రీనివాసరావు బాపట్ల, జే.వెంకటేశ్వర్లు అద్దంకి, బి.శ్రీహరి చీరాల, జే.శ్రీరామశ్రీకాంత్ వేమూరు, వీఆర్.సత్యనారాయణ దర్శి, జి.వనజ మార్కాపురానికి పోస్టింగులు ఇచ్చారు.



దారి మరిచి.. పోయింది ప్రాణం

కావలి వద్ద జిల్లా క్రీడాకారిణి మృతి

తోడైన ఎస్‌జీఎఫ్ అధికారుల బాధ్యతారాహిత్యం



ప్రమాద ప్రాంతం(ఇన్‌సెట్లో) మైథిలీ మృతదేహం

ఒంగోలు (కార్పొరేషన్), సెప్టెంబరు 30 : క్రీడాకారుల భద్రత చూసుకోవాల్సిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అధికారుల నిర్లక్ష్యంతో ఓ విద్యార్థిని ప్రాణాలు కోల్పోయింది. పొన్నలూరు మండలం, ముండ్లమూరువారిపాలెంకు చెందిన మైథిలి అనే విద్యార్థిని అటు చదువులతోపాటు ఇటు క్రీడల్లోనూ ప్రతిభ చాటుతుంది. సెప్టెంబరు 27 నుంచి 30వ తేదీ వరకు వినుకొండలో జరిగిన ఫుట్‌బాల్ పోటీలలో పాల్గొంది. కాగా వాస్తవానికి ఈనెల 30వ తేదీ అక్కడే ఉండాల్సిన జట్టు ఒకరోజు ముందు ఆదివారం రాత్రి 10గంటలకు ఒంగోలుకు చేరుకున్నారు. అయితే ఆ తర్వాత బంధువు అంటూ వచ్చిన యువకుడి బైక్‌పై వెళ్లిన విద్యార్థిని ఇంటికి చేరకుండానే దారి తప్పి వెళ్లారు. ఆనక నెల్లూరు జిల్లా కావలి వద్ద రోడ్డుప్రమాదంలో ప్రాణాలు కోల్పోయింది. అయితే జట్టును పోటీలకు తీసుకెళ్ళినప్పటి నుంచి తిరిగి వారిని ఇంటికి చేర్చేవరకు బాధ్యత వహించాల్సిన ఎస్ఎఫ్‌జీ సెక్రటరీ నిబంధనలు తుంగలో తొక్కింది. జట్టుతోపాటు మహిళా టీచర్‌ను తప్పనిసరిగా మేనేజరుగా పంపాల్సి ఉంది. లేనిచో ఆ టీమును రద్దుచేయాలి. టీమును తీసుకెళ్ళినప్పటి నుంచి తిరిగి వచ్చినపుడు సెక్రటరీ దగ్గరుండి జట్టును రిసీవ్ చేసుకోవాలి. తదనంతరం తల్లిదండ్రులకు, సంబంధిత పాఠశాల ఉపాధ్యాయుడు, లేదా హెచ్ఎంకు సమాచారం అందించాలి. వారి అంగీకారం మేరకు పంపాల్సి ఉంది. ఒకవేళ రాత్రివేళ అయితే సెక్రటరీ సంరక్షణలో ఉంచుకుని మరుసటిరోజు ఇంటికి పంపించాల్సి ఉంది. అయితే ఇక్కడ క్రీడాకారులను రిసీవ్ చేసుకోవడానికి సెక్రటరీ రాకపోగా, విద్యార్థులు స్వచ్ఛందంగా వెళ్లిపోయారు. అందులోభాగంగా మైథిలీ ఇంటికి వెళ్లాల్సి ఉంది. కానీ అలా ఇంటికి చేరకుండా ప్రాణాలు కోల్పోవడంతో ఆమె తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. సెక్రటరీ పట్టించుకోకపోవడంతోనే మైథిలీ ప్రాణాలు కోల్పోయిందని ఆరోపిస్తున్నారు.

ఎవరూ స్పందించలేదు

రోడ్డు ప్రమాదం నేపథ్యంలో అక్కడి పోలీసులు ఆమె తల్లిదండ్రులకు సమాచారం అందించగా, వారు పాఠశాల ఉపాధ్యాయులను సంప్రదించారు. విషయం తెలిసిన వెంటనే వారు అధికారులను ఫోన్ ద్వారా సంప్రదించే ప్రయత్నం చేశారు. ఎస్‌జీఎఫ్ సెక్రటరీ స్విచ్ ఆఫ్ రావడంతో వారు హుటాహుటిన ఘటనా స్థలానికి వారు చేరుకోగా, మైథిలీని పోలీసులు అంబులెన్స్‌లో నెల్లూరు తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బాధితులు డీఈవోకు విషయాన్ని తెలియజేయడం కోసం ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదని చెబుతున్నారు. ఎస్‌జీఎఫ్ చైర్మన్‌గా ఉన్న కలెక్టర్ దీనిపై ప్రత్యేక దృష్టి సారించి, నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఐపీఈ వారు చూసుకుంటారు: డీఈవో

ఇదే విషయాన్ని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ప్రెసిడెంట్‌గా ఉన్న డీఈఓ సుభద్రను వివరణకు కోరగా, రెండు రోజుల నుంచి తాము ఆఫీస్ మీటింగ్‌లో బిజీగా ఉన్నామని పేర్కొన్నారు. అయితే విషయం తనదృష్టికి వచ్చిందని, దీనిపై చర్యలు తీసుకోవాల్సింది తాము కాదని, ఐపీఈ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ వారు చూస్తారని సమాధానం ఇచ్చారు.


సబ్‌కలెక్టర్ కార్యాలయంలో హాజరైన ఐదుశాఖల అధికారులు

‘మీ కోసం’ మేమురామంతే

- హాజరుకాని డివిజన్ అధికారులు
- సంవత్సరాలుగా అర్జీలు ఇచ్చిన వారే మళ్లీ అందజేత

ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రతి సోమవారం మీకోసం కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ప్రభుత్వ లక్ష్యం గొప్పగానే ఉన్నా అధికారుల్లో నెలకొన్న నిర్లక్ష్యంతో సమస్యలు సక్రమంగా పరిష్కారం కావడం లేదు. వారానికి ఒక్కపూట కూడా అధికారులు ప్రజల సమస్యలు వినడానికి సమయాన్ని కేటాయించలేక పోతున్నారు.

మార్కాపురం సెప్టెంబరు 30 : మార్కాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన ‘మీకోసం’ కార్యక్రమంలో ప్రతివారం ఐదారు శాఖలకు సంబంధించిన వాళ్లు మాత్రమే హాజరవుతున్నారు. అది కూడా డివిజన్ స్థాయి అధికారులు ముఖం కూడా చూపడం లేదు. కిందిస్థాయి సిబ్బందిని పంపి మమ అనిపిస్తున్నారు. సోమవారం జరిగిన ‘మీ కోసం’ కార్యక్రమంలో ఆరు శాఖలకు చెందిన అధికారులు హాజరయ్యారు. వారిలో డివిజనల్ పంచాయితీ అధికారి మినహా అందరూ ఆయా కార్యాలయాల్లో పనిచేసే కిందిస్థాయి సిబ్బంది మాత్రమే ఉన్నారు. మొత్తం 40 వినతిపత్రాలను అర్జీదారులు అందజేశారు. వారిలో సుమారు 10 మందికిపైగా గతంలో ఎన్నోమార్లు పలు కార్యాలయాల చుట్టూ తిరుగుతూ మళ్లీ మళ్లీ అర్జీలు అందజేసిన వారే కావడం గమనార్హం.

● పొదిలి : తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీ కోసం కార్యక్రమానికి తహసీల్దార్ కృష్ణారెడ్డి, నగరపంచాయతీ కమిషనర్ శ్రీనివాసులు మినహా ఏ అధికారి పాల్గొనకపోవడం విశేషం. అన్ని శాఖల అధికారులు హాజరై ప్రజా సమస్యలు తక్షణమే పరిష్కరించాలి. అయితే అధికారులు లేకపోవడంతో ఫిర్యాదు చేయడానికి వచ్చిన ప్రజలు ఉసూరుమంటూ వెనుదిరిగి వెళ్లారు. కార్యక్రమానికి కేవలం రెండు అర్జీలు మాత్రమే వచ్చాయని తహసీల్దార్ కృష్ణారెడ్డి తెలిపారు. సర్వే చేయడం కోసం ఒకటి, పట్టాదారుపాస్ పుస్తకం కోసం మరొకటి వచ్చినట్లు వివరించారు.

● గిద్దలూరు : గిద్దలూరులోని తహసీల్దార్ కార్యాలయం లో సోమవారం ‘మీ కోసం’ కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ అంజనేయరెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకటదాసు, హార్టికల్చర్ అధికారి విష్ణుప్రియ, విద్యాశాఖాధికారి జింకా వెంకటేశ్వర్లు, మండలపరిషత్ ఏవో మినహా ఏ ఇతర శాఖల అధికారులు ఈ కార్యక్రమానికి హాజరు కాలేదు. ఇక గిద్దలూరు మండలం కంచిపల్లి గ్రామానికి చెందిన తలారి వెంకటేశ్వర్లు కంచిపల్లి చెరువులో పంటలు సాగు చేసుకునేందుకు దున్నుకుంటున్నట్లు అదే గ్రామానికి చెందిన కె.శ్రీనివాసులు తహసీల్దార్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. మొక్కజొన్న సాగు చేసుకునేందుకు వీలుగా తనకున్న 2 ఎకరాలతో పాటు చెరువులో మరో రెండున్నర ఎకరాల మేర ఆక్రమించాడని పేర్కొన్నారు. తలారే ఇలా చేస్తే ఇక ప్రజలు చేయరా? అంటూ తహసీల్దార్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశాడు. కొత్త రేషన్‌కార్డు, పింఛన్లు, పట్టాదారు పాస్‌పుస్తకాలలో నూతన ఎంట్రీలపై పలువురు వినతిపత్రాలు అందజేశారు.

● మార్కాపురం రూరల్ : స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించిన మీకోసం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి మండలంలోని ముఖ్య శాఖల అధికారులు డుమ్మా కొట్టారు. ఉదయం 10.35 నిమిషాలకు తహసీల్దార్ చిరంజీవి ఒక్కరే అందుబాటులో ఉన్నారు. ఆ తరువాత కొంత సమయానికి ఎంఈవో రాందాస్‌నాయక్, మండల సర్వేయర్ సంజీవయ్య, పశువైద్యు లు హాజరయ్యారు. మండలంలో ముఖ్యశాఖల అధి కారులు విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్ పంచాయితీరాజ్, వైద్య, గృహనిర్మాణ, వ్యవసాయ సంబంధిత శాఖల అధికారులు హాజరుకాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారు.

● కొమరోలు : స్థానిక తహసీల్దార్ సోమవారం నిర్వహించిన మీ కోసం కార్యక్రమం తూతూమంతంగా సాగింది. కార్యాక్రమానికి తహసీల్దార్ ఎంపీడీవో, ఏవో హెల్త్ సూపర్‌వైజర్, అంగన్‌వాడీ సూపర్‌వైజరు మాత్రమే సమావేశానికి హాజరయ్యారు. మండల స్థాయి గ్రీవెన్స్ సెల్‌కు కేవలం ఐదుగురు అధికారులే హాజరయ్యారు. మిగిలిన అధికారులు అనుమతి తీసుకోకుండా గ్రీవెన్స్ సమావేశానికి డుమ్మా కొట్టారు. ప్రధానంగా రెవెన్యూ సమస్యలపైనే అర్జీలు వచ్చాయి.

కొనకనమిట్ల : పొలం వెళ్లే దారి విషయంలో మూడేళ్ల నుంచి కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోయిందని బాధితుడు కోటేశ్వరావు సోమవారం తహసీల్దార్‌కు అర్జీ ఇచ్చారు. తహసీల్దార్ కార్యాలయాన్ని సోమవారం ‘ఆంధ్రజ్యోతి’ విజిట్ చేసింది. కొనకనమిట్ల గ్రామానికి చెందిన కోటేశ్వరరావు తన పొలానికి వెళ్లే రహదారిని గ్రామంలోని కొందరు అడ్డుకుంటున్నారని తహసీల్దార్‌కు విన్నవించారు.అదేవిధంగా కాట్రగుంట గ్రామానికి చెందిన రైతు పాసు పుస్తకంలో సర్వేనెంబర్ తప్పుగా నమోదు అయ్యిందని సంబంధిత దస్తావేజులతో తహసీల్దార్‌కు విన్నవించారు. అదేవిధంగా బసవాపురం గ్రామానికి చెందిన మరోరైతు తమ భూమికి ఫ్రీహోల్డ్ సమస్య పరిష్కరించాలని మరో వినతి ఇచ్చారు. కాగా కార్యక్రమానికి నాలుగు శాఖల అధికారులు మాత్రమే హాజరయ్యారు.

● త్రిపురాంతకం : ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రతి సోమవారం నిర్వహించే మీకోసం కార్యక్రమానికి మండల స్థాయి అన్ని శాఖల అధికారులు హాజరుకావాల్సి ఉన్నా ఒకరిద్దరు మినహా అందరూ గైర్హాజరయ్యారు. ఉదయం పది గంటలకు కార్యాలయానికి రావాల్సిన అధికారులు 10 గంటలలోపే తహసీల్దారు రాగా 10.30కు ముగ్గురు, తర్వాత మరో ఇద్దరు అధికారులు హాజరయ్యారు. వారిలో మండల స్థాయి అధికారులు రాకుండా కింది స్థాయి అధికారులు మీకోసం కార్యక్రమానికి హాజరయ్యారు. కాగా కేవలం ఒకే ఒక్క అర్జీ వచ్చింది.



పెద్దారవీడులో సోమవారం ఉదయం 10 గంటల సమయంలో నిర్మానుష్యంగా ఉన్న కార్యాలయం

నామమాత్రంగా మీకోసం

బేస్తవారపేట : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం జరుగుతున్న మీ కోసం కార్యక్రమం తూతూమంత్రంగా జరుగుతోంది. మండలస్థాయి అధికారులు హాజరుకావడంలేదు. సోమవారం విజిట్ చేయగా 11 గంటల వరకు కూడా తహసీల్దార్ జితేంద్ర, ఎంపీడీవో రంగనాయకులు మాత్రమే ఉన్నారు. మిగిలిన అధికారులు రాలేదు. సోమవారం నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో మూడు అర్జీలు మాత్రమే వచ్చాయి. పట్టాదారు పుస్తకాలు కోసం అర్జీలు అందజేశారు.

అలంకారప్రాయంగా ప్రజా ఫిర్యాదుల కేంద్రం

మార్కాపురం వన్‌టౌన్ : మార్కాపురం మున్సిపాలిటీలోని ప్రజా ఫిర్యాదుల కార్యాలయం అలంకారప్రాయంగా మారింది. మీకోసం కార్యక్రమంలో భాగంగా అర్జీలు స్వీకరించేందుకు ఏర్పాటు చేసిన కేంద్రంలో ఇతర పనులు చేసుకుంటున్నారు. పట్టణంలోని మున్సిపల్ పరిధిలోని సమస్యలు పరిష్కరించకునేందుకు ప్రజలు స్థానిక సబ్ కలెక్టర్ కార్యాయంలోనే ఎక్కువగా అర్జీలు ఇస్తుండడంతో ఈ కేంద్రంలో ఎటువంటి ఫిర్యాదులు స్వీకరించడం లేదు. ఇటీవల కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన వీవీఎస్ నారాయణ అర్జీలను తన కార్యాలయంలోనే ప్రజలు అందించాలని సిబ్బందికి సూచించారు. ఈ మేరకు సోమవారం వివిధ సమస్యలు పరిష్కరించమని 2 అర్జీలు వచ్చాయి.

● తర్లుపాడు : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అధికారులు డుమ్మా కొట్టారు. ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తారు. ఈరోజు ఉదయం 11 గంటలకు తహశీల్దార్ జయవర్ధన్ మాజరుకాగా, 11:30 గంటలకు తర్లుపాడు పశువైద్యాధికారి నందన హాజరై పది నిమిషాల్లో తిరిగి వెళ్లిపోయారు. మిగిలిన శాఖల అధికారులు ఎవ్వరూ కూడా హాజరుకాలేదు. కేతగుడిపి, గానుగపెంట నుంచి మంచినీటి సమస్య పరిష్కరించాలని ప్రజలు అర్జీలు ఇవ్వడానికి రాగా అధికారులు ఎవరూ లేక పోవడంతో చాలాసేపు పడిగాపులు కాసి వెనుదిరిగారు.

భూసర్వే ఎల్‌పీ నంబర్ల రద్దు కోసం అర్జీలు

పుల్లలచెరువు : రాష్ట్రప్రభుత్వం ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన ‘మీకోసం’కు కీలక అధికారులు డూమ్మా కొట్టారు. సోమవారం పుల్లలచెరువు తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ‘మీ కోసం’కు తహసీల్దారు నయీంఅహ్మద్, అంగన్‌వాడీ సూపరువైజరు మినహా మిగిలిన ఏ అధికారి కార్యాలయం వైపు తొంగి చూడలేదు. కీలక శాఖలైన విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్, ఏంపీడీవో, ఎంఈవో, ఇరిగేషన్, వెలుగు, వ్యవసాయశాఖ, ఆరోగ్యశాఖ అధికారులు డూమ్మా కొట్టారు. దీంతో మీకోసం కార్యక్రమం తూతూమంత్రంగా నిర్వహించారు. రెవెన్యూకు మూడు అర్జీలు రాగా అందులో రెండు బాట కోసం వచ్చాయి. మరొకటి కవలకుంట్ల రెవెన్యూలో గత ప్రభుత్వం చేసిన రీసర్వేతో తమ భూములు కొలతలు తప్పు వున్నాయని రీసర్వేను రద్దు చేసి పాత సర్వే నెంబర్ల ప్రకారం భూమి చూపించాలని వేముల గౌరమ్మ అనే రైతు తహసీల్దార్ అర్జీ అందజేశారు. రీసర్వే సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని తహసీల్దార్ తెలిపారు. కాగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మీకోసం కార్యక్రమం నిర్వహిస్తుండగా అధికారుల స్పందన అంతంతమాత్రంగానే ఉంది.

● పెద్దారవీడు : పెద్దారవీడులోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీ కోసం కార్యక్రమానికి రెవెన్యూ శాఖ తరపున తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, మండల పరిషత్ తరపున ఎంపీడీవో, వ్యవసాయ శాఖ తరపున ఏవో, ఐసీడీఎస్, ఐకేపీ తరపున మాత్రమే హాజరయ్యారు. అది కూడా సమయపాలన పాటించలేదు. మిగిలిన ఏ శాఖ అధికారులు ఆ వైపు వచ్చిన దాఖలాలు లేవు.

● పెద్దదోర్నాల : స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సోమవారం నిర్వహించే మీకోసం కార్యక్రమానికి అధికారుల హాజరు అంతంత మాత్రంగానే ఉంది. అదే క్రమంలో వినతులు ఇచ్చేందుకు లబ్ధిదారులు కూడా పెద్దగా హాజరు కాకపోవడం గమనార్హం. తహసీల్దారు కిన్నెర శాంతి, వ్యవసాయాధికారి జవహర్‌లాల్‌నాయక్, ఎంపీడీవో కార్యాలయం సూపరింటెండెంట్ ప్రసూనదేవి ఎంఈవో మస్తాన్‌నాయక్, ఏపీఎం పోలయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంజమ్మ హాజరయ్యారు.


బేస్తవారపేటలో ప్రేక్షకుల్లా మిగిలిన ఎంపీడీవో, తహసీల్దార్, మార్కాపురంలో ఉదయం 10.30 గంటల తహసీల్దార్ ఒక్కడే, కంభంలో భూ సమస్యలపై బాధితుడి ఫిర్యాదు

విధుల్లో చేరిన ఎక్సైజ్ సీఐ వెంకటరెడ్డి

మార్కాపురం, సెప్టెంబరు 30: మార్కాపురం ఎక్సైజ్ సీఐగా ఎం.వెంకటరెడ్డి సోమవారం విధుల్లో చేరారు. ఈయన సాధారణ బదిలీల్లో భాగంగా ఒంగోలు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తూ మార్కాపురం వచ్చారు. విధుల్లో చేరిన అనంతరం ఆయన్ను సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన అనంతరం మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమ మద్యం అమ్మకాలను నిలువరిస్తానన్నారు., బెల్టు షాపులు లేకుండా చేస్తామన్నారు.

బైకును ఢీకొన్న కారు - ఒకరికి తీవ్ర గాయాలు

త్రిపురాంతకం, సెప్టెంబరు 30: వేగంగా వస్తున్న కారు రోడ్డు దాటుతున్న బైకును ఢీకొట్టడంతో బైకుపై ఉన్న వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని డీవీఎన్ కాలనీ మెట్ట వద్ద సోమవారం చోటుచేసుకొంది. అన్నసముద్రం గ్రామానికి చెందిన నందిగం అబ్రహాం తన పొలం వద్దకు వెళ్లే క్రమంలో బైకుపై రోడ్డు దాటుతుండగా విజయవాడ నుంచి శ్రీశైలం వెళుతున్న కారు వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అబ్రహాం కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న జాతీయ రహదారి సిబ్బంది ప్రమాద స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని వైద్యశాలకు తరలించారు. ఎస్సై శివ బసవరాజు కేసు నమోదు చేశారు.

కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య

బేస్తవారపేట, సెప్టెంబరు 30 : మండలంలోని శింగరపల్లె గ్రామానికి చెందిన వివాహిత కామూరి రంగమ్మ (38) కుటుంబ కలహాలతో పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకొంది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. మృతురాలకు భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పొదిలి ఎక్సైజ్ సీఐగా అరుణకుమారి బాధ్యతలు



పొదిలి, సెప్టెంబరు 30 : పొదిలి ఎక్సైజ్ సీఐగా టి.అరుణకుమారి సోమవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎక్సైజ్ పరిధిలో అనధికారి కంగా బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. అలాంటి నిర్వహిస్తున్న తెలిస్తే తన దృష్టికి తీసుకురావాలని ఆమె సూచించారు.

గిద్దలూరు ఎక్సైజ్ సీఐగా జయరావు



గిద్దలూరుటౌన్, సెప్టెంబరు 30 : ప్రొహిబిసన్ ఎక్సైజ్‌శాఖ సీఐగా ఎం.జయరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. తిరుపతి జిల్లా వాకాడ ఎక్సైజ్ ఎస్సైగా పని చేస్తున్న జయరావు ప్రమోషన్‌పై గిద్దలూరు సీఐగా బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సీఐ ఎస్.కొండారెడ్డి కంభం ఎక్సైజ్ సీఐగా బదిలీ అయిన విషయం విధితమే.

చెకుముకి పరీక్షలతో సృజనాత్మకత పెంపు

పెద్దదోర్నాల,సెప్టెంబరు 30: చెకుముకి పరీక్షలతో విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందుతుందని జనవిజ్ఞాన వేదిక జిల్లా నాయకులు రవికుమార్ అన్నారు. స్థానిక ఇండియన్ ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సోమవారం చెకుముకి సైన్స్ పరీక్షలు నిర్వహించారు. ప్రశ్నాపత్రాలను ఉపాధ్యాయులు, జేవీవీ నాయకులు అవిష్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ఛైర్మన్ మల్లికార్జున జేవీవీ నాయకులు రవీంద్రా రెడ్డి, ఎల్లారావు, ఉపాధ్యాయ సిబ్బంది చల్లా బిందు, రాఘవ, అరుణ తదితరులు పాల్గొన్నారు.

విక్టర్‌కు ఘన నివాళి

పొదిలి, సెప్టెంబరు 30 : యద్దనపూడి మండలపరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న విక్టర్ అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన మృతదేహాన్ని ఏపీ పంచాయతీరాజ్ మినిస్ట్రీయల్ ఉద్యోగులు సంఘం, పొదిలి సమితి అధ్యక్షులు నలతిమ్ము శ్రీనివాసరెడ్డి సందర్శించి నివాళులర్పించారు.

ఎట్టకేలకు సజావుగా మున్సిపల్ సమావేశం

ప్రజాసమస్యలను లేవనెత్తిన సభ్యులు

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 30: రెండు నెలలుగా వాయిదా పడుతున్న మున్సిపల్ కౌన్సిల్ సమావేశం సోమవారం ఎట్టకేలకు నిర్వహించారు. వైసీపీ ముఖ్యనాయకుడి సూచనలతో వైసీపీ కౌన్సిలర్లు అంతా రెండు నెలలుగా మున్సిపల్ సమావేశాలకు హాజరుకావడం లేదు. ఆదివారం రాత్రి పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సూచనల మేరకు సోమవారం నిర్వహించిన సమావేశానికి వైసీపీ కౌన్సిలర్లు హాజరయ్యారు. అజెండాలోని 24 అంశాలు చర్చకు రాగానే వైసీపీ కౌన్సిలర్ డా. చెప్పల్లి కనకదుర్గ అర్థాంతరంగా సమావేశం నుంచి వెళ్లిపోయారు. ఈ సందర్భంగా జరిగిన చర్చలో టీడీపీ కౌన్సిలర్ నాలి కొండయ్య వైసీపీ కౌన్సిలర్‌ల మధ్య స్వల్ప వాగ్వివాదం జరిగింది. అజెండాలోని 1, 2, 5, 6, 7, 8, 9, 10, 15, 16, 17, 18, 22, 23, 24 అంశాలను ఆమోదించినట్లు ఛైర్మన్ బాల మురళీకృష్ణ ప్రకటించారు. ఈ సందర్భంగా చర్చను ప్రారంభిస్తూ టీడీపీ కౌన్సిలర్ నాలి కొండయ్య మాట్లాడుతూ.. పేదల ఆకలి తీర్చే అన్నక్యాంటీన్‌కు సంబంధించిన పనులు, ప్రజలకు నీరందించే ట్యాంకర్ల సరఫరా అంశాలను ఆమోదించకపోవడం ఏ మేరకు సబబని ప్రశ్నించారు. రెండు నెలలుగా సమావేశాలు జరగక సమస్యలను ఎవరూ పట్టించు కోవడం లేదని మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు ఆగిపోయాయన్నారు. చిన్న చిన్న మరమతులు చేసేందుకు కూడా సామాన్లు లేవని, ప్రజల సమస్యలు పట్టించుకోవాలన్నారు. వైసీపీ కౌన్సిలర్లు బి.నాగేశ్వరరావు, ఎం.శ్రీనివాసు లు మాట్లాడుతూ మీరు మా పనులు ఆపితే మేము మీ పనులు ఆపామన్నారు. ఎవరిని అడిగి 30 మంది వర్కర్లను మీరు తొలగించారని ప్రశ్నించగా గతంలో వైసీపీ హయాంలో వర్కర్లకు జీతాలు ఆపివేశారని మీరు కూడా టీడీపీ వారిని తొలగించి వైసీపీకి చెందిన వారిని నియమించుకోలేదా అని ప్రశ్నించారు. వైస్‌ఛైర్మన్ ఇస్మాయిల్ మాట్లాడుతూ సమస్యలు చెప్పుకునేందుకు కమిషనర్‌తో సహా అధికారులు అందుబాటులో లేరన్నారు. అధికారులు, సిబ్బంది తమ మాట వినడం లేదన్నారు. మధ్యలో ఛైర్మన్ బాల మురళీకృష్ణ జోక్యం చేసుకొని రాజకీయాలకు అతీతంగా ప్రజాశ్రేయస్సుకు సమన్వయంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా ప్రతినిధులకు తగిన గౌరవం ఇవ్వాలన్నారు. వైస్ ఛైర్మన్ ఇస్మాయిల్ మాట్లాడుతూ సాగర్ జలాల రెండో లైన్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో కమిషనర్ డీవీఎస్ నారాయణ, మేనేజర్ శ్రీనివాసన్, ఏఈలు ఆదినారాయణ, శంకర్‌నాయక్, ఆర్‌వో అఫ్జల్‌ఖాన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చెన్నకేశవులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మన్ బాలమురళీకృష్ణ

నరసింహారావును ఆదర్శంగా తీసుకోవాలి


ఎంపీడీవోను సన్మానిస్తున్న అతిథులు

తర్లుపాడు, సెప్టెంబరు 30: వృత్తిపట్ల అంకితభావంతో 37 సంవత్సరాల పాటు సేవలందించిన ఎంపీడీవో ఎస్.నరసింహులను ఆదర్శంగా తీసుకుని ఉద్యోగులు పనిచేయాలని డీఎల్‌డీవో సాయికుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం తర్లుపాడు ఎంపీడీఓ నరసింహులు పదవీవిరమణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు ఎంపీడీవో నరసింహులు చేసిన సేవలను కొనియాడారు. అనంతరం నరసింహుల దంపతులను పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సూరెడ్డి భూలక్ష్మీ, ముండ్లమూరు ఎంపీడీఓ జనార్థన్, మార్కాపురం జెడ్పీటీసీ బాపన్‌రెడ్డి, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు దూదేకుల పెద్ద మస్తాన్, మండల టీడీపీ అధ్యక్షులు ఉడుముల చిన్నపురెడ్డి, ఎంపీడీవో కార్యాలయం సూపరింటెండెంట్ చంద్రశేఖర్‌రావు, వెలుగు ఏపీఎం డి.పిచ్చయ్య పాల్గొన్నారు.

వెలిగొండ ప్రాజెక్టుకు నీరు వదలాలి


ధర్నా చేస్తున్న వ్యవసాయ కార్మికసంఘం నాయకులు

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 30: పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు పూర్తిపరిహారం చెల్లించి వెలిగొండ ప్రాజెక్టుకు నీరు వదలాలని వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. స్థానిక కోర్టు కూడలిలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎన్నికల ముందు స్వార్థ పూరిత ఆలోచనలతో నాటి ముఖ్యమంత్రి జగన్ వెలిగొండ పూర్తి చేయకుండానే ప్రాజెక్టును జాతికి అంకితం చేశానని చెప్పటం సిగ్గుచేటన్నారు. వెలిగొండ ప్రాజెక్టుపై మోసం చేసిన ప్రభుత్వానికి బుద్ధి చెప్పారని అన్నారు. ఇప్పటి ఎన్డీఏ ప్రభుత్వమైనా ఈ ప్రాజెక్టును వెంటనే పూర్తి చేయాలన్నారు.

ఇసుక కొరత లేకుండా చూడండి

మార్కాపురం, సెప్టెంబరు 30: ఇసుక కొరతతో భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కొరవడి అర్థాకలితో అలమటించాల్సి వస్తోందని ఎంపీజే నాయకులు సోమవారం మీ కోసం కార్యక్రమంలో సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఎన్నికలకు ముందు టీడీపీ కూటమి ఉచిత ఇసుక ఇస్తామని హామీ ఇచ్చిందని ఎంపీజే రాష్ట్ర అధ్యక్షులు ఎస్‌ఏ అబ్దుల్‌రజాక్ తెలిపారు. ఉచితమని ప్రకటించినా బహిరంగ మార్కెట్‌లో టన్ను ఇసుక రూ.2 వేలు అమ్ముతుండడంతో భవన నిర్మాణ పనులు సక్రమంగా సాగడంలేదన్నారు. గతంలో టన్ను ఇసుక వెయ్యి నుంచి రూ.1,200 లోపు ఉండేదన్నారు. ఇసుక ధర లను అదుపు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎంపీజే పట్టణ అధ్యక్షులు ఎస్‌కె నాగూర్‌మీరావలి, బేల్దారి మేస్త్రీలు ఉన్నారు.

- పొదుపు గ్రూపులోని ఒక సభ్యురాలికి వత్తాసు పలుకుతూ డబ్బులు కట్టకుండా చేస్తున్న ఐకేపీ ఏపీఎం రమేష్‌పై చర్యలు తీసుకోవాలని పెద్దనాగులవరం గ్రామానికి చెందిన భగత్‌సింగ్ పొదుపు గ్రూపు సభ్యులు సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

- గుండ్లకమ్మపై నిర్మించిన చెక్‌డ్యామ్‌కు ఒకవైపు షట్టర్లు సక్రమంగా ఏర్పాటు చేయకపోవడంతో వర్షాకాలంలో నీరంతా వృధాగా పోతోందని పెద్దనాగులవరం గ్రామ రైతులు అర్జీ అందజేశారు.

అవీ..ఇవీ..

నోడల్ ఆఫీసర్ల నియామకం

గిద్దలూరు, సెప్టెంబరు 30 : గిద్దలూరు మున్సిపాలిటీ పరిధిలోని వార్డు సచివాలయాలకు నోడల్ ఆఫీసర్ల నియామకం చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటదాసు ఒక ప్రకటనలో తెలిపారు. గణేష్‌నగర్‌లోని సచివాలయానికి పి.ఆదినారాయణరెడ్డి, ఏబీఎంపాలెంలోని సచివాలయానికి పి.మధు, బందెలదొడ్డి బజారు సచివాలయానికి సీహెచ్.వినయ్‌కృష్ణ కొంగళవీడు రోడ్డు సచివాలయానికి బీవీ.రంగారావు, క్లబ్ రోడ్డు సచివాలయానికి సయ్యద్ ఈసామియా, కోటగడ్డ సచివాలయానికి కె.రామకోటమ్మ, అర్బన్ కాలనీ సచివాలయానికి వై.రవీంద్రుడు, నంద్యాల రోడ్డు సచివాలయానికి షేక్ టపాఖాదర్‌వలి, నల్లబండ బజారు సచివాలయానికి కె.వోసియా, రాచర్ల రోడ్డు సచివాలయానికి టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ ఎస్.శాంతిని నియమించినట్లు పేర్కొన్నారు. ఈ నోడల్ ఆఫీసర్లు ఆయా సచివాలయాలలో పర్యవేక్షణ బాధ్యతలు చేపట్టి ప్రాపర్టీ ట్యాక్స్, వాటర్ ట్యాక్స్, ఆక్రమణ రుసుము, ప్రకటనలపై పన్నులు, ఖాళీ స్థలాలపై పన్ను, రోడ్డుకటింగ్ చార్జీలు, సెల్‌టవర్, టెలికం తీగల చార్జీల వసూలు పర్యవేక్షణ చేస్తారని, ప్రతి నెలా 1వ తేదీనే పింఛన్ల పంపిణీ చేయిస్తారన్నారు. ప్రభుత్వ పథకాల, కార్యక్రమాల అమలును పర్యవేక్షిస్తారని సచివాలయ సర్వీసుల ద్వారా వచ్చిన రుసుములను మరుసటి రోజే బ్యాంక్‌లో జమ అయ్యే విధంగా చూస్తారని కమిషనర్ వెంకటదాసు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

శ్రీకాంత్‌కు సేవారత్న అవార్డు

గిద్దలూరు, సెప్టెంబరు 30 : రాచర్ల మండలం చినగానిపల్లె గ్రామానికి చెందిన చిన్న సేవాసంస్థ అధ్యక్షులు మాగులూరి శ్రీకాంత్ మదర్‌థెరిస్సా సేవారత్న అవార్డు పొందాడు. గుంటూరులోని అమ్మఒడి చారిటబుల్ ట్రస్టు 6వ వార్షికోత్సవం సందర్భంగా వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టి విద్యార్థికి కృషి చేస్తున్న శ్రీకాంత్‌కు మదర్‌థెరిస్సా సేవారత్న అవార్డును ట్రస్టు ఛైర్మన్ అల్లాడి శ్రీనివాసరావు అందించి అభినందించి సన్మానించారు.

వరద బాధితులకు రూ.50 వేలు విరాళం


చెక్కును అందజేస్తున్న ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు

మార్కాపురం, సెప్టెంబరు 30: వరద బాధితుల సహాయార్థం మార్కాపురం ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో సేకరించిన రూ. 50 వేలను సోమవారం మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డికి సోమవారం జర్నలిస్టులు అందజేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లోని సభ్యులు స్వచ్ఛందంగా విరాళాలు అందించారు. ఆ మొత్తాన్ని ముఖ్యమంత్రి సహాయనిధి పేరున డీడీ తీసి ఎమ్మెల్యేకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నారాయణరెడ్డి మాట్లాడుతూ వరద బాధితుల కోసం విలేకరులు విరాళాలు సేకరించి సీఎంఆర్‌ఎఫ్‌కు అందించడం అభినందనీయ మన్నారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు డి.మోహన్‌రెడ్డి, వి.వెంకటేశ్వరరెడ్డి, గౌరవాధ్యక్షులు కె.రామకృష్ణ, ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు ఎస్‌వి రమణ తదితరులు పాల్గొన్నారు.

తోటి కార్మికుడికి కార్పెంటర్ల తోడ్పాటు

- ప్రమాదంలో గాయపడ్డ కార్పెంటర్‌కు నిత్యావసరాలు అందజేత


నిత్యావసరాలు అందజేస్తున్న కార్మికులు

మార్కాపురం, సెప్టెంబరు 30: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్దనే ఉంటున్న కార్పెంటర్‌కు సహచర కార్మికులు అండగా నిలిచారు. ఇళ్లు గడవడమే కష్టంగా ఉన్న ఆయనకు ఒక నెలకు సరిపడా నిత్యావసరాలు అందించి సహృదయతను చాటుకు న్నారు. పట్టణానికి చెందిన నాగేశ్వరరావు కార్పెంటర్ పనిచేసుకుంటూ జీవిస్తున్నాడు. పదిరోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. చేతిలో వున్న డబ్బులు వైద్యానికి సరిపోయాయి. ఇళ్లు గడవడం కూడా కష్టంగా మారింది. ఈ విషయం తెలుసుకున్న తోటి కార్మికులు మరికొందరి నుంచి నగదు సేకరించి ఒక నెలకు సరిపడా నిత్యావసర సరుకులను కొనుగోలు చేసి నాగేశ్వరరావుకు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో కార్పెంటర్‌ల యూనియన్ మాజీ అధ్యక్షులు షేక్ నాగూర్‌మీరావలి , పులిచెర్ల రమేష్, సయ్యద్ ఇమామ్, రమణ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సేవలు ఆదర్శనీయం

మార్కాపురం, సెప్టెంబరు 30: అంగన్‌వాడీల సేవలు ఆదర్శనీయమైనవని మార్కాపురం సబ్‌కలెక్టర్ వెంకట త్రివినాగ్ అన్నారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఐసీడీఎస్ మార్కాపురం ప్రాజెక్టు ఆధ్వర్యంలో పౌష్టికాహార వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సబ్‌కలెక్టర్ పరిశీలించారు. వారు తయారుచేసిన ఆహార పదార్థాలను రుచిచూశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, బాలికలకు పోషకాహారంపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. పౌష్టికాహార లోపంతో ఎంతోమంది రోగాల పాలవుతున్నారని అన్నారు. కార్యక్రమంలో సీడీపీవో సుశీలాదేవి, సూపర్‌వైజర్లు రవికుమారి, క్రిష్ణవేణి, రమాదేవి, కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

ఎంపీడీవోగా వసంతరావు నాయక్ బాధ్యతలు

పుల్లలచెరువు, సెప్టెంబరు 30: పుల్లలచెరువు ఎంపీడీవోగా వసంతరావు నాయక్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సోమవారం పుల్లలచెరువు ఎంపీడీవో కార్యాలయంలో రిపోర్టుచేసి ఆయన తన బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీవో సిబ్బంది ఆయనను కలిసి అభినందనలు తెలిపారు. కందుకూరులో పనిచేస్తున్న ఆయన బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఎంపీపీ కే.వెంకటయ్య ఆయనను కలిసి అభినందనలు తెలిపారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక


ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన అభి

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 30: మార్కాపురం బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన ఎం.అభి రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ జట్టుకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం అభిని అభినందించి మాట్లాడారు. ఒంగోలు మున్సిపల్ స్కూల్ మైదానంలో అండర్-17 బాలుర జిల్లా ఫుట్‌బాల్ టీం సభ్యునిగా అభి ఎంపికై జిల్లా తరుపు నుంచి రాష్ట్ర స్థాయిలో జరిగే ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.జాహ్నవి ప్రియ, చెన్నకృష్ణ పాల్గొన్నారు.

ఎంపీడీవోగా రంగనాయకులు బాధ్యతలు

బేస్తవారపేట, సెప్టెంబరు30: బేస్తవారపేట మండల ఎంపీడీవోగా పల్నాడు జిల్లా నుండి ఏవీ.రంగనాయకులు నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. సోమవారం టీడీపీ మండల నాయకులు ఎంపీడీవోను సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు సోరెడ్డి మోహన్‌రెడ్డి, బోయిళ్ల రోషన్‌బాబు, సైదులు, మూప్పూరి రాము, బీసు అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్‌కు షోకాజ్ నోటీసు

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 30 : గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలలోని డాక్టర్ శ్రీకాంత్‌కు షోకాజ్ నోటీసు జారీ అయింది. మండలంలోని మోడంపల్లి గ్రామానికి చెందిన నిరంజన్‌రెడ్డి (11) అనే బాలుడు ఆదివారం సాయంత్రం రోడ్డు ప్రమాదానికి గురికాగా ఆ బాలుడిని తల్లిదండ్రులు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్ళిన సందర్భంలో డ్యూటీలో ఉండాల్సిన డాక్టర్ ఆసుపత్రిలో లేకపోవడం నర్సులు ప్రథమచికిత్స అందించి ప్రైవేటు ఆస్పత్రికి పింపారు. మార్గమధ్యంలో బాలుడు మృతిచెందిన విషయం విధితమే. డ్యూటీలో ఉండాల్సిన డాక్టర్ ఉండి ఉంటే తమ కుమారుడు బ్రతికి ఉండేవాడని తల్లిదండ్రులు వాపోయారు. డాక్టర్ నిర్లక్ష్యం కారణంగానే తమ కుమారుడు మృతిచెందాడని బాలుడి తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడం, మీడియాలో ప్రముఖంగా వార్తలు రావడంతో ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎస్.సూరిబాబు స్పందించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన డాక్టర్ శ్రీకాంత్‌కు షోకాజ్ నోటీసు జారీ చేసి, ఆమేరకు ఉన్నతాధికారులకు సమాచారం అందించినట్లు డాక్టర్ సూరిబాబు తెలిపారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

పామూరు, సెప్టెంబరు 30: పామూరులో అనుమానాస్పదంగా సోమవారం ఓవ్యక్తి మృతిచెందాడు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ కాలనికి చెందిన సిద్దవటం వెంకటేశ్వర్లు (46) తనకు చెందిన లారీతో బాడుగకు వెళ్లాడని కుటుంబసభ్యులు తెలిపారు. నెల్లూరు రోడ్డువైపు నూతనంగా నిర్మిస్తున్న 167-బి జాతీయ రహదారి వద్ద తన లారీ నిలిపిఉండగా, వెంకటేశ్వర్లు మృతి చెందిఉన్నాడు. మృతదేహాన్ని పరిశీలిస్తే కాళ్లకు తాడు కట్టుకొని, లారీ క్యాబిన్‌కు తాడు కట్టి మెడకు బిగించుకొని మృతి చెంది ఉన్నాడు. ఆత్మహత్యకు పాల్పడే వ్యక్తి తన కాళ్లకు ఎందుకు తాడు కట్టుకొంటాడని, ఇది ఎవరో హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని మృతిని భార్య ఆరోపిస్తున్నారు. సీఐ ఎం.భీమానాయక్ ఆధ్వర్యంలో ఎస్ఐ కిశోర్‌బాబు మృతదేహాన్ని పరిశీలించారు. కందుకూరు నుంచి డాగ్‌స్కాడ్, వేలిముద్రల సేకరణ బృందాన్ని రప్పించారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని కనిగిరి తరలించారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రుణాల రికవరీ చేపట్టాలి

పామూరు, సెప్టెంబరు 30: రుణాల రికవరీలో పామూరు మండలం చివరి స్థానంలో ఉందని ఏపీఎం జి.విద్యాసాగర్ అన్నారు. గ్రామైక్య సంఘాల లీడర్లు రికవరీపై దృష్టి సారించాలన్నారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీనిధి బకాయిలు కోటి రూపాయల వరకు ఉన్నాయని చెప్పారు. దాంతో నూతన రుణాలు మంజూరు నిలిచిపోయాయన్నారు. ఉమ్మడి పద్మ, షేక్ మస్తాన్ బీ, ఆర్.సరళ, షేక్ జిలాని. కె.శ్రీనివాసులు, ఎ.సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలి

పామూరు, సెప్టెంబరు 30: గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో వృథాగా పడిఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని టీడీపీ రాష్ట్ర విభిన్న ప్రతిభావంతల కమిటీ ప్రధాన కార్యదర్శి అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి అన్నారు. సోమవారం మండలంలోని బొట్లగూడూరులోని చెత్త సంపద కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ వై.బాల, పంచాయతి కార్యదర్శి కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

'మంచి ప్రభుత్వానికి ప్రజల మద్దతు'

పామూరు, సెప్టెంబరు 30: అధికారంలోకి వచ్చిన వందరోజుల్లోనే అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందజేస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజల మద్దతు ఉంటుందని టీడీపీ నాయకులు, అచ్చమాంబ దేవస్థాన చైర్మన్ అడుసుమల్లి నరసింహంలు అన్నారు. మండలంలోని అప్పబాంబాపురం గ్రామంలో సోమవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రభుత్వం ముద్రించిన కరపత్రాలను పంచుతూ ఇంటి గోడలకు స్టిక్కర్లు అతికించారు. కార్యక్రమంలో మాల్యాద్రి, ఎ.సురేష్, బి.వెంకటేశ్వర్లు, ఎం.పాపయ్య, టీవీ నారాయణ, ఎం.జనార్దన్, ఆర్.నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సామగ్రి పంపిణీ

కనిగిరి, సెప్టెంబరు 30: కనిగిరి పట్టణానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అళహరి మహీధర్ సోమవారంం కేవిపల్లి హైస్కూల్ విద్యార్థులకు స్టేషనరీ సామగ్రి అందజేశారు. రూ.40 వేలు విలువకలిగిన రైటింగ్ ప్యాడ్స్, పెన్నులు, జామెంట్రీ బాక్సులను 500మంది విద్యార్థులకు పంపిణీచేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విజయభాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రహసనంగా 'మీ కోసం'

- భూసమస్యలపై కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు
- సమయపాలన పాటించని అధికారులు
- పలువురు గైర్హాజరు



ముండ్లమూరు: మీ కోసంలో పాల్గొన్న తహసీల్దార్ లక్ష్మీనారాయణ, హౌసింగ్ ఏఈ హనుమంతరావు

భూ సమస్యలతో పాటు, ఇతర సమస్యలను పరిష్కరించేందుకు ప్రతి సోమవారం నిర్వహిస్తున్న మీ కోసం ప్రహసనంగా మారింది. అధికశాతం మంది అధికారులు హాజరుకాలేదు. తాళ్లూరు, దొనకొండ మండలాల్లో అర్జీలు దాఖలు లేదు. మిగిలిన మండలాల్లో కూడా మొక్కుబడిగా వచ్చాయి. ఆంధ్ర జ్యోతి విజిట్ చేయగా అధికారుల అలసత్వం వెల్లడైంది. ఏళ్ల తరబడి తిరుగుతున్నా సమస్యలు పరిష్కారం కావడంలేదని అర్జీదారులు పెదవి విరుస్తున్నారు.

ఆంధ్రజ్యోతి విజిట్



దర్శిలో జరిగిన మీకోసంలో హాజరైన అధికారులు

కనిగిరి, సెప్టెంబరు 30: మీ కోసం కార్యక్రమం ప్రహసనంగా మారింది. సోమవారం కనిగిరిలో తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాలను ఆంధ్రజ్యోతి విజిట్ చేయగా అధికారుల అలసత్వం బహిర్గతమైంది. ఆర్డీవో కార్యాలయంలో డీఏఓ ఒక్కరే హాజరయ్యారు. ఎంపీడీవో, కమిషనర్, ఇతర శాఖల మండల, డివిజన్‌స్థాయి అధికారులు గైర్హాజరయ్యారు.

కనిగిరి మండలం శంఖవరం గ్రామానికి చెందిన వేశపోగు అచ్చమ్మకు 50ఏళ్ల క్రితం 743/3లో 2.60 ఎకరాల అసైన్డ్ భూమిని ప్రభుత్వం పంపిణీ చేసింది. ఆమె మృతి చెందిన తర్వాత ఆ భూమి ఓ వైసీపీ నేత పేరుపై నమోదై ఉంది. గత ప్రభుత్వం 20ఏళ్ల క్రితం పంపిణీ చేసిన భూములన్నీ ఫ్రీహోల్డ్ కింద మార్పు చేసి భూమిని హక్కును కల్పించింది. దీంతో అక్రమార్కులు కథ నడిపినట్లు వేశపోగు అచ్చమ్మ మనవడు వేశపోగు డేవిడ్ ఆరోపిస్తున్నాడు. తమ భూమిని భూరికార్డుల్లో మార్చి అక్రమంగా భూమిని అమ్ముకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈవిషయమై పలుమారు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

రెండు అర్జీలు మాత్రమే దాఖలు

దర్శి, సెప్టెంబరు 30: సమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన మీ కోసం కార్యక్రమం సోమవారం మొక్కుబడిగా జరిగింది. అధికశాతం అధికారులు హాజరుకాలేదు. డిప్యూటీ తహసీల్దార్ దేవప్రసాద్, నగర పంచాయతీ కమిషనర్ వై.మహేశ్వరరావు మాత్రమే సకాలంలో హాజరయ్యారు. తహసీల్దార్ సెలవులో ఉన్నారు. కీలకమైన శాఖల అధికారులు గైర్హజరవుతుండటంతో ప్రజలు కూడా రావటం లేదు. కేవలం రెండు అర్జీలు మాత్రమే దాఖలయ్యాయి.

ముండ్లమూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మీ కోసం మొక్కుబడిగా సాగింది. ఉదయం పది గంటలకు తహసీల్దార్ ఎల్.లక్ష్మీనారాయణ, హౌసింగ్ ఏఈ హనుమంతరావు మాత్రమే హాజరయ్యారు. 10.59 గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ ఎస్.సత్యనారాయణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత హాజరయ్యారు. మిగిలిన అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడలేదు. కేవలం రెవెన్యూ పరమైన సమస్యలపై మాత్రమే పది అర్జీలు వచ్చాయి.

దొనకొండ: దొనకొండ తహసీల్దార్ కార్యాలయంలో నిర్వ హించిన మీ కోసం కార్యక్రమంలో ఒక్క అర్జీ కూడా రాలేదు. తహసీల్దార్ సెలవులో ఉండటంతో రీసర్వే డీటీ శివరామకృష్ణ హాజరయ్యారు.



పామూరు: భూ సమస్యలపై తహసీల్దార్‌కు అర్జీలు ఇస్తున్న రైతులు



పీసీపల్లి: 10.30గంటల సమయంలో మీకోసం కార్యక్రమంలో పాల్గొన్న నలుగురు అధికారులు

విద్యాశాఖ, వ్యవసాయశాఖ, ఆరోగ్యశాఖ, గృహనిర్మాణ శాఖ, ఆర్‌డ బ్ల్యూఎస్ శాఖల అధికారులు మాత్రమే కార్యక్రమంలో పాల్గొన్నారు.

కురిచేడు: పడమరగంగవరం గ్రామానికి చెందిన అన్నెం అంజిరెడ్డి సంవత్సరాలుగా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తన భూమి తనకు ఇప్పించాలని తిరుగుతున్నాడు. హైకోర్టు నుంచి కూడా ఆర్డరు తెచ్చుకున్నా ఫలితం లేదు. ఇంతవరకు తనకు చూపలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన మీసేవలో ఐదు అర్జీలు వచ్చాయి. అవికూడా భూవివాదాలకు సంబంధించినవి కావడం విశేషం.

ఎక్కువమంది అధికారులు గైర్హాజరు కావడంతో తహసీల్దార్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

భూ సమస్యలను పరిష్కరించరూ..

పామూరు, సెప్టెంబరు 30: భూసమస్యలను పరిష్కరించాలని కోరుతూ పలువుర తహసీల్దార్ బీవీ రమణారావుకు అర్జీలు ఇచ్చారు. అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన ఎం మాలకొండయ్య కుమారులు తమ తండ్రిపై ఉన్న 5 ఎకరాల భూమిని మ్యుటేషన్ చేసి ఆన్‌లైన్‌లో తన పేరు ఎక్కించాల్సిందిగా కోరుతూ అర్జీ ఇచ్చారు. అలాగే, పోతవరం గ్రామానికి చెందిన నాగయ్య తమ భూమికి సంబంధించిన రికార్డులోని తప్పులను సవరించాలని తహసీల్దార్‌కు అర్జీ ఇచ్చారు.

అధికారుల డుమ్మా

పీసీపల్లి, సెప్టెంబరు 30: ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం చేపట్టిన మీకోసం కార్యక్రమానికి అధికారులు డుమ్మా కొట్టారు. స్థానిక తహసీల్దార్ కార్యా లయంలో సోమవారం జరిగిన మీకోసం కార్యక్రమాన్ని ఆం ధ్రజ్యోతి విజిట్ చేసింది. పది గంటలకల్లా అన్నిశాఖల అధికారులు ప్రజల వినతులను స్వీకరించేందుకు అందుబా టులో ఉండాలి. 10.30కి తహసీల్దార్, డీటీ, ఎంఈవో, ఏపీఎం సత్యానందం, హెల్త్ సూపర్‌వైజర్ హాజరయ్యారు.

తన భార్య పేరుపై ఉన్న భూమిని మార్చుకునేందుకు వారం రోజులుగా తిరుగుతున్నా వీఆర్వో దొరకడం లేదని వెంగళాయపల్లికి చెందిన కరణం చంద్రయ్య అన్నారు. తన భార్య మరణించడంతో ఆమె పేరు మీద ఉన్న 2.90 ఎకరాల భూమిని మార్చుకునేందుకు అగచాట్లు పడుతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు.

తాళ్లూరు: మీ కోసం కార్యక్రమానికి అధికారులు గైర్హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి తహసీల్థార్ మాత్రమే హాజరయ్యారు. ఎంపీడీవో కార్యాలయంలో మండల పరిషత్ సమావేశం జరుగుతుండటంతో మండలస్థాయి అధికారులు సమావేశం సాకుచూపి ఈ కార్యక్రమానికి డుమ్మా కొట్టారు.

నాగులచెరువులో ఆక్రమణలను తొలగించాలి

- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ఆదేశం

కనిగిరి, సెప్టెంబరు 30: నాగులచెరువులో ఆక్రమణలను వెంటనే తొలగించాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి రెవెన్యూ, ఇరిగేషన్ అదికారులను ఆదేశించారు. సోమవారం పట్టణ శివారులోని నాగులచెరువును ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చెరువులను ఆక్రమిస్తే భవిష్యత్తుతరాలు ఆపదలో పడే ప్రమాదముందన్నారు. వేరే సర్వేనెంబర్లు వేసి నాగులచెరువును ఆక్రమించారని పేర్కొన్నారు. రికార్డుల ఆధారంగా నాగులు చెరువు, అలుగు, వాగులు, వంకలు, పరీవాహక ప్రాంతాల భూమిని సర్వే చేసి నాగులచెరువు విస్తీర్ణం బహిర్గతం చేసి బోర్డులను, హద్దులను ఏర్పాటుచేయాలని అధికారులకు సూచించారు. దశాబ్ద కాలంగా చెరువులను పట్టించుకోకపోవడంతో చెరువులో విపరీతంగా పిచ్చిచెట్లు మొలిచాయన్నారు. చెరువులో పూడిక పనుల చేయించాలన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు, టీడీపీ నాయకులు తమ్మినేని వెంకటరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, బాలు ఓబులురెడ్డి పాల్గొన్నారు.



నాగులచెరువు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

ఆటో చోదకులు నిబంధనలు పాటించాలి

దర్శి, సెప్టెంబరు 30: దర్శి ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న ఆటోలను నివారించేందుకు దర్శి మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, పొదిలి ఆర్టీసీ డీఎం సుందరరావు సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా 25 ఆటోలను తనిఖీ చేశారు. రికార్డులు సక్రమంగా లేకపోవటంతో పాటు నిబంధనలకు విరుద్ధంగా ఓవర్‌లోడ్‌తో ప్రయాణిస్తుండటంతో రూ.30 వేల జరిమానా విధించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆటో చోదకులు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. రికార్డులను క్రమబద్ధీకరించుకోవాలని కోరారు. ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సెలవుల్లో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

వెలిగండ్ల, సెప్టెంబరు 30: దసరా సెలవుల్లో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ మధుసూదన్ అన్నారు. గ్రామాల్లో విద్యార్థులు ఈతకి వెళ్లి మృత్యువాత పడుతున్నారని సోమవారం వెలిగండ్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

సెలవుల్లో విద్యార్థులు చెరువులు, నదుల వద్దకు వెళ్ళకుండా తల్లిదండ్రులు చూడాలని ఎస్ఐ మధుసూదన్ సూచించారు. కార్యక్ర మంలో ఉపాధ్యాయులు, విద్యార్థు లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠినచర్యలు

పీసీపల్లి, సెప్టెంబరు 30: మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠినచర్యలు తప్పవని ఎస్సై జి.కోటయ్య హెచ్చరించారు. సోమవారం మండలంలోని పెదఅలవలపాడు గ్రామంలో వాహనచోదకులకు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనచోదకులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. పరిమితికి మించి ప్రయాణి కులను ఎక్కించినా, సరుకు రవాణా చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతిఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్సై కోటయ్య సూచించారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన కలిగిఉండాలి

పీసీపల్లి ,సెప్టెంబరు 30: సమాచార హక్కు చట్టంపై వ్యవసాయ శాఖ సిబ్బందితో పాటు రైతులు అవగాహన కలిగిఉండాలని ఇన్‌చార్జ్ ఎంపీడీవీ డీవీ రమణారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక రైతుసేవా కేంద్రంలో వ్యవసాయ అధికారి షేక్.షారూఖ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాచార హక్కు చట్టం ద్వారా ప్రతి పౌరుడు తమకు కావాల్సిన సమాచారాన్ని సంబంధిత సంస్థ, అధికారుల నుంచి నిర్ణీత గడువులోగా పొందే హక్కు ఉందన్నారు. సమావేశంలో సీనియర్ అసిస్టెంట్ రసూల్‌బాషా, డీటీ శ్రీనివాసులు, ఏఈవో పుల్లయ్య, పంచాయతీ కార్యదర్శి చాంద్‌బాదషా, వీఏఏ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

వెలిగండ్లలో.. వెలిగండ్ల, సెప్టెంబరు 30: సమాచార హక్కు చట్టం ద్వారా ప్రతి పౌరుడికి ప్రభుత్వ కార్యాలయాల్లో అవసరమైన సమా చారాన్ని పొందే హక్కు ఉంటుందని కనిగిరి వ్యవసాయ శాఖ ఏడీఏ వెంకటరమణ అన్నారు. సో మవారం వెలిగండ్ల రైతు భరోసా కేంద్రంలో ఏవో ఎస్.రంగకృష్ణ ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ద్వారా అర్జీ పెట్టిన వెంటనే ప్రతి వ్యక్తికి నెలలోపు వారు అడి గిన సమాచారాన్ని అందించాల్సిన అవసరం ఉంటుందని తెలిపారు కార్యక్రమంలో తహసీల్దార్ సు వర్ణ, ఉద్యాన అధికారి అంజలి, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలి

కనిగిరి, సెప్టెంబరు 30: కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతి అన్నారు. సోమవారం మండలంలోని లింగారెడ్డిపల్లి హైస్కూల్‌లో జరిగిన పౌష్టికాహార మాసోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. 18ఏళ్ళు నిండకుండా బాలికలు వివాహం చే సుకోరాదన్నారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలన్నారు. ప్రొటీన్‌ల ఆహారంతో కలిగే ఉపయోగాలను తెలియజేస్తూ లోగోను ప్రదర్శించి అవగాహన కల్పించారు. అలాగే, అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించిన రికార్డుల నిర్వహణపై కార్యకర్తలకు, ఆయాలకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ సీహెచ్ నాగార్జునరెడ్డి, హెచ్‌ఎం మాధవశర్మ, నాగూర్‌మీరా, ఏఎన్‌ఎం శాంతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సామూహిక సీమంతాలు.. కురిచేడు, సెప్టెంబరు 30: కురిచేడులోని బాలింతలకు సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సామూహిక సీమంతాలు, అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు. పౌష్టికాహార వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా సోమవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు అవసరమైన పౌష్టికాహారం తయారుచేసి ప్రదర్శించారు. కార్యక్రమంలో సీడీపీవో భారతి, సూపర్‌వైజర్ నాగమణి, ఎంఈవోలు వస్రాం నాయక్, సుబ్బారావు, వైద్యాధికారి, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

మోపాడు పంచాయతీలో నిధులు గోల్‌మాల్

పామూరు, సెప్టెంబరు 30: మండలంలోని మోపాడు గ్రామ పంచాయతీ నిధులను సర్పంచ్ గోల్‌మాల్ చేశారని గ్రామస్థులు సోమవారం జిల్లా కలెక్టరేట్‌కు మీ కోసంలో వినతి పత్రం అందజేశారు. సర్పంచ్ చప్పిడి వరలక్ష్మి గత మే నెలలో ఎటువంటి పనులు చేయకుండానే పనులు చేసినట్లు 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.15 లక్షల 16వేలు ను అక్రమంగా యూనియన్ బ్యాంక్ నుంచి డ్రా చేసినట్లు వినతి పత్రంలో ఆరోపించారు. పంచాయతి కార్యదర్శిని వివరణ కోరగా తనకు సంబంధం లేకుండా బిల్లులు లేకుండా నగదు డ్రా చేసినట్లు తెలిపారన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో మహంకాళి వెంగయ్య, ఎం.గిడ్డయ్య, ఎం.ఎరుకలయ్య, ఎం.రాజేంద్ర, కొండయ్య డి.నాగేశ్వరరావు, కె.తిరుపతిరెడ్డి, తదితరులు ఉన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

దొనకొండ, సెప్టెంబరు 30: మండలంలోని ఎర్రబాలెం గ్రామస్థులు మంచినీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవటం లేదని సీపీఎం మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య అన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయం వద్ద జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ ఎర్రబాలెం ఎస్సీ కాలనీవాసులు గత కొంతకాలంగా నీళ్లకోసం ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రామంలో 40 రోజుల క్రితం డీప్‌బోరు చెడిపోయిందన్నారు. చేతిపంపులు మరమ్మతులకు గురై పనిచేయకపోవటంతో ప్రజలు నీటికోసం పడరానిపాట్లు పడుతున్నారన్నారు. అనంతరం ఎంపీడీవో శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కర్నా హనుమయ్య, ఫ్రాన్సిస్, ప్రభాకర్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు సాగాలి

తాళ్లూరు, సెప్టెంబరు 30: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు సాగాలని ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు అన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి తోడ్పాటునందించాలన్నారు. సోమవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. మూడు నెలలకోసారి జరిగే సమావేశానికి అధికారులు రాకపోవటం, కొందరు ఉద్యోగులు సమయపాలన పాటించకపోవడం తగదన్నారు. మరోసారి ఇలాంటివి పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు. మండల స్థాయి అధికారులు సహేతుకరమైన కారణంలేకుండా మండలసమావేశానికి రాకపోతే సహించేది లేదన్నారు. సమావేశానికి రాని అధికారులకు నోటీసులు జారీ చేయాలని తెలిపారు. సమావేశంలో జడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ సీఐగా శ్రీనివాసరావు

దర్శి, సెప్టెంబరు 30: దర్శి ఎక్సైజ్ సీఐగా కె.శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన సుందరరామయ్య గుంటూరు జిల్లాకు బదిలీ అయ్యారు. ఈసందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ అక్రమ వ్యాపారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జనసేన ఆధ్వర్యంలో దీపారాధన

దర్శి, సెప్టెంబరు 30: మండలంలోని వెంకటాచలంపల్లి కొండపైగల వెంకటేశ్వరస్వామి ఆలయంలో జనసేన నాయకులు సోమవారం రాత్రి దీపారాధన కార్యక్రమం నిర్వహించారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఇచ్చిన పిలుపు మేరకు దీపాలు వెలిగించి ఆరాధన చేశారు. కార్యక్రమంలో నాయకులు పుప్పాల పాపారావు, భూలక్ష్మి అచ్యునాద కోటి, ఉల్లి బ్రహ్మయ్య, పుప్పాల రుద్ర తదితరులు పాల్గొన్నారు.





ఆరోగ్యవంతమైన దేశం.. ఆరోగ్యకర సమాజం.. వ్యాక్సినేషన్‌తోనే సాధ్యం. భావిభారత పౌరులైన నేటి చిన్నారులతోనే ఆరోగ్యవంతమైన దేశం సాధ్యమవుతుంది. అలాంటి చిన్నారుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో ప్రత్యేక కార్యక్రమాలను చేపడుతున్నాయి. వీటిలో ప్రధానమైనది వ్యాక్సినేషన్.. టీకాలు. ఈ వ్యాక్సినేషన్‌తో ఎన్నో వ్యాధులు, జబ్బులు అంతమైపోయాయి. అయితే మళ్లీ కొన్నేళ్లుగా కోరింత దగ్గు, మీజిల్స్(తట్టు, పొంగు, చర్మం మీద దద్దుర్లు), గవద బిళ్లలు ఇటీవల పుట్టే పిల్లల్లో కనిపిస్తున్నాయి. వ్యాక్సినేషన్ పక్కాగా జరగకపోవడం వల్లే ఈ వ్యాధులు మళ్లీ కనిపిస్తున్నట్లు వైద్యఆరోగ్యశాఖ వర్గాలే అభిప్రాయపడుతున్నాయి. పని చేయని టీకాల కారణంగానే ఆయా జబ్బులతో పిల్లలు అస్వస్థతకు గురవుతున్నట్లు తెలుస్తోంది. గతంలో టీకాల ప్రక్రియ పక్కాగా జరిగేదని అందువల్లే పలు జబ్బులు ఉనికిలో లేకుండా పోయాయని అయితే కొన్నేళ్లుగా వ్యాక్సినేషన్ ప్రక్రియలో నిర్లక్ష్యం.. లోపాలతో టీకాలో పొటెన్సీ తగ్గిపోతుందని.. అందువల్లే టీకాలు పనిచేయడంలేదని.. ఈ కారణంగానే అంతమైపోయాయనుకుంటున్న జబ్బులు, వ్యాధులు తరచుగా కనిపిస్తున్నాయని అర్థమవుతుంది.



క్షేత్రస్థాయి సిబ్బంది వ్యాక్సిన్ తీసుకెళ్లేందుకు వినియోగించే క్యారియర్



వ్యాక్సిన్ క్యారియర్‌లోని ఐస్ ప్యాక్‌లు

- పిల్లల్లో పనిచేయని వ్యాక్సిన్లు
- తెగిపోతున్న కోల్డ్ చైన్‌తో టీకాలు నిర్వీర్యం
- వెలుగుచూస్తున్న కోరింతదగ్గు, మీజిల్స్, గవద బిళ్లల కేసులు
- సచివాలయ వ్యవస్థ వచ్చాక వ్యాక్సినేషన్ సమయం తారుమారు
- ఎక్కువ సేపు బయట ఉండటంతో వ్యాక్సిన్ సామర్థ్యం మాయం



పసలేని టీకా

గుంటూరు సిటీ, సెప్టెంబరు 30: ఈ మధ్య కాలంలో పుట్టిన పిల్లల్లో ఎక్కువగా కోరింత దగ్గు, మీజిల్స్(తట్టు, పొంగు, చర్మం మీద దద్దుర్లు), గవద బిళ్లలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఈ ఏడాది ఇటువంటి కేసులు ఎక్కువగా వెలుగులోకి వచ్చాయి. గత ఐదారేళ్ల వరకు ఈ కేసుల ఉనికి లేదు. ఇప్పుడు తరచుగా ఆ కేసులు కనపడుతున్నాయి. ప్రస్తుతం జన్మిస్తున్న పిల్లల్లో ఈ రోగాల జాడ కనపడటానికి వీలు లేదు. ఎందుకంటే బిడ్డ పుట్టీపుట్టక ముందే వాక్సినేషన్ ప్రక్రియ ఆరంభమవుతుంది. బిడ్డ పుట్టగానే జీరో పోలియో, జీరో హెపటైటిస్-బీ టీకాలతో ఆరోగ్యవంతమైన సమాజాన్ని తయారు చేసే ప్రయత్నం ప్రారంభం అవుతుంది. అందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నాయి. అయినా ఆయా రోగాలు ప్రస్తుతం పిల్లల్లో కనపడుతున్నాయంటే ఎక్కడో లెక్క తప్పుతున్నట్టు అర్థం అవుతుంది. పుట్టిన పిల్లలకు ఐదేళ్లు వచ్చే వరకు అవసరమైన అన్ని వ్యాక్సిన్లను వైద్య, ఆరోగ్య శాఖ అందుబాటులోకి తెచ్చింది. బీసీజీ, ఓపీవీ, ఐపీవీ, ఆర్‌వీవీ, డీపీటీ, మీజిల్స్ రూబెల్లా, హెపటైటిస్ బీ, పెంటా వ్యాలెంట్, విటమిన్- ఏ వ్యాక్సిన్లు ఉచితంగా వేస్తున్నారు. ఈ వ్యాక్సిన్లన్నీ ఐఎల్ఆర్(టీకాలు నిల్వ ఉంచే ఫ్రిజ్‌లు)లో +2 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నుంచి +8 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలో భద్రపరుస్తారు. వ్యాక్సిన్ క్యారియర్‌లో వినియోగించే ఐస్ ప్యాక్‌లను డీప్ ఫ్రిజ్‌లో ఉంచుతారు. అందులోనే ఓరల్ పోలియో వ్యాక్సిన్ కూడా ఉంచుతున్నారు. 15 నుంచి 25 డిగ్రీల సెల్సియస్ మధ్య డీప్ ఫ్రిజ్ ఉష్ణోగ్రతను ఉంచాలి.

కోల్డ్ చైన్ కీలకం

ప్రభుత్వం గ్రామ స్థాయికి సరఫరా చేస్తున్న వ్యాక్సిన్ తగిన సామర్థ్యం(పొటెన్సీ) ఫలప్రదమైందిగా ఉండాలంటే కోల్డ్ చైన్ నిర్వహణ ముఖ్యమైనది. జిల్లా కేంద్రం నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వరకు జాగ్రత్తలతో వ్యాక్సిన్‌ను సరఫరా చేయాలి. లెక్కకు మించిన సంఖ్యలో సెషన్స్(టీకాలు వేసే కార్యక్రమం) నిర్వహించాలన్న వైద్య, ఆరోగ్యశాఖ అధికారుల ఆలోచన పెనుశాపంగా పరిణమిస్తోంది. గతంలో ఒక్కో ఆరోగ్య ఉపకేంద్రంలో కేవలం రెండు, మూడు సెషన్స్ మాత్రమే జరిగేవి. ఇప్పుడు నెలకు ఖచ్చితంగా ఎనిమిది సెషన్స్ జరగాలని అధికారులు చెబుతున్నారు. దాని వల్ల డోసులు ఉన్నా లేకపోయినా క్షేత్రస్థాయి సిబ్బంది వ్యాక్సిన్ క్యారియర్ తీసుకువెళ్తున్నారు. సచివాలయాల ఏఎన్ఎంల్లో చాలామందికి వ్యాక్సిన్ ప్రక్రియపై సరైన అవగాహన లేకుండానే టీకాలు వేస్తున్నారు. ఫీల్డ్ వర్క్‌తో సంబంధం లేకుండా, సరైన శిక్షణ లేకుండానే ఏఎన్ఎంలతో టీకాలు వేయిస్తున్నారు. గతంలో ఏఎన్ఎంలు ప్రతి బుధ, శనివారం ఉదయం 7 గంటలకే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చేరుకుని వ్యాక్సిన్ తీసుకువెళ్లే వారు. ఇప్పుడు ఆ పద్ధతి లేదు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఒక్కో చోట ఒక్కో సమయానికి వ్యాక్సిన్ తీసుకుంటున్నారు. ఉదయం 10 తర్వాత కూడా కొందరు ఏఎన్ఎంలు వ్యాక్సిన్ తీసుకుంటున్నట్లు సమాచారం. ఆ సమయంలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటం వల్ల వ్యాక్సిన్ పొటెన్సీ పూర్తిగా దెబ్బ తింటుంది. ఒక్కో క్యారియర్‌లో నాలుగు ఐస్ ప్యాక్‌లు ఉంచుతున్నా.. ఒక్కోటి కొద్దీ నిమిషాలు మాత్రమే కరిగి పోకుండా ఉంటుంది. ఉదయం 9 నుంచి 10 గంటల సమయంలో వ్యాక్సిన్ తీసుకుంటున్న ఏఎన్ఎంలు కొందరు మధ్యాహ్నం 2 తర్వాత, మరి కొందరు సాయంత్రం 4 గంటల తర్వాత తిరిగి తీసుకు వస్తున్నారు. ఈ మధ్య సమయంలో వ్యాక్సిన్ సరైన కోల్డ్ చైన్ లేక నిర్వీర్యమవుతుంది. అటువంటి టీకాలు వేయడం వల్లే పిల్లలకు కోరింత దగ్గు, మీజిల్స్, గవద బిళ్లలు వస్తున్నాయని వైద్య వర్గాల సమాచారం.

ఉద్యానానికి.. ఊతం

- సాగుకు రాయితీలు ప్రకటించిన ప్రభుత్వం
- ప్రోత్సాహకాలు, బకాయిల క్లియరెన్స్‌పై కూడా దృష్టి
- వైసీపీ హయాంలో నిర్లక్ష్యానికి గురైన ఉద్యాన సాగు
- గత వైభవం దిశగా అడుగులేస్తున్న కూటమి ప్రభుత్వం


బాపట్ల, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ పాలనలో ఉద్యాన రైతు ఉసూరుమన్నాడు. ప్రోత్సాహకాలు అందక ఏటికేడు ఉద్యాన సాగు కుచించుకుపోతూ వచ్చింది. కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వజూపిన వాటిని అందిపుచ్చుకోవడంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ప్రోత్సాహకాలు అందక.. బకాయిలు చెల్లింపులు జరగక ఉద్యానరైతులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం అంపశయ్య మీద ఉన్న ఉద్యానపంటల సాగుకు ఊపిరిలూదే దిశగా చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉన్న రాయితీ బకాయిలను విడుదల చేసింది. అంతేకాకుండా ఎంఐడీహెచ్, ఆర్‌కేవీవై పంటి పథకాల కింద అందించే ప్రోత్సాహకాలను సైతం ప్రభుత్వం వెల్లడించి రైతుల్లో ఆశలు చిగురించేలా చేసింది. 2014–19 మధ్య ఉద్యానపంటల సాగుకు దాదాపు స్వర్ణయుగమే. వైసీపీ రావడంతోనే ఉద్యానసాగుకు తిరోగమనం మొదలైంది. ఉద్యాన సిరులు కురిపించాల్సిన పంటల సాగు కాస్తా తీవ్ర సంక్షోభంలో చిక్కుకుంది. ప్రస్తుతం కొత్త ప్రభుత్వం కొలువుదీరడంతో ఉద్యానపంటలసాగుకు గత వైభవం కల్పించేలా అడుగులు వేస్తోంది. ఉద్యానపంటల ప్రోత్సాహం కింద రాష్ట్రీయ కృషి వికాస యోజన కింద బాపట్ల జిల్లాల్లో 85 లక్షలను 2023--24 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం విడుదల చేసింది. ఉద్యానపంటల సాగు సమగ్రాభివృద్ధి పథకం కింద రూ.7కోట్లు, ఆయిల్ పాము సాగుకు జిల్లాలో రూ.68లక్షల వరకు ప్రోత్సాహకాలు అందించేలా ప్రభుత్వం ప్రణాళికలు రచించింది. ఇవే రాయితీలు గుంటూరు జిల్లావ్యాప్తంగా చూస్తే దాదాపు రూ.7.50కోట్ల వరకు, పల్నాడు జిల్లాలో రూ.5.50కోట్ల వరకు అందించనుంది. గత ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిన ఉద్యానబకాయిలపై కూడా కదలిక వచ్చింది. త్వరలోనే వీటిని కూడా రైతులఖాతాల్లో జమ చేయడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి

బాపట్ల జిల్లాలో గతేడాది 55,000 ఎకరాల్లో సాగు

ఉద్యానపంటల సాగు జిల్లాలో గతేడాది 55,000 ఎకరాల్లో సాగైంది. అంతకుముందు ఏడాదితో పోలిస్తే గతేడాది సాగులో పదివేల ఎకరాల తగ్గుదల నమోదైంది. 2014-19 మధ్య ఉమ్మడి గుంటూరు జిల్లాలో దాదాపు రెండు లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగయ్యేవి. ఇదికాస్తా ఏటికేడు కుచించుకుపోతూ 1.20లక్షల ఎకరాలకే పరిమితమైంది. బాపట్ల జిల్లాలో గతేడాది 35,000 ఎకరాల్లో మిర్చి సాగవ్వగా, 6,000 ఎకరాల్లో పండ్లతోటలు, కూరగాయల సాగు 7,000 ఎకరాల్లో నమోదైంది. పసుపు, పూల తోటలు, ఇతరాత్ర ఉద్యానపంటలన్నీ కలిపి 7,000 ఎకరాల్లో సాగైంది. బాపట్ల జిల్లాలోనే కాక ఉమ్మడి గుంటూరు జిల్లాలోనే అత్యల్ప సాగు నమోదవడం వైసీపీ ప్రభుత్వం అస్తవ్యస్త విధానాల ఫలితాలకు నిదర్శనం. ఉద్యానపంటలకు సంబంధించి రైతులకు ఐదేళ్లలో బకాయిలు ఉంచిన మొత్తం ఒక్క బాపట్ల జిల్లాలోనే రూ.8 కోట్లు ఉండగా, ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా చూస్తే ఇది రూ.25కోట్లకు పైనే ఉన్నట్లు తెలుస్తోంది. బకాయిల చెల్లింపు విషయంలో గతేడాది మాత్రమే అరకొరగా చెల్లింపులు జరిపి ఎన్నికలల్లో లబ్ధిపొందే ప్రయత్నం వైసీపీ చేసింది. ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా పెండింగ్‌ఉన్న మొత్తాల్లో రూ.50లక్షల స్వల్పమొత్తాల చెల్లింపులకు గతేడాది మాత్రమే వైసీపీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇందులోకూడా చాలావరకు సీఎఫ్ఎంఎస్ అప్‌లోడ్ దశలోనే ఉంచి అన్నదాతలను నిలువునా వైసీపీ వంచించింది. కూటమిప్రభుత్వంలో ఉద్యానపంటల సాగుకు గత వైభవం సాధించేదిశగా అడుగులు పడుతున్నాయి.అందుకు అనుగుణంగా ఇప్పటికే ప్రోత్సాహకాలను ప్రకటించిన ప్రభుత్వం బకాయిల చెల్లింపులపై కూడా దృష్టిసారించింది. దీంతో ఈ ఏడాది పెద్ద ఎత్తున ఉద్యాన సాగుకు రైతులు సమాయత్తమవుతున్నారు. క్షేత్రస్థాయి అంచనాలను బట్టి ఈఏడాది ఒక్క బాపట్ల జిల్లాలోనే 60,000 ఎకరాల్లోనే సాగవనుందనే అంచనాలున్నాయి. మేలైన విత్తనాల కోసం షేడ్‌నెట్, పాలీహౌస్ వంటివాటిని రైతులకు అందించడంలో ప్రభుత్వం ప్రత్యేకదృష్టి పెట్టాల్సిన అవసరముంది. టీడీపీ ప్రభుత్వంలో ఉద్యాన సాగుకు సంబంధించి ఎకరాకు రూ.5,000వరకు ప్రోత్సాహకం ఉండేది. గత ప్రభుత్వంలో ఇది పూర్తిగా నిర్లక్ష్యానికి గురవడంతో ఉద్యానరైతులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. కేంద్రం అందించే మొత్తాలను పక్కదారి పట్టించి ఉద్యానరైతుల నోట్లో మట్టికొట్టింది. ఉపాధిహామీ పథకం ద్వారా ఉద్యానపంటలసాగుకు ఊతమివ్వాలన్న ప్రతిపాదనలను గత ప్రభుత్వం నివేదికలకే పరిమితం చేసింది. దీనిపై కొత్త ప్రభుత్వం దృష్టిపెడితే ఉద్యాన రైతులకు మేలు జరగనుంది.

పెట్టుబడి ఎక్కువ..

సంప్రదాయ పంటలసాగుతో పోలిస్తే ఉద్యాన పంటల సాగుకు పెట్టుబడి ఎక్కువ అవుతుంది. కానీ ఆశించిన స్థాయిలో దిగుబడులు వస్తే అన్నదాతలకు సిరుల పంట పండే అవకాశం ఉంటుంది. 2014–19 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వం అందించిన ప్రోత్సాహకాల వల్ల ఎక్కువమంది చిన్న, సన్నకారు రైతులు ఎక్కువమంది ఉద్యాన పంటల సాగుబాట పట్టారు. కానీ గత ప్రభుత్వ నిర్లక్ష్యవైఖరి వల్ల సాగు జిల్లాలో తిరోగమనబాట పట్టడమే కాకుండా సాగుచేసిన రైతులు సైతం తీవ్రంగా నష్టపోయారు. విపత్తులవల్ల నష్టం సంభవించినప్పుడు అందించే సాయం విషయంలో గత ప్రభుత్వం నివేదికలకు పరిమితం చేసింది తప్ప రైతులకు ఊరట దక్కలేదు. దీంతో ఉద్యానపంటలు సాగుచేసే రైతుల్లో 50శాతం మంది అప్పుల ఊబిలో కూరుకుపోయారు. వీరందరికీ మళ్లీ ఉద్యాన సాగు విషయంలో రాయితీలను విరివిగా అందించి అప్పుల ఊబి నుంచి గట్టెక్కించాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉంది.



పాలకవర్గంలో మారిన బలాబలాలు

- మున్సిపల్ కౌన్సిల్‌లో తేటతెల్లం
- జాతీయ నాయకుల ఫొటోల తొలగింపు, సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలను ఏర్పాటు చేయకపోవడంపై టీడీపీ కౌన్సిలర్ల అభ్యంతరం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్ పర్సన్ ఎస్తేరమ్మ టీడీపీ కౌన్సిలర్లతో కలిసి కూర్చున వైస్ చైర్మన్, పలువురు వైసీసీ కౌన్సిలర్లు

అద్దంకి, సెప్టెంబరు 30 : అద్దంకి మున్సిపాలిటీ పాలకవర్గంలో పార్టీల బలాబలాలు అనూహ్యంగా మారాయి. సోమవారం చైర్ పర్సన్ ఎస్తేరమ్మ అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశంలో బలాబలాలపై పూర్తి స్పష్టత వచ్చింది. వైసీపీ తరపున చైర్‌పర్సన్, ఇద్దరు వైస్ చైర్మన్‌లతో పాటు మరో పదిమంది వైసీపీ కౌన్సిలర్లు ఉండగా, టీడీపీకి ఏడుగురు కౌన్సిలర్లు మాత్రమే ఉన్నారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు ఇద్దరు వైసీపీ కౌన్సిలర్లు టీడీపీ కండువాలు కప్పుకోగా, మరో ముగ్గురు వైసీపీ కౌన్సిలర్లు ఇప్పటికే టీడీపీ పక్షానా చేరేందుకు సిద్ధమయ్యారు. ఈ తరుణంలో సోమవారం జరిగిన కౌన్సిల్‌లో టీడీపీ పక్షాన చేరేందుకు సిద్ధమైన వైస్ చైర్మన్ దేసు పద్మేష్, 10వ వార్డు కౌన్సిలర్ కొమ్మాలపాటి సుధీర్, 8వ వార్డు కౌన్సిలర్ వెంకటేశ్వర్లు టీడీపీ కౌన్సిలర్లు కూర్చునే వైపు కూర్చున్నారు. దీంతో గతంలో ఉన్న 7గురు తెలుగుదేశం కౌన్సిలర్లకు తోడు వైసీపీ నుంచి వచ్చిన 5గురు తోడయ్యారు. దీంతో టీడీపీ వర్గీయుల బలం 12కు చేరింది. సోమవారం నాటి సమావేశానికి 19వ వార్డు కౌన్సిలర్లు ఏజెండ్ల నాగరాజు వ్యక్తిగత పనుల దృష్ట్యా హాజరు కాకపోగా, మిగిలిన 11 మంది హాజయ్యారు. అదే సమయంలో చైర్మన్ మినహా వైసీపీ పక్షాన 7గురు మాత్రమే మిగిలారు. నాడు టీడీపీకి 7గురు కౌన్సిలర్లు కాగా ప్రస్తుతం వైసీపీకి 7గురు మాత్రమే మిగలడం విశేషం. మరికొంతమంది వైపీపీ కౌన్సిలర్లు టీడీపీ పక్షాన చేరేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ మంత్రి రవికుమార్ నుంచి రెడ్‌సిగ్నల్ పడడంతో ఆగిపోయినట్లు తెలుస్తుంది. చైర్ పర్సన్ ఎస్తేరమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో అజెండాలోని 15 అంశాలను ఆమోదించారు. అందులో సోమవారంతో ఒప్పంద గడువు ముగుస్తున్న 25 మంది పారిశుధ్య కార్మికులను కొనసాగించేందుకు ఆమోదం తెలిపారు.

ఏర్పాటు చేయని ఫొటోలపై నిలదీత

మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో గతంలో ఉన్న జాతీయ నాయకుల ఫొటోలను తొలగించడం, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఫొటోలను ఏర్పాటు చేయకపోవడంపై టీడీపీ కౌన్సిలర్ అత్తులూరి రమేష్‌తో పాటు పలువురు కౌన్సిలర్లు నిలదీశారు. గత సమావేశంలోనే అడిగినప్పటికీ ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. ఈ సారి సమావేశానికి ఏర్పాటు చేస్తామని చైర్ పర్సన్ ఎస్తేరమ్మ, కమిషనర్ రవీంద్ర తెలిపారు.

అందరి నోటా ఒకే సమస్య

- కౌన్సిల్‌లో గళం విప్పిన కౌన్సిలర్లు



అధికారుల వివరణ అడుగుతున్న చైర్మన్ జంజనం

చీరాల, సెప్టెంబరు 30 : పట్టణ పరిధిలో పలు చోట్ల లైట్లు లేవని, కొన్ని చోట్ల ఉన్నవి పనిచేయక ప్రజలు నిలదీస్తున్నారని పలువురు కౌన్సిలర్లు నిలదీశారు. మున్సిపల్ కౌన్సిల్ హాల్లో సోమవారం మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు అధ్యక్షతన కౌన్సిల్ అత్యవసర సమావేశం జరిగింది. అజెండాలోని అంశాలకు సంబంధించి వార్డు మెంబర్లు ప్రస్తావించడం లేదని కౌన్సిలర్ మామిడాల రాములు ఆక్షేపణ వ్యక్తం చేశారు. ఇకపై ఆయా అంశాలపై పక్కాగా వార్డుమెంబర్లు కూడా పలకరించాలని చైర్మన్ శ్రీనివాసరావు అధికారులకు చెప్పారు. వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, కౌన్సిలర్లు పాపిశెట్టి సురేష్ నాయుడు, మామిడాల రాములు, చీమకుర్తి బాలకృష్ణ, కీర్తి వెంకట్రావు తదితరులు మున్సిపల్ పరిధిలో పలుచోట్ల విద్యుత్ దీపాలు లేవని, కొత్తగా వేసిన స్తంభాలకు లైట్లు లేవని, రాత్రిపూట ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, వెంటనే సమస్య పరిష్కరించాలని పట్టుబట్టారు. దీనిపై విద్యుత్ అధికారులు వివరణ ఇచ్చారు. ఈ క్రమంలో చైర్మన్ జంజనం మాట్లాడుతూ ముందుస్తుగా కమిషనర్‌కు నిధుల వినియోగంలో తనకున్న పరిధి రూ.లక్ష వెచ్చించి ట్యూబ్ లైట్లు కొనుగోలుచేసి యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేయాలన్నారు. అజెండాలోని 9 అంశాలను కొద్దిపాటి చర్చతో ఆమోదించారు. టేబుల్ అజెండాలోని మూడు అంశాలను రద్దు చేస్తూ, తిరిగి టెండర్లు పిలవాలని తీర్మానించారు. బదిలీపై వచ్చిన మున్సిపల్ మేనేజర్ శ్రీలక్ష్మి, జేఏవో శ్రీనివాసరావు, సీనియర్ అసిస్టెంట్లు ఎం.మాల్యాద్రి, ఎన్‌వీ నిర్మల, జితేంద్ర, రాజశేఖర్, అనీల, శాంతకుమారి, సుశీలను పరిచయం చేసుకున్నారు. సమావేశంలో కమిషనర్ చక్రవర్తి, ఏఈ రవి పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.



అధ్వానంగా రోడ్లు

- అవస్థలు పడుతున్న ప్రయాణికులు
- వెంటనే బాగు చేయాలని ప్రజల విజ్ఞప్తి



అధ్వానంగా ఉన్న దైవాలరావూరు - బొల్లవరప్పాడు రోడ్డు

మేదరమెట్ల, సెప్టెంబరు 30 : కొరిశపాడు మండలంలోని పలు రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ముఖ్యంగా దైవాలరావూరు నుంచి కృష్ణంరాజుపాలెం (రెడ్డిపాలెం) పాత మద్రాస్ రోడ్డు వరకూ పంచాయతీ రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నది. 2008లో పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన ఈ రోడ్డుకు అప్పుడప్పుడూ స్వల్ప మరమ్మతులు తప్ప, పూర్తిగా పట్టించుకున్న దాఖలాలు లేవు. దైవాలరావూరు బొల్లవరప్పాడు మధ్య, బొల్లవరప్పాడు దైవాలరావూరు మధ్య, పాత మద్రాస్ రోడ్డు వరకూ రోడ్డు ఛిద్రమైంది. కొన్ని చోట్ల రోడ్డును చిల్లచెట్లు కమ్మేసి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. పమిడిపాడు బొల్లవరప్పాడు మధ్య రోడ్డు తారు లేయర్ వర్షాలకు పోయింది. 15 ఏళ్లగా గోతులలోనే ప్రయాణిస్తున్నారు. రోడ్డు మలుపు వద్ద పెద్దపెద్ద గోతులు ఉండడంతో ప్రయాణానికి ఇబ్బందిగా మారింది. వైసీపీ పాలనలో మండలంలోని రోడ్లను పట్టించుకోకపోవడంతో అధ్వానంగా మారాయి. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక రోడ్లు బాగుపడతాయని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.



జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన మైలవరం విద్యార్థులు



క్రీడాకారులతో ఉపాధ్యాయులు

అద్దంకిటౌన్, సెప్టెంబరు 30 : అద్దంకి నియోజకవర్గ స్థాయిలో జరిగిన స్కూల్ గేమ్స్ పోటీలలో మండలంలోని మైలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తాచాటి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం నాగేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయిని లావణ్య తెలిపారు. సోమవారం పాఠశాలలో జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. అండర్17 విభాగంలో 800మీటర్ల పరుగు పందెంలో నూనె జ్యోతి ప్రథమ స్థానంలో, బాలుర అండర్-14 లాంగ్‌జంప్‌లో కె.గౌతమ్ ద్వితీయ స్థానంలో నిలిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. బాలికల అండర్-17 కబడ్డీ విభాగంలో గద్దల మాధురి, ఖోఖో అండర్-14 విభాగంలో అంకం పూజా, బాలుర ఖోఖో అండర్-14లో కె.గౌతమ్, ఎం. వరుణ్ కుమార్ ప్రతిభ చూపి జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక అయినట్లు హెచ్‌ఎం నాగేశ్వరరావు తెలిపారు. గెలుపొందిన విద్యార్థులు, వ్యాయామ ఉపాధ్యాయిని లావణ్యకు హెచ్‌ఎం, సహచర ఉపాధ్యాయులు అభినందించారు.

సత్తాచాటిన అడవీధిపాలెం విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

చినగంజాం, సెప్టెంబరు 30 : అడవీధిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు పలు క్రీడా పోటీలలో సత్తాచాటి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం ఎ.మాధవీలత తెలిపారు. మోటుపల్లి పంచాయతీ పరిధిలోని అడవీధిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన సందర్భంగా సోమవారం జరిగిన అభినందన సభలో ఆమె మాట్లాడారు. జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 28న ఇంకొల్లు జడ్పీ పాఠశాలలో జరిగిన పర్చూరు నియోజకవర్గ స్థాయి అండర్-14, అండర్-17 విభాగాలలో జరిగిన కబడ్డీ, యోగా పోటీలలో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు బాలబాలికలు ఎంపికైనట్లు తెలిపారు. అండర్-14 బాలికల కబడ్డీ విభాగంలో డి.యామిని, వి.యామిని, అండర్-17 బాలికల కబడ్డీలో ఆర్.దీపిక, వి.జ్యోత్స్న, అండర్-14 బాలుర కబడ్డీ విభాగంలో కే.చంద్రశేఖర్‌రెడ్డి, యోగాలో అండర్-14లో బాలికలు కే.లావణ్య డి.నిహారిక, అండర్-14 బాలురలో డి.ప్రమోద్ కుమార్, పి.సుబ్బయ్య ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయిని బి.లలిత తెలిపారు. జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన బాలబాలికలను పాఠశాల హెచ్‌ఎం, పీడీ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

అంగన్‌వాడీ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఇంకొల్లు, సెప్టెంబరు 30 : ఇంకొల్లు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్ల ఉద్యోగాలను భర్తీ చేసేందుకు అక్టోబరు 1వ నుంచి 10వ తేదీ వరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సీడీపీవో ఝాన్సీ తెలిపారు. ఇంకొల్లు-1, 2, సూదివారిపాలెం-1, గొల్లపాలెం-2, చింతలపాలెంలో హెల్పర్ పోస్టులకు, చినగంజాం మండలంలోని కడవకుదురు-4లో హెల్పర్ పోస్టుకు, కారంచేడు మండలం కేసవరప్పాడు అంగన్‌వాడీ వర్కర్, హెల్పర్ పోస్టులకు దరఖాస్తులు చేసుకోవచ్చునని కోరారు.







8న సర్వసభ్య సమావేశం

బల్లికురవ, సెప్టెంబరు 30 : బల్లికురవ మండల సర్వసభ్య సమావేశం ఈ 8వ తేదీన ఎంపీపీ శ్రీలక్ష్మి అధ్యక్షతన ఉంటుందని ఎంపీడీవో కుసుమకుమారి తెలిపారు. సమావేశానికి అన్ని శాఖల అధికారులు విధిగా హాజరు కావాలన్నారు.

కనులపండువగా వినాయక నిమజ్జనం

ముగిసిన నాగులపాడు తెలుగు యువత చవితి ఉత్సవాలు



వినాయక విగ్రహం వద్ద పూజలు చేస్తున్న కమలకిషోర్

అద్దంకి, సెప్టెంబరు 30: మండలంలోని నాగులపాడులో తెలుగు యువత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం నిమజ్జనం సందర్భంగా సోమవారం రాత్రి శోభాయాత్ర కనులపండువగా జరిగింది. నాగులపాడు తెలుగు యువత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహ ఊరేగింపు మధ్యాహ్నం నుంచి నాగులపాడులోని పలు రోడ్లలో సాగగా సాయంత్రం అద్దంకి పట్టణంలోని రామ్‌నగర్‌కు చేరుకుంది. రాత్రి 8 గంటల నుంచి రామ్‌నగర్ నుంచి విద్యుత్ దీపాల వెలుగులు, బాణ సంచాలు, పలు వేషధారణ బృందాల మధ్య ప్రారంభమైంది. శ్రీనగర్, ఆర్టీసీ బస్టాండ్, భవానీ సెంటర్ మీదుగా దర్శి రోడ్డులోని గుండ్లకమ్మ నది వరకు యాత్ర సాగింది. అనంతరం వినాయకుడిని గంగమ్మ ఒడికి చేర్చారు. పట్టణంలో శోభాయాత్ర సాగినంత సేపు పలు ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో మహిళలు, స్థానికులు రోడ్లపైకి వచ్చి తిలకించారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ సోదరుడి కుమారుడు కమలకిషోర్(బాబీ) ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంతో పాటు పలు గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శరన్నవరాత్రి మహోత్సవ ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

అద్దంకిటౌన్, సెప్టెంబరు 30 : అద్దంకిలోని శ్రీ చక్ర సహిత శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఈనెల 3 నుంచి 11వ తేదీ వరకు 53వ శరన్నవరాత్రి మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు రామకోటేశ్వరరావు తెలిపారు. సోమవారం ఆలయ ప్రాంగణంలో 53వ శరన్నవరాత్రి మహోత్సవ ఆహ్వాన పత్రికను ఆయన ఆవిష్కరించారు. భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో కార్యనిర్వాహక అధ్యక్షుడు చిన్ని లక్ష్మి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి హనుమంతరావు, కోశాధికారి నేరేళ్ల శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పోకూరి వెంకట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శ్రీ అభయాంజనేయస్వామి ఆలయంలో దీపారాధన

పర్చూరు, సెప్టెంబరు 30: ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు సనాతన ధర్మ పరిరక్షణే లక్ష్యంగా శ్రీ అభయాంజనేయస్వామి ఆలయంలో కూటమి నాయకులు సోమవారం దీపారాధన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకుడు, సందీప్ తేజ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నేడు మంత్రి గొట్టిపాటి పర్యటన

పంగులూరు, సెప్టెంబరు 30 : పంగులూరులో నేడు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పర్యటించనున్నారు. మంగళవారం ఉదయం 10 గంటల 15 నిముషాలకు సామాజిక పింఛన్‌ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో జరిగే కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారని ఎంపీడీవో రామాంజనేయులు తెలిపారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

పర్చూరు, సెప్టెంబరు 30 : క్రమం తప్పకుండా గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకుంటే తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని సీడీపీవో సుభద్ర దేవి అన్నారు. సోమవారం ఐసీడీఎస్ కార్యాలయం పౌష్టికాహార వారోత్సవాల ముగింపు సందర్భంగా వివిధ రకాల పోషక పదార్థాలతో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బ్రహ్మయ్య, ఎంపీడీవో ప్రద్యుమ్నకుమార్, డాక్టర్ ఏకాంబరం, సూపర్ వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పంగులూరు : అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు బాలామృతాన్ని అందించాలని సెక్టార్ సూపర్‌వైజర్ జయప్రద కోరారు. పంగులూరులో సోమవారం పౌష్టికాహార మాసోత్సవ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. కేంద్రంలో న్యూట్రిషన్ ఫుడ్ స్టాల్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో టీచర్లు రజని, జాన్‌బి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆత్మీయ కలయిక



చీరాల, సెప్టెంబరు 30 : టీడీపీ సీనియర్ నాయకులు, సినీ నటుడు, జయభేరి గ్రూప్ ఛైర్మన్ మాగంటి మురళీమోహన్‌ను హైదరాబాద్‌లో సోమవారం ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య కలిశారు. ఇద్దరి మధ్యా ఆత్మీయ పలకరింపులు, కొంతమేర రాజకీయ చర్చ జరిగింది.

విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు

బల్లికురవ, సెప్టెంబరు 30 : ప్రభుత్వ పథకాలను ప్రజలకు సత్వరమే అందించకుండా విధులలో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తప్పవని ఎంపీడీవో కుసుమకుమారి హెచ్చరించారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో అన్ని సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లకు, పంచాయతీ కార్యదర్శులకు సమావేశం జరిగింది. ఎంపీడీవో మాట్లాడుతూ పింఛన్లు తొలిరోజే 95శాతం పైబడి పంపిణీ చేయాలన్నారు. ఎవరైనా లాగిన్ కాకుండా ఉంటే వారిపై చర్యలు ఉంటాయన్నారు. గ్రామాలలో శానిటేషన్ కార్యక్రమాలు నిరంతరం చేపట్టాలన్నారు. సమావేశంలో ఈవోపీఆర్డీ సుమతి, సహాయకులు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

చీరాలటౌన్, సెప్టెంబరు 30 : గాంధీ జయంతి సందర్భంగా నిబంధనలు పాటించాలని మునిసిపల్ కమిషనర్ చక్రవర్తి హెచ్చరించారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు బుధవారం పురపాలక సంఘం పరిధిలో మాంస శాలలు, చేపల దుకాణాలు, హోటల్స్, రెస్టారెంట్‌లను మూసివేయాలని సూచించారు. భిన్నంగా వ్యహరించినట్లయితే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు.

పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు

చినగంజాం, సెప్టెంబరు 30 : స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ఎంపీడీవో కే.స్వరూపరాణి తెలిపారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశపు హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చినగంజాం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.విజయభాస్కరరావు కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. చెత్త సేకరించేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాయని ఆత్మారావు, ఈవోపీఆర్డీ ఎస్.వేణుగోపాలకృష్ణమూర్తి, గ్రామ కార్యదర్శులు ఎస్.సూర్యనారాయణ, ఎ.మస్తాన్‌రావు, పీహెచ్‌సీ. సీహెచ్‌వో ఝాన్సీరాణి, హెచ్‌వీ ఉల్దారాణి, సూపర్‌వైజర్ ఎం.చిరంజీవి, ఏఎన్ఎం. ఎం.స్టాన్లీదేవి, ఎంఎల్‌హెచ్‌పీ రమాదేవి, ఎంఎన్‌వో పి.సుబ్బారావు, ఆశా కార్యకర్తలు, ఆయా గ్రామ పంచాయతీల కార్మికులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలి

మార్టూరు, సెప్టెంబరు 30 : గ్రామ స్థాయిలో సభ్యత్వ నమోదును వేగవంతం చేసేందుకు నాయకులు కృషి చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మండవ రామకృష్ణ అన్నారు. సోమవారం మార్టూరులో బీజేపీ రెండవ విడత సభ్యత్వ నమోదుపై చర్చించారు. సమావేశంలో మండలాధ్యక్షుడు నాగహరగోపాల్, మహిళా మోర్చా నాయకురాలు జయబాల హైమావతి, రామాంజనేయులు, అంజయ్య పాల్గొన్నారు.

సామాజిక ఉద్యమంగా పర్యావరణ పరిరక్షణ

వాడరేవు(చీరాలటౌన్), సెప్టెంబరు 30 : పర్యావరణ పరిరక్షణ సామాజిక ఉద్యమంగా స్వీకరించి అడుగులు వేయాలని నెహ్రూ యువ కేంద్రం సంఘటన్ రాష్ట్ర సంచాలకులు ప్రసాద్‌దాస్ పేర్కొన్నారు. స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా సోమవారం వాడరేవు సముద్ర తీరంలో స్వచ్ సాగర్ - సురక్షిత సాగర్ కార్యక్రమాన్ని నెహ్రూ యువ కేంద్రం, కార్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో కేంద్రం జిల్లా అధికారి కిరణ్మయి దేవిరెడ్డి, ఈపూరుపాలెం మెడికల్ ఆఫీసర్ డా.శ్రీదేవి, ఈవోఆర్డీ మురళీ బాపూజీ, పంచాయతీ కార్యదర్శి కృష్ణారెడ్డి, కార్డ్ ప్రతినిధులు నాదెండ్ల కోటేశ్వరరావు, జేఎంజే విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పొలాలకు దారి చూపండి

- కలెక్టర్‌కు కొండమూరు రైతుల విజ్ఞప్తి

పంగులూరు, సెప్టెంబరు 30 : పొలాలకు వెళ్లే దారిలేక ఇబ్బంది పడుతున్నామని, దారి చూపాలని కొండమూరు రైతులు కలెక్టర్‌కు సోమవారం వినతిపత్రాన్ని అందచేశారు. కొండమూరు గ్రామంలో 215, 229, 235, 227, 233, 217, 216, 218, 219 సర్వే నెంబర్లలో 30 మంది రైతులకు 100 ఎకరాల భూమి కలదు. ఆ పొలాలకు వెళ్లేందుకు దారి లేక రైతులు ఇబ్బంది పడుతున్నారు. గత 50 ఏళ్లుగా వేరే వారి భూముల వైపుగా తమ పొలాలకు దారిని వినియోగించుకుంటున్నామని అది కూడా మూసివేయడంతో ఇబ్బంది పడుతున్నామని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. 162 సర్వేలో ఉన్న ప్రభుత్వ భూమి మీదుగా జాగర్లమూడివారిపాలెం వైపు జాతీయ రహదారి వరకు రోడ్డును నిర్మించి తమ పొలాలకు దారి చూపాలని రైతులు వెంకటరావు, జి.సుబ్బారావు, ఆదిలక్ష్మి, సాంబయ్య ఏడుకొండలు, కోటయ్య కోరారు.

పెదగంజాంవాసికి డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న ఏడుకొండలుయాదవ్

చినగంజాం, సెప్టెంబరు 30 : మండలంలోని పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని ఆవులదొడ్డిపాతగొల్లపాలెం గ్రామానికి చెందిన మద్దిన ఏడుకొండలు యాదవ్ కళా రంగంలో డాక్టరేట్ పొందారు. ఏడుకొండలు కళారంగం ఆలిండియా కళారంగ సభ్యుడు. గ్రామంలో వ్యవసాయం చేసుకుంటూ ఒంగోలు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తున్నారు. ఆసియా ఇంటర్‌నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ వారు కళారంగంలో ఎంపిక చేసినట్లు ఏడుకొండలు సోమవారం తెలిపారు. ఈ నెల 28న తమిళనాడు రాష్ట్రం హోసూర్‌లోని హోటల్ హిల్స్‌లో వర్సిటీ ప్రొఫెసర్ ప్రకాష్ చేతుల మీదుగా డార్టరేట్‌ను అందుకున్నట్లు తెలిపారు. యూట్యూబ్ చానల్‌లో తేజశ్రీ కళారంగం అనే యూట్యూబర్ నడుపుతున్నట్లు తెలిపారు. తనకు చిన్నతనం నుంచి పౌరాణిక నాటకాలపై ఆసక్తి ఎక్కువన్నారు. పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి నాటకంలో సిద్దయ్య పాత్రను ఎక్కువగా వేసినట్లు తెలిపారు. ప్రకాశం, బాపట్ల, గుంటూరు, కడప జిల్లాలలో వీరబ్రహ్మేంద్రస్వామి నాటక ప్రదర్శనలు 150పైగా ఇచ్చినట్లు ఏడుకొండలు తెలిపారు. సత్యహరిచంద్ర నాటకంలో హరిచంద్రుడిగా 20 సార్లు నటించినట్లు తెలిపారు. డాక్టరేట్ పొందిన ఏడుకొండలు యాదవ్‌ను గ్రామ పెద్దలు అభినందించారు.


నారుమళ్లు ఎండుతున్నాయి

సాగునీరివ్వండి : చిట్టివాద రైతు సంఘం ప్రతినిధుల ఆందోళన

చీరాల, సెప్టెంబరు 30 : పేరాల, చీరాల చిట్టివాద రైతు సంఘం ప్రతినిధులు సాగు నీటి కోసం సోమవారం ఆర్డీవో కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతు సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ చిట్టివాద పరిధిలో సుమారు 3వేల ఎకరాల మాగాణి సాగవుతోంది. ప్రస్తుతం విత్తనాలు పోసి, నారుమళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. నాట్లకు ముందే సాగునీరు లేకపోవడంతో అవి ఎండిపోతున్నాయి. ఇప్పటికే ఎకరాకు రూ.10వేలు ఖర్చు చేశాం. నర్సాయపాలెం లాకుల నుంచి స్టువర్టుపురం చానల్ ద్వారా సాగు నీటిని ఇవ్వాల్సి ఉండగా, కాలువ కట్టలకు గండి పడింది. వాటిని పూడుస్తున్నామని ఇరిగేషన్ అధికారులు చెప్తున్నారు. ఆచరణలో తీవ్ర జాప్యం చేస్తున్నారు. సాగునీరు సకాలంలో విడుదల చేయకపోతే నష్టపోతామని తెలిపారు. అనంతరం ఆర్డీవో సూర్యనారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంఅలో పేరాల, చీరాల చిట్టివాద రైతు సంఘం ప్రతినిధులు మద్దిబోయిన సుబ్బారావు, రమణయ్య పాల్గొన్నారు.

ఇంకొల్లులో అగ్నిప్రమాదం

ఇంకొల్లు, సెప్టెంబరు 30 : ఇంకొల్లులో ఆదివారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది. గ్రామంలో ఇస్లాంపేటలో షేక్ బాబు ఇంట్లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. ప్రమాదంలో సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. ఇల్లు పాక్షికంగా దెబ్బతిన్నది. రూ.5లక్షల నగదు, రూ.3లక్షల విలువైన సామగ్రి బూడిదైంది. మొత్తంగా రూ.8లక్షల మేరకు ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు. చీరాల అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపుచేశారు.



నేడు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ

నెల్లూరు(హరనాథపురం) : జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం మంగళ, బుధవారాల్లో జరగనుంది. తొలిరోజు 95 శాతానికి పైబడి పెన్షన్ల పంపిణీ చేయాలని అధికారులు నిర్ణయించారు. జిల్లాలో 3,11,913 మంది పింఛనుదారులు ఉండగా రూ.131.89 కోట్లు పంపిణీ చేయనున్నారు. 7 వేల మంది ప్రభుత్వ సిబ్బంది ద్వారా నగదు పంపిణీ చేయనున్నట్లు డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ కేవీ సాంబశివారెడ్డి చెప్పారు. లబ్ధిదారులు ఇంటి వద్దనే ఉండి పెన్షన్ మొత్తాన్ని తీసుకోవాలని కోరారు.

1 రోజు 4 ప్రత్యేకతలు

'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనాలు

సాధారణంగా ఒక్కో రోజుకు ఒక్కో ప్రత్యేకత ఉంటుంది. వాటిలో పండుగలు, ఉత్సవాలు, ప్రముఖుల జయంతులు, వర్ధంతులు ఇలా చాలానే ఉంటాయి. కానీ ఒకే రోజు నాలుగు ప్రత్యేకతలు రావడం చాలా అరుదు. అలాంటి అరుదు రోజుల్లో మంగళవారం (అక్టోబరు 1) చోటు దక్కించుకుంది. ప్రపంచ వృద్ధుల దినోత్సవం, ప్రపంచ కాఫీ డే, జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం, ప్రపంచ శాకాహార దినోత్సవం. విభిన్న అంశాలపై వచ్చిన ఈ ప్రత్యేకతలపై ఆంధ్రజ్యోతి కథనం..



ఈ బామ్మ వయసు
సెంచరీ దాటేసింది!

అయినా ఇప్పటికీ ఉత్సాహంగా, ఉల్లాసంగా..

ఆమె వయసు 107 సంవత్సరాలు. కానీ చూసేందుకు ఆమె అలా ఉండదు. నిద్ర లేచింది మొదలు మరొకరి సాయం లేకుండా తన పనులు తానే చేసుకుంటుంది. ఊతకర్ర పట్టుకుని నడవాలంటే (వయసు పైబడిందని) ఆమె నామోషిగా ఫీలవుతుంది. పక్కనే ఉన్న గోడ, కుర్చీ వంటి వాటిని పట్టుకుని నిదానంగా అడుగులు వేస్తూ ఇంట్లో కలియ తిరుగుతుంది. కళ్లజోడు లేకుండా ప్రతిరోజూ చక్కగా దినపత్రికలు చదువుతుంది. ఇలా ఆరోగ్యంగా ఉండడానికి శాకాహారం తీసుకుంటూ మితంగా ఉండటమేనని అంటోంది. సంగంలోని మలినేని రమేష్ నాయనమ్మ పర్వతవర్ధనమ్మ. మంగళవారం 'ప్రపంచ వృద్ధుల దినోత్సవం' సందర్భంగా తన ఆరోగ్య రహస్యాలను ఆంధ్రజ్యోతితో పంచుకున్నారనే. ఆమె మాటల్లోనే..

'మాది గుంటూరు జిల్లా మోరంపూడి. జంపాల సుబ్బారావు, నాగరత్నమ్మలకు మేము ఇద్దరు ఆడ పిల్లలం. నేను పెద్దదాన్ని. గ్రామ మునసబు మానాన్న. కర్నూలు జిల్లా ఆళ్లగడ్డ మండలం వీరారెడ్డిపల్లికి చెందిన నాగేశ్వరరావుతోతో నాకు పెళ్లి అయ్యింది. నలుగురు కొడుకులు, ఓ కుమార్తె ఉన్నారు. 30 ఏళ్ల క్రితం సంగంకు వలసొచ్చాం. చిన్నప్పుడు దంపుడు బియ్యంతో అన్నం. ఇంట్లోనే గేదెలు ఉండడంతో పాడి ఉండేది. మా ఊళ్లోనే పండే ఆకు, కాయగూరలతో కూరలు చేసేవాళ్లు. ఏం తిన్నా మితంగానే. ఇక మాంసం ఏ పండక్కో.. పబ్బానికో అంతే. కల్తీలేని మిత శాకాహారంతో ఒత్తిడి లేని ప్రశాంత జీవనమే నా దీర్ఘాయుష్షుకు రహస్యం. నా చిన్నప్పటి నుంచి సూర్యోదయంతోనే నిద్రలేవడం, ఆహారపు అలవాట్లలో తేడాలేదు. ఇప్పుడు దంతాలు ఊడిపోవడంతో మాములు బియ్యం మెత్తగా వండించుకుని పెరుగు, ఆకు కూరలతో తింటున్నా. ఇప్పటికి జ్ఞాపకశక్తి బాగుంది. రోజూ పేపర్ చదువుతా. పేపర్‌లో ఏవైనా ఆసక్తి అంశాలు ఉంటే నా కుటుంబ సభ్యులకూ వివరిస్తా. నిద్ర లేచిన దగ్గర నుంచి ఒకరి సహాయం తీసుకోను' అంటోంది పర్వత వర్ధనమ్మ. 107 ఏళ్ల వయసులోనే ఆమెను చూస్తే ఎవరికైనా ఆశ్చర్యం కలగక మానదు. ఇప్పటి వరకు ఈమెకు ఎటువంటి అనారోగ్య సమస్యలు లేవు. ఏడాది క్రితం పచ్చవాతం వస్తే డాక్టర్ సూచన మేరకు వివిధ రకాల సాధనలు చేస్తోందని కుటుంబ సభ్యులు తెలిపారు.

- సంగం

ఆనందంగా గడపడమే ఆరోగ్యం...



ఉదయగిరి రూరల్ : వందేళ్లకు చేరువవుతున్నా ఒకరిపై ఆధారపడకుండా తన దైనందిన కార్యక్రమాల తానే చేసుకుంటోంది ఉదయగిరిలోని సినిమాహాలువీధికి చెందిన 99 ఏళ్ల షేక్ మహబూబ్‌బీ. అలసట, బీపీ, షుగర్, వంటి వ్యాధుల బారిన పడకుండా కుటుంబ సభ్యులందరితో ఆనందంగా గడుపుతోంది. మరోవైపు కుటుంబ సభ్యుల పూల వ్యాపారానికి సహాయ సహకారాలు అందిస్తోంది. ప్రతిరోజు ఉదయాన్నే 5 గంటలకు నిద్రలేచి రెండతస్తుల నుంచి కిందకు దిగి తన కాలకృత్యాలు తీర్చుకొని అల్పాహారం తీసుకొని తిరిగి మిద్దె పైకి వెళతోంది. రోజుకు రెండు, మూడుసార్లు మెట్లెక్కినా ఆ వృద్ధురాలు ఎలాంటి అలసటకు గురికాదు. తమ హయాంలో తిన్న ఒడితోపాటు శ్రమ తన ఆరోగ్యానికి కారణమంటున్నారు మహబూబ్‌బీ.



అన్ని టెన్షన్లకు కప్పు కాఫీతో చెక్!

నెల్లూరు (విద్య) : మంచినీటితో పోటీపడుతూ మానవ జీవితంలో టీ, కాఫీలు ఓ భాగంగా మారిపోయాయి. ప్రధానంగా ఒక కప్పు కాఫీ తాగనిదే కొంతమందికి రోజు గడవదు. ఎన్నో టెన్షన్‌లకు మందులా పని చేస్తుంది. ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగిస్తుంది. అందుకే కాఫీకి కూడా ఒక ప్రత్యేక రోజు కేటాయించి అక్టోబరు 1వతేదీన అంతర్జాతీయ కాఫీ దినోత్సవం ప్రపంచ వ్యాప్తంగా జరుపుతున్నారు. కాఫీ వల్ల కలిగే ప్రయోజనాలు, అతిగా తీసుకోవడం వల్ల కలిగే అనర్థాల గురించి అవగాహన కల్పించడమే ఈ రోజు ప్రత్యేకత. కాఫీపై ఎన్నో పరిశోధనలు, అధ్యయనాలు చేసి గుండెపోటు ప్రమాదాన్ని తగ్గిస్తాయని సూచించా రు. అంతేకాదు.. 2016లో జరిగిన ఓ అధ్యయనంలో కాలేయానికి మంచిదని నిరూపించారు కూడా. కెఫిన్ తక్షణమే మీ శరీరాన్ని శక్తివంతం, ఉత్తేజితం చేస్తుంది. మీ మనసును ప్రశాంత పరుస్తుంది. కాఫీయాంటీ ఆక్సిడెంట్‌లు క్యాన్సర్ వంటి అనేక ప్రాణాంతక వ్యాధులతో పోరాడటానికి సహాయ పడతాయని గుర్తించారు. కాఫీ తాగడం వల్ల పార్కిన్ సన్ వ్యాధి 30శాతం తగ్గుతుందని అధ్యయనాల్లో తేలింది. కెఫిన్ శరీరంలో కొవ్వును కరిగించడంతోపాటు విటమిన్ 2, విటమిన్ బి 5, మాంగనీస్, పొటాషియం, మెగ్నీషియం, నియాసిస్ కాఫీలో ఉండడంతో డిప్రెషన్, బరువు తగ్గిపోతుంది. కెఫిన్, డైటర్‌పిన్స్, డైఫినాల్స్ వంటివి బాడీని చురుగ్గా ఉంచుతాయి. ఒక కప్పు కాఫీ తాగగానే శరీరంలో కాస్తంతైనా తేడా కనిపిస్తుంది. కాఫీని పరిమిత మోతాదులో తీసుకుంటే అది పక్షవాతాన్ని నివారిస్తుంది. అయితే, రోజుకు కేవలం రెండు లేదా మూడు కప్పులు మాత్రమే తీసుకోవాలి.



ఆరోగ్యం, ఆయుష్షు
శాకాహారంతోనే సాధ్యం!

రోగ నిరోధక శక్తి పెంపుతోపాటు జీర్ణ సంబంధ సమస్యలకు చెక్

నేడు ప్రపంచ శాకాహార దినోత్సవం

సంపూర్ణ ఆరోగ్యానికి శాకాహారమే సరియైనది. ఇది అక్షర సత్యం. శారీరకంగా, మానసికంగా, ఆధ్యాత్మికంగా అత్యున్నత స్థితికి ఎదగాలంటే శాకాహారంతోనే సాధ్యమని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఆకుకూరలు, కాయ గూరల వల్ల జీర్ణశక్తి పెంపొందుతుంది. పప్పుదినుసులలోనూ మాంస కృత్తులు ఉన్నాయి. మాంసాహారాన్ని భుజించేవారు కూడా శాకాహారానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. శాకాహారం మనిషిలో చురుకుదనం పెరగడంతోపాటు మేధస్సు పెరుగుతుందని పెద్దలు చెబుతారు.

- ఆత్మకూరు

మనిషి శారీరక నిర్మాణానికి ముఖ్యంగా ప్రోటీన్లు (మాంస కృత్తులు), కార్బోహైడ్రేట్‌లు (పిండిపదార్థాలు), కొవ్వు పదార్థాలు, లవణాలు అవసరం. మాంసాహారం కన్నా శాకాహారంలోనే అవి ఎక్కువగా లభిస్తాయి. పాలు, మీగడ, జున్ను, బఠానీలు, బీన్స్ ఎక్కువ శాతంలో ప్రోటీన్లు కలిగి ఉంటాయి. బియ్యం, గోధుమలు, ఇతర ధాన్యాలు, పండ్లు, పలు రకాల కూరగాయలు ఎక్కువగా పిండిపదార్థాలు కలిగి ఉంటాయి. వయసు పెరిగే కొద్దీ వచ్చే అనారోగ్యం, జీర్ణ సంబంధ సమస్యలను తగ్గించడానికి ఈ ఆహారం ఎంతో ఉపయోగపడుతుంది. అందుకేకాబోలు ఎక్కువ మంది వైద్యనిపుణులు శాకాహారమే తీసుకోవాలని సూచిస్తున్నారు. అందుకనుగుణంగానే జిల్లాలో శాకాహారం తీసుకునే వారి సంఖ్య పెరుగుతోంది.

● విటమిన్లూ అవసరమే..

మన ఆరోగ్యానికి విటమిన్లు కూడా ఎంతో అవసరం. శాకాహారం మాత్రమే అందుకు సరైన ఆధారం. పచ్చని కూరగాయలు, క్యారెట్లు, టమోటాలు, ముల్లంగి ఆకులలో విటమిన్-ఏ లభిస్తుంది. ఇక విటమిన్- బి పచ్చని ఆకుకూరలు, గింజ ధాన్యాలలో ఉంటుంది. విటమిన్-సి పచ్చని కూరగాయలు, నిమ్మ, జామ, ఉసిరిక, ఆరెంజ్ చీనీపండు వంటి క్షారయుక్తమైన పండ్లలో ఇది లభిస్తుంది. కాయగూరల్లో విటమిన్-డి లభిస్తుంది. దీనికి ముఖ్యంగా సూర్యరశ్మి శ్రేష్ఠమైనది. నెయ్యి, వెన్నలో విటమిన్-ఈ లభిస్తుంది. పచ్చని కూరగాయల్లో విటమిన్- కె లభిస్తుంది. పాల ఉత్పత్తుల నుంచి లభించే విటమిన్ బి-12 శరీరం ఎంతో ఎక్కువ సమర్థవంతంగా గ్రహించగలుగుతుంది. కాబట్టి సంపూర్ణ ఆరోగ్యానికి అవసమైన అన్ని విటమిన్లు శాకాహారంలో లభిస్తాయి.

శాకాహారంతో ఉపయోగాలు..

● మాంసాహారంతో పోల్చుకుంటే శాకాహారానికి ఖర్చు తక్కువ. ఆరోగ్యం ఎక్కువ. ● శాకాహారంలోని పీచు పదార్థం శరీరంలోని విష పదార్థాలను బయటకు తీసేయడానికి సహాయపడుతుంది. ● సమతుల్య శాకాహారంలో యాంటీ ఆక్సిడెంట్ విటమిన్లు (సీ, ఈ, బీటా-కెరోటిన్) పుష్కలంగా ఉండి శరీర కణాలను నాశనం కాకుండా కాపాడేందుకు సహాయపడతాయి. ● వైరల్ హైపర్‌టైటస్‌తో బాధపడుతున్న రోగులకు, కాలేయ సంబంధమైన వ్యాధిగ్రస్థులకు శాకాహార భోజనమే అనుకూలమైనది. ● మలబద్ధకం నివారణతోపాటు కీళ్ల నొప్పులు రాకుండా ఉండాలంటే శాకాహారమే శ్రేయస్కరమని వైద్యనిపుణులు చెబుతున్నారు.

సంపూర్ణ ఆరోగ్యానికి శాకాహారం ముఖ్యం



మనిషి సంపూర్ణ ఆరోగ్యానికి శాకాహారం ముఖ్యం. జీర్ణవ్యవస్థ బాగుండి ఎలాంటి రోగాలు రావు. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పప్పుధాన్యాలు తినడం వల్ల ఆరోగ్యంగా జీవించవచ్చు. శారీరకంగా, మానసికంగా, ఆధ్యాత్మికంగా అత్యున్నత స్థితికి ఎదగాలంటే శాకాహారమే శరణ్యం. మాంసాహారం మన ఆరోగ్యానికి ఎన్నో విధాలుగా చెడు చేస్తుంది.

- డాక్టర్ చంద్రా సుబ్రహ్మణ్యం, ఆత్మకూరు

శాకాహారమే శ్రేష్ఠమైనది



శాకాహారం వల్ల శరీరం, మనసు, ఆత్మశుద్ధియై ఉన్నతమైన శక్తులు పొందుతాం. కాయ గూరల్లో పోషకాలు లభిస్తాయి. ఆకుకూరలు వాడకం వల్ల జీర్ణశక్తి పెరుగుతుంది. కూరగాయలు, పండ్లు ఆరోగ్యంతోపాటు అందాన్ని పెంపొందిస్తాయి. సర్వప్రాణుల పట్ల మైత్రి, కరుణే మాధవుని సేవ. కాబట్టి శాకాహారాన్ని ప్రోత్సహిద్దాం.

- సీహెచ్ విజయ, పిరమిడ్ మాస్టర్, ఆత్మకూరు

రక్తం కొరత తీర్చండి!

70 శాతం అవసరాలు తీర్చేది రెడ్‌క్రాసే ● జిల్లాలో 50 వేల మందికిపైగా రక్తదాతలు
మరింత మందిని ప్రోత్సహించాల్సిన అవసరం ● వైసీపీ ప్రభుత్వంలో ఏపీ సాక్స్ నిధులు పక్కదారి
● నేడు జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 30 : జిల్లాలో వివిధ కారణాలతో రక్తం అవసరమైన వారికి దానిని అందించటంలో రక్తనిధి కేంద్రాలు విఫలమవుతున్నాయి. జాతీయ రహదారి, పలు రాష్ట్ర రహదారులు జిల్లా మీదుగా సాగుతుండటంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎంతో మంది క్షతగాత్రులవుతున్నారు. వీరుకాక రకరకాల వ్యాధులతో బాధపడేవారు, శస్త్రచికిత్స చేయించుకునే వారు, రక్తహీనత ఉన్నవారికి రక్తం ఎక్కించాల్సి ఉంటుంది. అయితే అవసరాలకు తగినంత రక్తం అందించ లేని పరిస్థితి జిల్లాలో నెలకొంది. దీనికి ప్రధాన కారణం రక్తదాతల కొరత. జిల్లాలో 26.50 లక్షల మంది జనాభా ఉన్నా వీరిలో 50 వేల మంది మాత్రమే రక్తదానం చేస్తున్నారు. ఏడాదికి 40 వేల యూనిట్ల రక్తం అవసరంకాగా ప్రస్తుతం 30 వేల యూనిట్లు మాత్రమే రోగుల అవసరాలను తీర్చుతున్నారు. ప్రతి 100 మందిలో 15 మంది రక్తదానం చేస్తేనే జిల్లాలో రక్తం అవసరాలు తీరుతాయని నిపుణులు అంచనా. అయితే ప్రస్తుతం వంద మందికి కేవలం ఐదుగురే రక్తదానం చేస్తుండటంతో రక్తం కొరత ఏర్పడింది. ప్రస్తుతం 70 శాతం మంది రోగులకు రక్తం అవసరాలను ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ తీరుస్తోంది. అయితే కరోనా అనంతరం రక్తదాన శిబిరాలు మందగించడంతో ఆ ప్రభావం రక్తం నిల్వలపై పడుతోంది. ఈ నేపథ్యంలో అక్టోబరు 1వ తేదీని జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవంగా జరుపుకోవాలని కేంద్ర ప్రభుత్వ తీర్మానించింది. రక్తదాన మోటివేటర్లను మరింత ఉత్సాహపరిచి రక్తదాతలను ప్రేరేపించే విధంగా బ్లడ్‌బ్యాంకులు కృషిచేయాలని పిలుపునిచ్చింది.

ఎన్నో బ్లడ్‌బ్యాంకులు.. అయినా!

జిల్లాలో ఎన్నో బ్లడ్‌బ్యాంకులు ఉన్నా రక్తం అవసరాలు తీరడం లేదు. ప్రధానంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లోని రోగులకు రెడ్‌క్రాస్ రక్తనిధే దిక్కవుతోంది. జీజీహెచ్‌లో రక్తనిధి ఉన్నా అది పూర్తిగా నిర్వీర్యం అయిందన్న విమర్శలున్నాయి. ఇద్దరు ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్ చేసిన వైద్య నిపుణులు ఉన్నా రక్తదాన శిబిరాలను నిర్వహించటంలో వైఫల్యం చెందుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కాగా, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్ అత్యధికంగా ఏటా 20 వేలకుపైగా యూనిట్ల రక్తాన్ని సేకరిస్తోంది. ప్రస్తుతం రెండు ప్రత్యేక బస్సుల ద్వారా రక్తాన్ని సేకరించే సదుపాయం రెడ్‌క్రాస్‌కు ఉంది. నారాయణ, అపోలో ఆసుపత్రుల్లోని బ్లడ్ బ్యాంక్‌లు కూడా ఏటా వేల యూనిట్ల రక్తాన్ని సేకరిస్తూ రక్తదాతలను ప్రోత్సహిస్తున్నాయి. కావలి, ఆత్మకూరు, ఉదయగిరి ఏరియా ఆసుపత్రుల్లోని బ్లడ్ బ్యాంక్‌లు రెడ్‌క్రాస్ సహకారంతో రక్తాన్ని సేకరిస్తున్నాయి. ఇవికాక, నెల్లూరులో సేవా బ్లడ్‌బ్యాంక్, నెల్లూరు బ్లడ్‌బ్యాంక్, విజయ బ్లడ్‌బ్యాంక్‌లు కూడా రక్తం అవసరాలను కొంతమేర తీరుస్తున్నాయి.



● ఏపీ సాక్స్ నిధులు పక్కదారి

రక్తం సేకరణకు బ్లడ్ బ్యాంకులకు ప్రభుత్వం ఉచితంగా రక్తబ్యాగులను, కిట్స్ పంపిణీ చేస్తుంది. కేంద్ర ప్రభుత్వం అందించే నిధుల ద్వారా ఏపీ సాక్స్ (ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ) ఈ బ్యాగులను, కిట్లను కొనుగోలు చేసి ఆయా బ్లడ్‌బ్యాంకులకు పంపిస్తుంది. అయితే గత వైసీపీ ప్రభుత్వం కేంద్రం విడుదల చేసిన నిధులను పక్కదారి పట్టించింది. ఒక రక్తం బ్యాగ్, కిట్‌కు రూ.500 దాకా ఖర్చు అవుతుంది. అయితే గత ఐదేళ్లలో ప్రభుత్వం నుంచి అవి రాకపోవటంతో బ్లడ్‌బ్యాంకులే బయట కొనుగోలు చేస్తున్నారు. ఈ క్రమంలో రక్తదాతల నుంచి రక్తం సేకరించేందుకు లక్షల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఈ పరిస్థితిలో రక్తం యూనిట్ ధర రూ.1300కు పెరిగింది. అయితే ఇటీవల కూటమి అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో మరలా బ్యాగులు, కిట్లు అందుబాటులోకి వస్తాయని బ్లడ్‌బ్యాంకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

ఎందరికో రక్తం...



ప్రస్తుతం ప్రభుత్వ ఆసుపత్రుల తోపాటు ప్రైవేట్ ఆసుపత్రుల్లోనూ అవసరమైన వారికి రక్తం అందిస్తున్నాం. అయితే జిల్లా అవసరాల కు తగ్గట్టు రక్తం నిల్వలు ఉండటం లేదు. రక్తదాతలు పెరగాల్సిన అవసరం ఉంది.

- అజయ్‌బాబు, రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్ కన్వీనర్, రక్తదాత

జీజీహెచ్ బ్లడ్‌బ్యాంక్‌లో సంస్కరణలు చేపడుతున్నాం



ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని రక్తనిధిలో అనేక సంస్కరణలు తీసుకువస్తున్నాం. రక్తదాన శిబిరాలు నిర్వహించేలా ప్రోత్సహిస్తున్నాం. ఇటీవల దాతల సహకారంతో రక్తం సపరేటర్‌ను కూడా ప్రారంభించాం. దీనిద్వారా మరిన్ని సేవలను రోగులకు అందిస్తాం.

- డాక్టర్ సిద్దానాయక్, జీజీహెచ్ సూపరింటెండెంట్

ఎక్సైజ్‌లో బదిలీల ప్రక్రియ పూర్తి

నెల్లూరు (క్రైం) : జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖలో బదిలీల ప్రక్రియ దాదాపుగా ముగిసింది. 16 మంది ఎస్‌ఐలు, ఉమ్మడి జిల్లాలోని 22 మంది హెడ్‌కానిస్టేబుళ్లు, 155 మంది కానిస్టేబుళ్లను బదిలీ చేస్తూ జిల్లా డిప్యూటీ కమిషనర్ టి శ్రీనివాసరావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఎస్ఐ పేరు	ఎక్సైజ్ స్టేషన్
ఎస్ ప్రభాకర్‌రావు	నెల్లూరు-1
జేకేవీస్ మురళీకృష్ణ	నెల్లూరు-1
డీ శ్రీధర్	నెల్లూరు-1
ఎస్ శకుంతలదేవి	నెల్లూరు-2
ఎస్‌డీ మునీర్ అహ్మద్	నెల్లూరు-2
ఓ ప్రతాప్‌కుమార్	కోవూరు
షేక్ మహబూబ్‌బాషా	కోవూరు
కె హరిబాబు	ఇందుకూరుపేట
ఎస్ రేవతి	కందుకూరు
ఎం దేవిక	కావలి
దీప్తిక్రాంత్	ఉదయగిరి
ఎం అంజయ్య	పొదలకూరు
సీహెచ్ పూర్ణకుమార్	ఏసీ ఎన్‌ఫోర్స్‌మెంట్
ఎన్‌డీ కాలేషావలి	ఏసీ ఎన్‌ఫోర్స్‌మెంట్
కెవీఆర్ ఆంజనేయులు	పీఅండ్‌ఈ ఎస్టీఎఫ్
ఎండీ ఆసీఫ్‌బేగ్	ఐఎంఎల్ డిపో

రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాలుడి మృతి

● మృతదేహంతో బాధితులు, దళిత సంఘాల ఆందోళన
● గుడ్లూరు పోలీస్‌స్టేషన్ వద్ద ఉద్రిక్తత
● స్తంభించిన ట్రాఫిక్, ప్రయాణికుల అవస్థలు

గుడ్లూరు, సెప్టెంబరు 30 : ఆటోను ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో తీవ్రగాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతుండిన బాలుడు మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులు దళిత సంఘాల ఆధ్వర్యంలో గుడ్లూరు పోలీసు స్టేషన్ ఎదుట కావలి-కందుకూరు రహదారిపై బాలుడి మృతదేహంతో బైఠాయించి, న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేశారు. వివరాల మేరకు.. మండలంలోని అడవిరాజుపాలెం ఎస్సీ కాలనీకి చెందిన గౌడపేరు అశోక్‌చక్రవర్తి (12) ఆదివారం ఉదయం బంధువులతో కలిసి ఆటోలో రామాయపట్నంకు వెళ్లి సాయంత్రం తిరిగి రాజుపాలెంకు వస్తుండగా నాగేళ్ల తగిలించుకుని వస్తున్న ట్రాక్టర్ ఆటోను ఢీకొంది. దీంతో ఆటోలో ముందు కూర్చుని ఉన్న అశోక్ చక్రవర్తి కాలుకు నాగేళ్ల తగలడంతో మోకాలి కింద వరకు తెగి పడిన విషయం విదితమే. బాలుడ్ని ఒంగోలు రిమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్సపొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. అయితే, ట్రాక్టర్‌తోపాటు డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ట్రాక్టర్ యజమానిని అదుపులోకి తీసుకోలేదు. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ దళిత సంఘాల ఆధ్వర్యంలో బాధిత కుటుంబ సభ్యులు సోమవారం సాయంత్రం బాలుడి మృతదేహంతో పోలీస్ స్టేషన్ ఎదుట కావలి-కందుకూరు రహదారిపై బైఠాయించి ఆందోళన చేశారు. దీంతో సుమారు నాలుగు గంటల పాటు ట్రాఫిక్ స్తంభించింది. ఆర్టీసీ బస్సులు వెనుదిరిగాయి. ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. ఈ క్రమంలో స్పందించిన పోలీసులు గుడ్లూరు రెడ్డిపాలెంకు చెందిన ట్రాక్టర్ యజమాని కోసం గాలిస్తున్నామని బాధితులకు నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. అయినా శాంతించని ఆందోళనకారులు బాధిత కుటుంబానికి వెంటనే న్యాయం చేయాలని అక్కడే బైఠాయించారు. ఒకానొక దశలో బాలుడి మృతదేహంతో స్టేషన్ లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు స్టేషన్ గేట్లు మూసివేశారు. దీంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. చివరకు పోలీసులు దళిత సంఘాలకు చెందిన ముఖ్య నాయకులను స్టేషన్ లోపలికి పిలిచి కేసుకు సంబంధించిన పరిష్కార మార్గాలపై ఎస్సై వెంకట్రావు చర్చించారు. న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో శాంతించిన ఆందోళనకారులు మృతదేహంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు.



బాలుడి మృతదేహంతో గుడ్లూరు పోలీస్ స్టేషన్ ఎదుట బాధితులు



గౌడపేరు అశోక్ చక్రవర్తి (ఫైల్)

డ్వామా పీడీ బాధ్యతల స్వీకరణ

నెల్లూరు (జడ్పీ), సెప్టెంబరు 30 : డ్వామా పీడీగా గంగాభవాని సోమవారం బాధ్యతలు చేపట్టారు. డ్వామా పీడీగా పని చేస్తున్న వెంకటరావును సొంత శాఖకు బదిలీ చేసి ఆయన స్థానంలో చిత్తూరులో విధులు నిర్వహిస్తున్న గంగాభవానీని డ్వామా పీడీగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆమె సోమవారం బాధ్య తలు చేపట్టారు. కార్యాలయ అధికారులు, సిబ్బంది, ఉద్యో గులు ఆమెకు అభినందనలు తెలిపారు. పనికి ఆహార పథ కానికి సంబంధించి ప్రభుత్వ లక్ష్యాలను పూర్తి చేసేందుకు, ఎక్కువ పనిదినాలు పేదలకు కల్పించేందుకు కృషి చేస్తా నని పీడీ తెలిపారు.

ఆంధ్రజ్యోతి విజిట్

వింటున్నారంతే..!


కలెక్టర్‌కు సమస్యలను వివరిస్తున్న ప్రజలు


ఈయన కనిగిరి మండలం గురవాజీపేటలోని మిట్టమీదపల్లికి చెందిన వృద్ధుడు ఇంజం చినగురవయ్య. ఈయనకు రెండెకరాల పొలముంది. ఆ పొలానికి ఇరువైపులా ఉన్నవారు ఆయన్ను పొలంలోకి వెళ్లకుండా అడ్డుకుంటున్నారు. ఈ విషయంపై రెండుసార్లు తహసీల్దార్ కార్యాలయంలో అర్జీ ఇచ్చినా పట్టించుకోలేదు. ఆయన మనవడు కూడా వచ్చి అర్జీ ఇచ్చినా స్పందన లేదు. చినగురవయ్య ఇప్పటికీ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. అతని సమస్య మాత్రం పరిష్కారం కాలేదు.

ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు తీరు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుంది. నిర్లక్ష్యంతో కొందరు, రాజకీయ ఒత్తిళ్లతో మరికొందరు ప్రజా ఫిర్యాదులను బుట్టదాఖలు చేస్తున్నారు. జిల్లాస్థాయిలో కొంత మెరుగ్గా ఉన్నా మండల స్థాయిలో ప్రభుత్వ లక్ష్యానికి అధికారులు తూట్లు పొడుస్తున్నారు. ప్రతి సోమవారం నిర్వహించే 'మీకోసం' (ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ) కార్యక్రమంలో వచ్చే అర్జీల పరిష్కారంలో ఏళ్లతరబడి నిర్లిప్తత కనిపిస్తోంది. అర్జీదారులను వందల సార్లు కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారు. కనీసం ఎన్ని వినతులు వచ్చాయో కూడా నమోదు చేయడం లేదు. జిల్లాలోని పలు మండలాల్లో ఆంధ్రజ్యోతి నిర్వహించిన ప్రత్యేక 'విజిట్' అనేక ఆసక్తికర విషయాలు వెలుగుచూశాయి.


నాలుగేళ్లుగా తిరుగుతున్నానయ్యా..

భూ సమస్య పరిష్కారం కోసం గత నాలుగేళ్లుగా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాను. గత ప్రభుత్వంలో ఎవరూ పట్టించుకోలేదు. ఈ ప్రభుత్వంలోనైనా పరిష్కారం అవుతుందనే ఆశతో వచ్చాను. మాకు 2.56 ఎకరాల సాగ భూమి ఉంది. అధికారులు 2.30 ఎకరాల భూమిని మాత్రమే రికార్డుల్లో ఎక్కించారు. 26 సెంట్ల భూమిని రికార్డులో ఎక్కించుకోవడానికి నాలుగేళ్లుగా తిరుగుతున్నా పని జరగడం లేదు. ఇప్పుడైనా అధికారులు స్పందించి తమ సమస్యను పరిష్కరించాలి.

- జంపాల సత్యనారాయణ, రైతు, తూర్పువెంకటాపురం


ఈయన అర్ధవీడు మండలం బోగోలుకు చెందిన చేగిరెడ్డి యలమందారెడ్డి. ఈయనకు గ్రామంలో ఐదు సర్వే నెంబర్లలో 65 సెంట్ల భూమి ఉంది. అది అతని పూర్వీకుల నుంచి సంక్రమించింది. ఆ స్థలాలు కొందరి ఆధీనంలో ఉన్నాయి. తన స్థలాలను తనకు ఇప్పించాలని యలమందారెడ్డి 2006 నుంచి అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఆక్రమణదారులకు రాజకీయ బలం ఉండటంతో అతని అర్జీలను అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ 18 ఏళ్లలో వివిధ స్థాయిల్లో 433 సార్లు అర్జీలిచ్చినా న్యాయం జరగలేదు. కనీసం ఏదో ఒక అధికారి కనికరించి న్యాయం చేయకపోతాడా అనే ఆశతో యలమందారెడ్డి ఒంటరిపోరాటం చేస్తూనే ఉన్నారు.

ఒంగోలు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారంలో అత్యంత కీలకమైన మండల స్థాయి అధికారుల పనితీరు అధ్వానంగా ఉంది. ప్రజలు వినతులిచ్చేందుకు వస్తే చాలా మండలాల్లో అధికారులు అందుబాటులో ఉండటం లేదు. అధికారులున్న చోట కూడా వారి సమస్యలను పట్టించుకోవడం లేదు. ప్రతి సోమవారం ప్రజా సమస్యలపై అధికారులు వినతులు స్వీకరించాలి. అవకాశం ఉన్న వాటికి తక్షణ పరిష్కారం, అలాకాని వాటికి నిర్దిష్ట కాలంలో పరిష్కారం చూపాలని ప్రభుత్వం ఆదేశించింది. పరిష్కారమయ్యే అవకాశం లేని సమస్యలయితే ఆ విషయాన్ని అర్జీదారుడికి లిఖితపూర్వకంగా తెలపాలి. అందుకోసం జిల్లా, మండలస్థాయిలో ప్రజా విజ్ఞప్తుల దినోత్సవాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఈ విధానం అస్తవ్యస్తంగా కొనసాగింది.

ప్రజా వినతులపై ప్రభుత్వం దృష్టి

కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలపై దృష్టి పెట్టింది. అందుకోసం పీజీఆర్ఎస్ (ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ) పేరుతో ప్రతి సోమవారం జిల్లా, మండలస్థాయిలో వినతుల స్వీకరణకు శ్రీకారం చుట్టింది. ఆ సమయంలో వచ్చే అర్జీల పరిష్కారంపై అధికారులు క్షేత్రస్థాయిలో సమీక్షలు చేయాలని చెప్పింది. అయితే జిల్లాలో ఈ విధానం అమలు అధ్వానంగా అఘోరిస్తోంది. కలెక్టరేట్‌లో మాత్రమే కొంత మెరుగ్గా నడుస్తోంది.

కలెక్టరేట్‌లో ఇలా..

కలెక్టరేట్‌లో కలెక్టర్, జేసీతో పాటు పది, పన్నెండు శాఖల అధికారులు ప్రజా వినతులు స్వీకరించి పరిష్కారాలు చూపాలి. అర్జీలను చూసి అక్కడికక్కడ జిల్లా అధికారులు, అవసరమైతే మండల స్థాయి అధికారులతో కలెక్టర్, జేసీ, డీఆర్వో స్థాయి అధికారులు మాట్లాడి పరిష్కారాలు చూపుతున్నారు. ప్రజల నుంచి వచ్చే వినతుల వివరాలను కలెక్టరేట్‌లో నమోదు చేసి రసీదులు కూడా ఇస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో ఇప్పటి వరకూ కలెక్టరేట్‌లో నిర్వహించిన, వివిధ ప్రాంతాల్లో కలెక్టర్ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వినతుల స్వీకరణతో పాటు సీఎం కార్యాలయం నుంచి పరిశీలన కోసం వచ్చినవి కలిపి 4,488 అర్జీలు జిల్లా యంత్రాంగానికి అందాయి. అందులో 3,457 పరిష్కారం అయ్యాయి. 1031 వివిధ స్థాయిలో పెండింగులో ఉన్నాయి.

- మండలాల్లో మొక్కుబడిగా 'మీ కోసం'
- ఎన్నిసార్లు విన్నవించుకుఉన్నా పట్టించుకోని అధికారులు
- అర్జీలన్నీ బుట్టదాఖలు
- వేళకు రారు.. సమస్యలు పట్టించుకోరు
- కొన్నిచోట్ల ఇద్దరు, ముగ్గురే దర్శనం
- వచ్చే వినతులనూ నమోదు చేయని వైనం
- ఎన్నిసార్లు తిరిగినా సమస్యలు అపరిష్కృతంగానే..
- కలెక్టరేట్‌లో కొంత మెరుగు.. క్షేత్రస్థాయిలో అధ్వానం
- ఆంధ్రజ్యోతి క్షేత్రస్థాయి పరిశీలనలో ఆసక్తికర విషయాలు వెలుగులోకి..

ఒంగోలు కార్పొరేషన్ కార్యాలయంలో నూ ఖాళీగా...



పెద్దారవీడు మండలం సానికవరానికి చెందిన గొట్టెముక్కల పెద్దలక్ష్మయ్య 10 ఏళ్లుగా రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. తన తల్లికి ఎర్రగొండపాలెం మండలం గుర్రపుసాల గ్రామ ఇలాకాలో సర్వే నెంబర్ 923లో 3.78 ఎకరాల భూమి ఉందనీ, పాస్‌బుక్, మాన్యువల్ అడంగల్‌లలో పేర్లు కనిపిస్తున్నాయనీ, ఆన్‌లైన్‌లో మాత్రం నమోదు చేయడంలేదనీ చెబుతున్నారు. ఈ సమస్యపై ఇప్పటికే తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ అనేకసార్లు తిరిగినా పరిష్కారం కాలేదని పెదలక్ష్మయ్య వాపోయారు.


పెదారవీడులో అంతా ఖాళీ...

మండలాల్లో అధికారుల తీరుకు నిదర్శనాలివిగో..

మండల స్థాయిలో పరిస్థితి దారుణంగా ఉంది. సోమవారం జిల్లావ్యాప్తంగా ప్రజా సమస్యల పరిష్కార వేదికల వద్ద జరుగుతున్న తీరును ఆంధ్రజ్యోతి బృందం పరిశీలించగా మండలాల్లో మొక్కుబడిగా జరుగుతున్న తీరు బహిర్గతమైంది. అధికారుల తీరుతో కొన్నిచోట్ల సమస్యలు చెప్పేందుకు కూడా ప్రజలు ముందుకు రావడం లేదు.


సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు

- చాలా మండలాల్లో పది గంటలకు అధికారులే హాజరుకావడం లేదు. వివిధ శాఖల నుంచి పది మంది అధికారులు ఉండాల్సి ఉంటే ఎక్కువ మండలాల్లో ఇద్దరు, ముగ్గురు అధికారులే వినతుల స్వీకరిస్తున్నారు.
- మండలాల్లో అలాంటి ప్రక్రియ సాగడం లేదు. ఇక కొన్ని మండల కార్యాలయాల వద్ద అధికారుల కోసం అర్జీలు పట్టుకొని ప్రజలు వేచి చూస్తుండగా మరికొన్ని చోట్ల ఏళ్ల తరబడి తిరుగుతున్నా సమస్యలు పరిష్కారం కావడం లేదని అవేదన వ్యక్తం చేస్తున్న పరిస్థితి కనిపిస్తోంది.
- కనిగిరి ఆర్డీవో కార్యాలయంలో ఉదయం పది గంటలకు ఒక్క అధికారి మాత్రమే కనిపించారు.
- పెద్దారవీడు, కురిచేడు మండల కార్యాలయాలకు నిర్ణీత సమయానికి ఒక్క అధికారి కూడా రాలేదు.
- కంభం, దర్శి, మార్కాపురం గిద్దలూరు, దొనకొండ, కొమరోలు, పుల్లలచెరువు, ముండ్లమూరు, పొదిలి, బి.పేట, కెకె.మిట్ల, ఒంగోలు... ఇలా ఏ మండల కార్యాలయంలో చూసినా ఇద్దరు, ముగ్గురు లేదా నలుగురికి మించి అధికారులు హాజరుకాకపోవడం కనిపించింది.
- సబ్ కలెక్టర్ పర్యవేక్షణలో సాగే మార్కాపురం డివిజన్ కేంద్రంలోనూ కొద్దిమంది అధికారులే కనిపించారు.
- పామూరులో తహసీల్దార్ వచ్చి కొద్దిసేపటికే బయటకు వెళ్లడంతో అర్జీదారులు ఆయన కోసం గంటల తరబడి నిరీక్షిస్తూ కనిపించారు.

ఎక్సైజ్ శాఖలో బదిలీల పర్వం పూర్తి

ఉమ్మడి జిల్లాలో 24మంది ఎస్సైలకు పోస్టింగ్‌లు

28 హెడ్ కానిస్టేబుళ్లు, 137 మంది కానిస్టేబుళ్లకు స్థానచలనం

ఒంగోలు(క్రైం), సెప్టెంబరు 30: ఎక్సైజ్ శాఖలో బదిలీల పర్వం పూర్తయ్యింది. ఎక్సైజ్‌లో ఎస్ఈబీ విలీనం కావడంతో డిప్యూటీ కమిషనర్ నుంచి కానిస్టేబుళ్ల వరకు బదిలీలు జరిగాయి. ఆ మేరకు 24 మంది ఎస్ఐలను బదిలీ చేస్తు డిప్యూటీ కమిషనర్ హేమంత్ నాగరాజు ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. అదేవిధంగా 24 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 137 మంది కానిస్టేబుళ్లను ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఖాజామొహిద్దీన్ జిల్లాలో ఆయా సర్కిల్ కార్యాలయలకు కేటాయిస్తు ఉత్తర్వులు ఇచ్చారు. ఉమ్మడి జిల్లాలో ఎస్సైల బదిలీలలో పి.రాజేంద్రప్రసాద్ ఏసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఒంగోలు, ఎం.శ్రీధర్ బాబు పర్చూరు, డి.ప్రభుదాసు బాపట్ల, ఎస్.మౌనిక బాపట్ల, డి.మౌలాలి ఏసీ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు బదిలీ అయ్యారు. వి.సైమన్ పొదిలి, ఎస్.హర్షవర్ధన రెడ్డి అద్దంకి, బి.అశోక్‌కుమార్ ఒంగోలు, ఎం.సిరినగేష్ చీమకుర్తి, ఏ.శ్రీనివాస రావు బాపట్ల టాస్క్‌ఫోర్స్‌కు పోస్టింగులు ఇచ్చారు.

చేపలు దండిగా.. బోట్లు నిండుగా

కె.పల్లెపాలెం మత్స్యకారులకు టన్నుల కొద్దీపడిన చేపలు

కరువుతీరా చిక్కిన కానాగంతల రకం చేపలు



కొత్తపట్నం(ఒంగోలు నగరం), సెప్టెంబరు 30 : వరుస తుఫాన్లతో వేట సాగక దిగాలుపడ్డ మత్స్యకారుల పంట పండింది. ఆదివారం సాయంత్రం వేటకు వెళ్లిన మత్స్యకారులకు దండిగ చేపలు పడ్డాయి. వారు వేటకు తీసుకుపోయిన బోట్లు చేపలతో నిండిపోయాయి. టన్నుల కొద్దీ చేపలతో మత్స్యకారులు ఆదివారం రాత్రికి ఒడ్డుకు చేరారు. ఒకటి కాదు రెండు కాదు వందకుపైగా పడవలతో వేటాడిన మత్స్యకారులకు బోల్డన్ని చేపలు పడ్డాయి. తీరానికి దగ్గరలోనే కానాగంతలు అనే రకం మత్స్యకారులకు వలకు టన్నుల కొద్దీ చిక్కాయి. చేపల కోసం సముద్రంలోకి వదిలిన వలలు చేపలతో నిండిపోయాయి. వలను సముద్రం నుంచి బయటకు లాగి బోట్లలో వేసుకుని తీరానికి చేర్చుకున్నారు. దీంతో ఆదివారం రాత్రి కొత్తపట్నం పల్లెపాలెం తీరం మత్స్యకారులతో కోలాహలంగా మారింది. ఒడ్డుకు చేరుతున్న పడవల నుంచి చేపలను ఇతర ప్రాంతాలకు తరలించేందుకు తీరంలో మత్స్యకారులు అప్పటికప్పుడే ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేసుకున్నారు. కె.పల్లెపాలెం తీరమంతా ఆదివారం ఏడు గంటల నుంచి సందడిగా మారిపోయింది. 50టన్నులకుపైగా చేపలు మత్స్యకారుల వలలకు చిక్కినట్లు చెబుతున్నారు.

టీచర్ల సిఫార్సు బదిలీలు

రంగం సిద్ధం చేసిన ప్రభుత్వం

వివరణ కోసం డీఈవోలకు జాబితాలు

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 30: ఉపాధ్యాయుల సిఫార్సు బదిలీలకు కూటమి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. గత వైసీపీ ప్రభుత్వంలో అభ్యర్థన మేరకు జరిగిన సిఫార్సు బదిలీలు అక్రమమంటూ హడావుడి చేసిన కూటమి పెద్దలు తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఆ తరహా బదిలీలు చేపట్టేందుకు డీఈవోల నుంచి వివరణ కోరడం పెద్ద సంచలనంగా మారింది. సిఫార్సు బదిలీలు చేపట్టేందుకు దరఖాస్తు చేసుకున్న టీచర్ల వివరాలను జిల్లా విద్యాశాఖాధికారులకు పంపి వాటిపై రిమార్కు కోరారు. కూటమి ప్రభుత్వ పాలన పారదర్శకంగా ఉంటుందని ముఖ్యంగా విద్యా శాఖలో గత ప్రభుత్వ తప్పిదాలకు ఫుల్‌స్టాప్ పడుతుందని గట్టిగా విశ్వసించిన టీచర్లకు తాజా పరిణామాలు తీవ్ర నిరాశను మిగిల్చాయి.

డీఈవోలకు జాబితాలు

సిఫార్సు బదిలీల కోసం ప్రభుత్వానికి అభ్యర్థన లేఖలు సమర్పించిన టీచర్ల వివరాలను రాష్ట్ర పాఠశాల విద్యా కమిషనర్ కార్యాలయం నుంచి డైరెక్టర్ పార్వతి పేరుతో డీఈవో కార్యాలయాలకు ఉత్తర్వులు అందాయి. ఆయా టీచర్లు ప్రస్తుతం పనిచేస్తున్న స్థానం, బదిలీ కోరుకుంటున్న స్థానం, తదితర వివరాలు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రస్తుతం అమలులో ఉన్న నిబంధనల ప్రకారం ఆ టీచర్లను బదిలీ చేయవచ్చు. వారి అభ్యర్థనను పరిశీలించి సమగ్ర నివేదికను సమర్పించాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వారి బదిలీలు చేపట్టేందుకు అవకాశం ఉన్న ప్రత్యామ్నాయ ఫార్మెట్‌ను తెలియజేయమన్నారు.

మంత్రిగారు మాట తప్పవద్దు

మంత్రి లోకేష్‌గారు ఆడిన మాట తప్పి మళ్లీ సిఫార్సు బదిలీలకు తెరలేపవద్దని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చెన్నుపాటి మంజుల, కే.భానుమూర్తిలు సోమవారం ఒక సంయుక్త ప్రకటనలో కోరారు గత ప్రభుత్వ హయాంలో జరిగిన సిఫార్సు బదిలీలను అందరూ తీవ్రంగా వ్యతిరేకించారని గుర్తుచేశారు. శాస్త్రీయ పద్ధతిలో జరిగే కౌన్సెలింగ్ బదిలీలకు తూట్లు పొడిచి సిఫార్సులకు రంగం సిద్ధం చేయడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. తక్షణమే వాటికి స్వస్తి చెప్పాలని డిమాండ్ చేశారు. టీచర్ల బదిలీలు అంటూ జరిగితే కౌన్సెలింగ్ విధానంలోనే జరగాలన్నారు.

ఆన్‌లైన్, ఆఫ్‌లైన్!

రెండు విధాలా అవకాశం

నూతన మద్యం పాలసీలో 171 దుకాణాలు

నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

11న లాటరీ

ఒంగోలు(క్రైం), సెప్టెంబరు 30 : నూతన మద్యం విధానం అమలులో భాగంగా ప్రైవేటు మద్యం దుకాణాల ఏర్పాటుకు రెండు విధాలా దరఖాస్తుకు అనుమతి ఇచ్చారు. మంగళవారం నుంచి దరఖాస్తులు స్వీకరణ కార్యక్రమాన్ని ఎక్సైజ్ అధికారులు చేపడతారు. ఆ మేరకు జిల్లాలో 171 మద్యం దుకాణాలు ఏర్పాటుకు ఆమోదం తెలిపారు. దీంతో ఈనెల 9 వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారు. 10 తేదీన దరఖాస్తులు పరిశీలించి, 11న కలెక్టర్ సమక్షంలో లాటరీ తెరిచి మద్యం దుకాణాలు కేటాయిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా 4 శ్లాబులలో మద్యం షాపులు కేటయించనున్నారు. జిల్లాలో రెండు శ్లాబుల పరిధిలో కేటాయింపు ఉంటుంది. అయితే మండలాన్ని యూనిట్‌గా తీసుకొని దుకాణాలు కేటాయిస్తున్నారు. దీంతో ఎక్కువగా రూ.55లక్షలు లైసెన్స్ ఫీజు శ్లాబులో దుకాణాలు ఉంటాయి, ఒంగోలు, మార్కాపురం ప్రాంతాలలో ఏర్పాటుచేయనున్న దుకాణాలు రూ.65 లక్షలు లైసెన్స్ ఫీజుగా నిర్ణయించారు.



దరఖాస్తు చేసేందుకు నిబంధనలు

- దరఖాస్తు ఫీజు రూ.2 లక్షలుగా నిర్ణయించారు. డీడీల రూపేణ, డిజిటల్ పేమింట్ చేయవచ్చు. అయితే ఫీజు తిరిగి ఇవ్వరు.
- ఒకరు ఎన్ని దరఖాస్తులైనా చేసుకోవచ్చు. మద్యం దుకాణం మాత్రం ఒక్కటే కేటాయిస్తారు.
- లైసెన్స్ ఫీజును ఆరు దఫాలుగా చెల్లించుకునే అవకాశం ఉంది.
- మద్యం దుకాణాల కాలపరిమితి రెండేళ్ల మాత్రమే. రెండో సవత్సవరం లైసెన్స్ ఫీజు 10 శాతం పెంచి చెల్లించాలి.
- మునిసిపల్ కార్పొరేషన్ పరిధి నుంచి ఐదు కిలోమీటర్ల వరకు దుకాణాల ఏర్పాటుకు ఒకే శ్లాబు వర్తిస్తుంది. నగర పంచాయితీల నుంచి రెండు కిలోమీటర్ల పరిధి వరకు ఒకే శ్లాబు ఉంటుంది.
- మద్యం దుకాణాలకు అప్లికేషన్ నేరుగా ఇచ్చేవారు ఆయా సర్కిల్ కార్యాలయంలో ఇవ్వాలి.
- దరఖాస్తుదారుడు గుర్తుంపుకార్డుతోపాటు, పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు తెచ్చుకోవాలి. డీడీలు తీసేవారు ఏ జిల్లాలో మద్యం దుకాణం కావాలో ఆ జిల్లాలో ఉన్న బ్యాంక్‌లలోనే డీడీలు తీయాలి.

దారి మరిచి.. పోయింది ప్రాణం

కావలి వద్ద జిల్లా క్రీడాకారిణి మృతి

తోడైన ఎస్‌జీఎఫ్ అధికారుల బాధ్యతారాహిత్యం


ప్రమాద ప్రాంతం(ఇన్‌సెట్లో) మైథిలీ మృతదేహం

ఒంగోలు (కార్పొరేషన్), సెప్టెంబరు 30 : క్రీడాకారుల భద్రత చూసుకోవాల్సిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అధికారుల నిర్లక్ష్యంతో ఓ విద్యార్థిని ప్రాణాలు కోల్పోయింది. పొన్నలూరు మండలం, ముండ్లమూరువారిపాలెంకు చెందిన మైథిలి అనే విద్యార్థిని అటు చదువులతోపాటు ఇటు క్రీడల్లోనూ ప్రతిభ చాటుతుంది. సెప్టెంబరు 27 నుంచి 30వ తేదీ వరకు వినుకొండలో జరిగిన ఫుట్‌బాల్ పోటీలలో పాల్గొంది. కాగా వాస్తవానికి ఈనెల 30వ తేదీ అక్కడే ఉండాల్సిన జట్టు ఒకరోజు ముందు ఆదివారం రాత్రి 10గంటలకు ఒంగోలుకు చేరుకున్నారు. ఆ తర్వాత బంధువు అంటూ వచ్చిన యువకుడి బైక్‌పై వెళ్లిన విద్యార్థిని ఇంటికి చేరకుండానే దారి తప్పి వెళ్లారు. ఆనక నెల్లూరు జిల్లా కావలి వద్ద రోడ్డుప్రమాదంలో ప్రాణాలు కోల్పోయింది. అయితే జట్టును పోటీలకు తీసుకెళ్ళినప్పటి నుంచి తిరిగి వారిని ఇంటికి చేర్చే వరకు బాధ్యత వహించాల్సిన ఎస్ఎఫ్‌జీ సెక్రటరీ నిబంధనలు తుంగలో తొక్కింది. జట్టుతోపాటు మహిళా టీచర్‌ను తప్పనిసరిగా మేనేజరుగా పంపాల్సి ఉంది. లేనిచో ఆ టీమును రద్దుచేయాలి. టీమును తీసుకెళ్ళినప్పటి నుంచి తిరిగి వచ్చినపుడు సెక్రటరీ దగ్గరుండి జట్టును రిసీవ్ చేసుకోవాలి. తదనంతరం తల్లిదండ్రులకు, సంబంధిత పాఠశాల ఉపాధ్యాయుడు, లేదా హెచ్ఎంకు సమాచారం అందించాలి. వారి అంగీకారం మేరకు పంపాల్సి ఉంది. ఒకవేళ రాత్రివేళ అయితే సెక్రటరీ సంరక్షణలో ఉంచుకుని మరుసటిరోజు ఇంటికి పంపించాల్సి ఉంది. అయితే ఇక్కడ క్రీడాకారులను రిసీవ్ చేసుకోవడానికి సెక్రటరీ రాకపోగా, విద్యార్థులు స్వచ్ఛందంగా వెళ్లిపోయారు. అందులోభాగంగా మైథిలీ ఇంటికి వెళ్లాల్సి ఉంది. కానీ అలా ఇంటికి చేరకుండా ప్రాణాలు కోల్పోవడంతో ఆమె తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. సెక్రటరీ పట్టించుకోకపోవడంతోనే మైదిలీ ప్రాణాలు కోల్పోయిందని ఆరోపిస్తున్నారు.

ఎవరూ స్పందించలేదు

రోడ్డు ప్రమాదం నేపథ్యంలో అక్కడి పోలీసులు ఆమె తల్లిదండ్రులకు సమాచారం అందించగా, వారు పాఠశాల ఉపాధ్యాయులను సంప్రదించారు. విషయం తెలిసిన వెంటనే వారు అధికారులను ఫోన్ ద్వారా సంప్రదించే ప్రయత్నం చేశారు. ఎస్‌జీఎఫ్ సెక్రటరీ స్విచ్ ఆఫ్ రావడంతో వారు హుటాహుటిన ఘటనా స్థలానికి వారు చేరుకోగా, మైథిలీని పోలీసులు అంబులెన్స్‌లో నెల్లూరు తీసుకెళ్ళగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బాధితులు డీఈఓకు విషయాన్ని తెలియజేయడం కోసం ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదని చెబుతున్నారు. ఎస్‌జీఎఫ్ చైర్మన్‌గా ఉన్న కలెక్టర్ దీనిపై ప్రత్యేక దృష్టి సారించి, నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఐపీఈ వారు చూసుకుంటారు: డీఈవో

ఇదే విషయాన్ని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ప్రెసిడెంట్‌గా ఉన్న డీఈఓ సుభద్రను వివరణకు కోరగా, రెండు రోజుల నుంచి తాము ఆఫీస్ మీటింగ్‌లో బిజీగా ఉన్నామని పేర్కొన్నారు. అయితే విషయం తన దృష్టికి వచ్చిందని, దీనిపై చర్యలు తీసుకోవాల్సింది తాము కాదని, ఐపీఈ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ వారు చూస్తారని సమాధానం ఇచ్చారు.

ఉఫ్..ఊఫ్.. ఇంకెంత కాలం?

- కట్టెల పొయ్యే దిక్కు
- ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిర్వాహకులకు తప్పని కష్టాలు

వలేటివారిపాలెం, సెప్టెంబరు 30: మండలంలోని 40ప్రాథమిక, 5ప్రాథమికోన్నత, 4ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, మోడల్ స్కూళ్లు ఉన్నాయి. ఈ పాఠశాలలలో 2,610 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీటిలో కేజీబీవీ పాఠశాల మినహా మిగిలిన ఏ పాఠశాలలో కూడా మధ్యాహ్న భోజన పథకానికి వంట గ్యాస్ లేదు. చేసేదిలేక వంట చేసే నిర్వాహకులు కట్టెలతో పొయ్యిమీద వంట చేస్తూ ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారు. వంట చేసే సమయంలో పొగ కళ్లలోకి, శరీరంలోకి వెళ్లి శ్వాసకోస వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది.


చుండి మోడల్‌స్కూల్‌లో కట్టెల పొయ్యి మీద వంట చేస్తున్న వంట ఏజెన్సీ నిర్వాహకులు

మౌలిక వసతులు కరువు: ప్రభుత్వ పాఠశాలల్లోని వంట ఏజెన్సీ నిర్వాహకులకు భోజనం చేసేందుకు సరైన మౌలిక వసతులు లేదు. చాలా చోట్ల వంటగదులు లేవు. చేసేదిలేక ఆరుబయట భోజనాలు వండుతున్నారు. దీనికితోడు పెరుగుతున్న కూరగాయలు, నిత్యవసర ధరలు, సకాలంలో బిల్లులు రాకపోవడం, నీటి సమస్య.. అన్నింటితో సహజీవనం చేస్తున్నారు. మధ్యాహ్న భోజన పథకానికి గ్యాస్‌లు ఇస్తామని ప్రభుత్వాలు చెబుతున్నా నేటికీ అమలుకు నోచుకోలేదు. అధికారులు స్పందించి సబ్సిడీపై గ్యాస్ సరఫరా చేయాలని నిర్వాహకులు కోరుతున్నారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

రోడ్డు ప్రమాదంలో వీఆర్‌వోకు గాయాలు

వింజమూరు, సెప్టెంబరు 30: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న వీఆర్‌వో కంచర్ల రమణయ్య రోడ్డు ప్రమాదంలో గాయపడిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ఏ కిస్టీపురం నుంచి వింజమూరులోని కార్యాలయానికి రమణయ్య బైకుపై వస్తుండగా మార్గమధ్యంలో కుక్క అడ్డు రావడంతో బైకు అదుపుతప్పి పడిపోవడంతో గాయాలయ్యాయి. స్థానికులు గమనించి అతనిని వింజమూరులోని ప్రైవేటు వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స చేయించారు. పలువురు రెవెన్యూ సిబ్బంది వైద్యశాలకు వెళ్లి వీఆర్‌వోను పరామర్శించారు.

వీధి కుళాయిలు ఏర్పాటు చేయండి

లింగసముద్రం, సెప్టెంబరు 30: గ్రామాల్లోని వీధుల్లో కుళాయిలు తొలగించిన చోట తిరిగి ఏర్పాటు చేయాలని రాళ్లపాడు-రోళ్లపాడు మంచినీటి పథకం నిర్వాహకులు టీడీపీ నాయకుడు గాలంకి ప్రసాద్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈ పథకం పరిధిలోని కొన్ని గ్రామాల్లో కొందరు వ్యక్తులు తమ ఇళ్ల ముందు ఉన్న వీధి కుళాయిలను తొలగించి ఆ నీటిని తోటలకు పారించుకుంటున్నారని చెప్పారు. కుళాయిలను తొలగించడంతో నీరు వదిలిన సమయంలో వృథా అవుతుందన్నారు. రాళ్లపాడు ప్రాజెక్టులో నీరు అరకొరగా ఉందన్నారు.

రెండేళ్లుగా 'నిఘా' లేదు..

లింగసముద్రం, సెప్టెంబరు 30: నాలుగేళ్ల కిందట పెంట్రాల తాతాహోటల్ సెంటర్ వద్ద దాతల సాయంతో పోలీసులు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. రెండేళ్లు బాగానే పనిచేశాయి. అనంతరం పాడైపోవడంతో ఇప్పటివరకు అవి మరమ్మతులకు నోచుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. కందుకూరు, కావలి, నెల్లూరు నుంచి ఈ సెంటర్ మీదుగా కొండాపురం, మొగిలిచెర్ల, మాలకొండకు వెళ్లేందుకు ఇది ముఖ్యమైన కూడలి. ఈ సీసీ కెమెరాకలు పని చేసేటపుడు ఈ సెంటర్ మీదుగా జరిగే అక్రమ ఇసుక రవాణా, మద్యం అక్రమ రవాణాను పోలీసులు అరికట్టారు. కొన్ని గొడవలను కూడా వీటిలో చూసి అధికారులు నిజా నిజాలు గుర్తించారు. ప్రస్తుతం ఇవి మరమ్మతులకు నోచుకోక పోవడంతో ఇసుక రవాణా, అక్రమ మద్యం రవాణా జోరుగా సాగుతోంది.


తాతాహోటల్ సెంటర్‌లో మరమ్మత్తులకు గురైన సీసీ కెమేరాలు

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కొండాపురం, సెప్టెంబరు 30: చింతలదేవి సమీపంలోని ఉపటేరు వాగులో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారంతో సోమవారం ఎస్‌ఐ మహేంద్ర సిబ్బందితో దాడులు నిర్వహించారు. అనుమతులు లేని ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు.

న్యాయవాది మృతికి సంతాపం

కందుకూరు, సెప్టెంబరు 30: కందుకూరు న్యాయవాది, ప్రముఖ నోటరీ ధూళిపాళ్ల రామకృష్ణ (48) సోమవారం గుండెపోటుతో తన స్వగృహంలో మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ కోలుకున్న రామకృష్ణ అకస్మాత్తుగా మృతి చెందటంతో కందుకూరు బార్ అసోసియేషన్, స్కందపురి బ్రాహ్మణ సేవా సమితి, నియోజకవర్గ బ్రాహ్మణ సమాఖ్యలు వేర్వేరు ప్రకటనల్లో సంతాపం వ్యక్తం చేశాయి.

రేపు మెగా రక్తదాన శిబిరం

ఆత్మకూరు, సెప్టెంబరు 30: గాంధీ జయంతిని పురస్కరించుకుని బుధవారం పట్టణంలోని అభిరామ్ ఆసుపత్రిలో నోవా బ్లడ్‌బ్యాంక్ సహకారంతో అభిరామ్ హెల్త్ అండర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ వైస్‌చైర్మన్, అభిరామ్ హాస్పటల్ ఎండీ శ్రావణ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల 18-60 సంవత్సరాల మధ్య వయస్సు వారు రక్తదానం చేయవచ్చన్నారు.

ఆత్మకూరు ఎక్సైజ్ సీఐగా రమణమ్మ



ఆత్మకూరు, సెప్టెంబరు 30: ఆత్మకూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐగా ఆర్‌వి రమణమ్మ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న కె రవీంద్ర నరసారావుపేట ఏపీఈఎస్‌గా బదిలీ అయ్యారు.

సంగం ఎస్‌ఐగా రాజేష్



సంగం, సెప్టెంబరు 30: సంగం ఎస్‌ఐగా రాజేష్ బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా సంగంలో ఉన్న ఎస్‌ఐ నాగార్జునరెడ్డిని ఇందుకూరుపేట ఎస్‌ఐగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో రాజేష్‌ను నియమించడంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు.

విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ



సైకిళ్లు అందజేస్తున్న అధికారులు

కందుకూరు, సెప్టెంబరు 30: వరల్డ్‌విజన్ ఇండియా ఆర్గనైజేషన్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు 39మంది విద్యార్థినులకు సోమవారం ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేశారు. పాఠశాలకు బస్సు సౌకర్యం కూడా లేక మూడు కిలోమీటర్లు నడిచి వెళ్తున్న 23మంది బాలికలు, 16 మంది బాలురను గుర్తించి ఈ కార్యక్రమం చేపట్టారు. ఎంఈఓ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్య క్రమంలో మున్సిపల్ కమిషనర్ అనూష, ఎంఈఓలు సుబ్బారెడ్డి, అజయ్‌బాబులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సంస్థ మేనేజరు యేసయ్య పాల్గొన్నారు.

వ్యాసరచన, క్విజ్ పోటీలు

సంగం, సెప్టెంబర్ 30: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సోమవారం మండల స్థాయిలో వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచిన వారిని జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఎంఈవో జానకిరామ్ పోటీలను పర్యవేక్షించారు.

భజన గురువుల సమావేశం

సంగం, సెప్టెంబరు 30: స్థానిక రాజరాజేశ్వరీదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి జ్ఞానపీఠంలో అఖిల భారత హిందూ మహాసభ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని భజన గురువుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అఖిల భారత హిందూ మహాసభ చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించి తీర్మానించారు. కావలసిన సహాయ సహకారాలు అందచేస్తానని జ్ఞానపీఠం పీఠాధిపతి రాజరాజేశ్వరానందస్వామి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అఖిల భారత హిందూ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలవరపు కార్తికేయ, భజన గురువులు పాల్గొన్నారు.

రికార్డుల తనిఖీ

వింజమూరు, సెప్టెంబరు 30: పంచాయతీ కార్యాలయంలో సోమవారం ఆడిటర్ జీవీ శిరీష ఆధ్వర్యంలో సాధారణ ఆడిట్ కార్యక్రమం జరిగింది. 2023 - 24 సంవత్సరానికి సంబంధించిన జనరల్ ఫండ్ 15వ ఫైనాన్స్ నిధుల వినియోగం జమా ఖర్చులు, తదితర అంశాలపై ఆడిట్ నిర్వహించారు. పలు రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సుజనా, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులురెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

ఉలవపాడు, సెప్టెంబరు 30: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని మన్నేటికోట గ్రామానికి వెళ్లే రోడ్డుమార్గంలో సోమవారం జరిగింది. స్థానిక ఎస్సై అంకమ్మ తెలిపిన వివరాల మేరకు ... ఉలవపాడు ముఠా యూనియన్‌కు చెందిన చిరితోటి సూర్యనారాయణ(50), మరో ముగ్గురు కూలీలు సరుగుడు తోటలోని కర్రను లారీకి లోడ్ చేసేందుకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో రోడ్డుపై కిందకు వేలాడుతున్న హైటెన్షన్ విద్యుత్ వైర్లు సరుగుడు కర్రలకు తగలడంతో విద్యుత్ సరఫరా జరిగింది. దీంతో లారీ నుంచి కిందకు దిగే క్రమంలో సూర్యనారాయణ విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. దీనిని గమనించిన లారీడ్రైవర్, మిగిలిన ముగ్గురు అప్రమత్తమై ప్రమాదం నుంచి బయటపడ్డారు. సూర్యనారాయణ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉలవపాడు సీహెచ్‌సీకి తరలించి, కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

స్కూల్ గేమ్స్ ప్రతిభా విద్యార్థులకు అభినందనలు

ఉలవపాడు, సెప్టెంబరు 30: నియోజకవర్గస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలో ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయి పోటీలకు 34మంది జిల్లా ఎస్‌జీఎఫ్ స్కూల్ గేమ్స్ పోటీలకు పెదపట్టపుపాలెం విద్యార్థులు ఎంపికైనట్లు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్‌కే సలీం బాష తెలిపారు. ఈ సందర్భంగా వారిని సోమవారం హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు. స్వర్ణాంధ్ర-2047, వికసిత్ భారత్-2047లో భాగంగా రాష్ట్రాన్ని ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా మార్చాలనే అంశంపై సోమవారం జరిగిన వక్తృత్వ పోటీలో పెదపట్టపుపాలెంకు జడ్పీ హైస్కూల్ 9వ తరగతి విద్యార్థిని ఆవల జాహ్నవి ప్రథమ స్థానంలో నిలిచింది. పాఠశాలకు జిల్లాస్థాయి పేరుతెచ్చిన జాహ్నవిని పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.

కావలి టౌన్: రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అథ్లెటిక్స్ పోటీలకు కావలి శ్రీచైతన్య జూనియర్ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారు. కళాశాలలో ఎంపికైన క్రీడాకారులను యాజమాన్యం అభినందించారు. కార్యక్రమంలో పీఈటీలు జీవన్‌కుమార్, వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ లుకోధర్, డైరెక్టర్లు ప్రసాద్, మల్లికార్జున, కొండయ్య, మధుసూధన్‌రావు పాల్గొన్నారు.

లింగసముద్రం : స్థానిక కేఆర్ జడ్పీ హైస్కూల్లో సోమవారం నిర్వహించిన మండలస్థాయి వరల్డ్ స్పేస్ వీక్ 2024 పరీక్షలో ముగ్గురు విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి జిల్లాస్థాయి పరీక్షకు ఎంపికయ్యారు. ఎంఈఓ-2 ఎం శివకుమార్ మాట్లాడారు. ఈ నెల 7,8,9 తేదీల్లో శ్రీహరికోట షార్ సెంటర్‌లో పరీక్ష నిర్వహించి ఉత్తీర్ణులైన వారికి నగదు బహుమతులతో పాటు సర్టిఫికెట్లు అందజేస్తారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ షేక్ హష్తార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బిట్రగుంట: స్థానిక ఉన్నత పాఠశాలకు చెందిన గుంజి లతిక బాక్సింగ్ 65 కేజీల విభాగంలో రాష్ట్రస్థాయికి ఎంపికైంది. ఈ సందర్భంగా విశ్వనాథరావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగాధర్‌రావు లతికతో పాటు జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో రేణుక, సహోపాధ్యాయులు ఉన్నారు.

ప్రమాదకర బీరవాగు వంతెన



సంగం, సెప్టెంబరు 30: మండలంలోని పెరమన గ్రామానికి వెళ్లే రహదారిలో ఉన్న బీరాపేరు వంతెన రక్షణ రెయిలింగ్ దెబ్బతిని ప్రమాదకరంగా ఉంది. వర్షాకాలంలో బీరాపేరు వాగులో సుమారు 10 అడుగుల మేర నీటి ప్రవాహం ఉంటుంది. ఒకవైపు రక్షణ రెయిలింగ్ లేకపోవడంతో అటువైపుగా వెళ్లే పశువులు, జీవాలు, ద్విచక్ర వాహనాలు ప్రమాదవశాత్తు వాగులో పడే అవకాశం ఉంది. అధికారులు స్పందించి దెబ్బతిన్న రక్షణ రెయిలింగ్‌కు మరమ్మతులు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ముగ్గురు గంజాయి అమ్మకందారుల అరెస్ట్

- 800 గ్రాముల గంజాయి స్వాధీనం

కావలి రూరల్, సెప్టెంబరు 30: పట్టణంలోని తుమ్మలపెంట రోడ్డులోని సాయిబాబా ఆలయం సమీపంలో సోమవారం రాత్రి 1వ పట్టణ పోలీసులు ముగ్గురు గంజాయి అమ్మకందారులను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి 800 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు తుమ్మలపెంట రోడ్డులో గంజాయి అమ్ముతున్నారని సీఐ ఫిరోజ్‌కు అందిన సమాచారం మేరకు సిఐ సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో గంజాయి అమ్ముతున్న వాయునందనప్రెస్ వీధికి చెందిన కొక్కు సాయిసునీల్, మానస థియేటర్ ప్రాంతానికి చెందిన గుంజి తిరుమల, నెల్లూరు కపాటిపాలెంకు చెందిన షేక్ సిరాజ్ ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

శిథిలావస్థలో ఆర్వోబీ..

కావలి: పట్టణంలోని ఉదయగిరి రైల్వే ఓవర్‌బ్రిడ్జికి ట్రాక్‌కు పడమర వైపున నిర్మించిన మెట్లు శిథిలావస్థకు చేరాయి. పట్టణ నడిబొడ్డున రైల్వే ట్రాక్ ఉండటంతో ట్రాక్ దాటకుండా ట్రాక్‌కు ఇరువైపులా ఉన్న ప్రజలు రాకపోకలు సాగించేందుకు వీలుగా రెండు వైపులా మెట్లదారి ఏర్పాటు చేశారు. దీంతో ప్రజలు ట్రాక్ దాటకుండా ఆ మెట్లదారిన రాకపోకలు సాగిస్తుంటారు. నిత్యం ప్రజల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. ప్రజలకు ఎంతో అవసరమైన ఆ మెట్ల దారి



ట్రాక్‌కు పడమరవైపున శిథిలావస్థకు చేరుకుని ప్రమాదకరంగా మారింది. అది ఎప్పుడు కూలుతుందో అని భయాందోళనతో ఉన్నారు.

ప్రహరీ గుంతలు పూడ్చండి..

వలేటివారిపాలెం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ముందు ప్రహరీ నిర్మాణానికి ఏడాదిన్నర క్రితం పిల్లర్ల గుంతలు తీశారు. ఇంతవరకు పనులు ప్రారంభం కాకపోవడంతో వాటితో ప్రమాదం పొంచి ఉంది. ఈ గుంతల్లో వర్షపు నీరు నిలుస్తుంది. గత వైసీపీ ప్రభుత్వం మండల గ్రాంట్ కింద రూ.6లక్షలు నిధులకు ప్రతిపాదనలు పంపించారు. ఉన్నతాధికారులు అనుమతులు ఇచ్చారు. ఇద్దరు వైసీపీ నాయ కులు ప్రహరీ నిర్మాణ పనులకు ఇసుక, కంకర తోలి పిల్లర్ల గుంతలు తీశారు. అయితే ఏమైందో ఎయె తెలియదు కాని ఇసుక,



కంకర తోలి పిల్లర్ల గుంతలు తీసి పనులు ప్రారంభించకుండానే వదిలేశారు. సంబంధిత అధికారులు స్పందించి నిర్మాణ పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పంచాయతీ కార్యదర్శుల బదిలీ

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 30: మండల పంచాయతీ కార్యదర్శుల సాధారణ బదిలీల్లో భాగంగా వేర్వేరు ప్రాంతాలకు బదిలీ చేస్తూ సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయానికి జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. శకునాలపల్లి పంచాయతీ కార్యదర్శి గా జలపల్లి అమర్నాథ్‌రెడ్డిని బుచ్చిరెడ్డిపాళెం మండలం పంచేడు, గండిపాళెం కార్యదర్శి కరీముల్లాను శకునాలపల్లి, కొండాయపాళెం కార్యదర్శి నాగూర్‌బీని తిరుమలాపురం, అప్పసముద్రం కార్యదర్శి చంద్రశేఖర్‌ను జీ.అయ్యవారిపల్లి, కార్యదరి శ్రీనివాసులను అప్పసముద్రం, తిరుమలాపురం కార్యదర్శి వెంకటరమణను గండిపాళెం పంచాయతీలకు బదిలీ అయ్యారు. ఈవోపీఆర్డీ మల్లికార్జున్‌ను దుత్తలూరుకు బదిలీ చేశారు.

ప్రిన్సిపాల్ సంజాయిషీ కోరిన డీఈవో

వలేటివారిపాలెం: చుండి మోడల్ స్కూల్ ప్రిన్స్‌పల్ వెంకటేశన్‌ను సోమవారం నెల్లూరు జిల్లా విద్యాశా ఖాధికారి ఫోన్‌లో సంజాయిషీ కోరారు. బాలికల వసతిగృహం పూర్తికి 14ఏళ్లు.. ప్రారంభానికి ఇంకెన్నాళ్లో..? అన్న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి డీఈఓ స్పందించారు. వెంటనే చుండి మోడల్‌స్కూల్ ప్రిన్స్‌పల్‌కు ఫోన్ చేసి మెయిల్‌కు ఆంధ్రజ్యోతి కథనం కటింగ్ పెట్టి గంటలోపే సంజాయిషీ ఇవ్వాలని లేదంటే చర్యలు తీసుకునామన్నారు.

బోరుగుంతపై మూత ఏర్పాటు

వలేటివారిపాలెం, సెప్టెంబరు 30: చుండి బ స్టాండు సెంటరు సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రం భవనం ఎదుట ప్రమాదకరంగా ఉన్న బోరు గుంతపై సిబ్బంది సోమవారం మూతను అమర్చారు. ప్రమాదమని తెలిసినా.. అని ఆంధ్రజ్యోతిలో ఆదివారం ప్రచురితమైన మినీ శీర్షికకు ఐసీడీఎస్ అధికారులు, పంచాయతీ అధికారులు స్పందించారు. చిన్నారులకు ప్రమా దాల జరగకుండా విద్యుత్ తీగలు, మోటారు పైపులు సరిచేసినట్లు చెప్పారు. ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోని సమస్య ఆంధ్ర జ్యోతి మినీ శీర్షికతో పరిష్కారం అవడంతో చిన్నారుల తల్లిదం డ్రులు హర్షం వ్యక్తం చేశారు.



రెండు మాసాలకే తహసీల్దారు బదిలీ

జలదంకి, సెప్టెంబరు 30: మండల తహసీల్దారుగా ఆగస్టు 6న బాధ్యతలు స్వీకరించిన హేమంత్ కుమార్ రెండు మాసాలకే వరికుంటపాడుకు బదిలీ అయ్యారు. ఈయన సోమవారం జలదంకిలో రిలీవ్ అయ్యారు. బదిలీపై వెళ్తున్న తహసీల్దారును డీటీ భరత్, కార్యాలయ సిబ్బంది వీఆర్వోలు ఘనంగా సన్మానించారు. అనంతరం ఆర్‌ఐ శ్రీజ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కావలి ఆర్డీవో కార్యాలయం నుండి ఈమె బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు ఆర్‌ఐగా పనిచేస్తున్న శ్రీనివాసులును కొండాపురం బదిలీ చేశారు.

బేబి ఒలింపిక్స్‌లో విజేతలుగా కావలి కవలలు తోషన్, తోషిణి

కావలి టౌన్, సెప్టెంబరు 30: విజయవాడ చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి బేబి ఒలింపిక్స్ పోటీల్లో పట్టణంలోని వెంగళరావునగర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సిద్ధార్థ మణికంఠ, రూపశ్రీ దంపతుల 9నెలల కవలలు తోషన్, తోషిణిలు ప్రథమ, ద్వితీయ బహుమతులు పొందారు. ఈ సందర్భంగా మణికంఠ దంపతులు మాట్లాడారు. చిన్నప్పటి నుంచే పిల్లల్లో పోటీతత్వం పెంచేలా తీర్చిదిద్దాలన్నారు.

వాటర్ బాటిళ్లు అందజేత

సంగం, సెప్టెంబరు 30: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో లైబ్రేరియన్‌గా పనిచేస్తూ సోమవారం పదవీ విరమణ చేసిన ఆళ్ల వెంకటసుబ్బయ్య పాఠశాలలోని 500 మంది విద్యార్థులకు స్టీల్ వాటర్ బాటిళ్లు అందచేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు బుజ్జయ్య ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు లైబ్రేరియన్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రైల్వే రిజర్వేషన్ కౌంటర్ ఏర్పాటుకు కృషి

బిట్రగుంట, సెప్టెంబరు 30: విజయవాడ రైల్వే డివిజనల్ పరిధిలోని రైల్వే కార్మికులకు బిట్రగుంట స్టేషన్‌లో రిజర్వేషన్ కౌంటర్ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని విజయవాడ డివిజనల్ సంఘ్ కార్యదర్శి ఆమంచి వెంకటేశ్వర్లు తెలిపారు. బేతనీపేటకు చెందిన రైల్వే ఓఎస్ గోవిందరాజు పదవీ విరమణ కార్యక్రమానికి సోమవారం వచ్చిన ఆయన్ను బిట్రగుంట వాకర్స్ అసోసియేషన్ సభ్యులు సన్మానించి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విశ్రాంత రైల్వే గార్డు, వాకర్స్ గౌరవ అధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులు యాదవ్, ఫౌండర్ అధ్యక్షుడు కుందుర్తి శ్రీనివాసులు రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో స్థానిక రైల్వే సమస్యలపై ఆయనతో మాట్లాడారు. బిట్రగుంట రైల్వే సెక్షన్ పరిధిలో వివిధ శాఖలో వర్కింగ్ సభ్యులు 1500 పైగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో ఏడీసీ జీ.శ్రీనివాసులు, బ్రాంచ్ కార్యదర్శి రాజశేఖర్, వాకర్స్ సభ్యులు జీవన్‌కుమార్, జిల్లానీ బాషా, సుబ్బారావు ఉన్నారు.

రైతు డిపోల తనిఖీ

వింజమూరు, సెప్టెంబరు 30: చాకలకొండలోని కార్తికేయ రైతుడిపోను విజిలెన్స్ అధికారులు సోమవారం తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో రూ. 2,96,013 విలువ గల ఎరువులను సీజ్‌చేసి నిత్యావసరాల సరుకుల చట్ట ప్రకారం 6ఏ కేసు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ వ్యవసాయ అధికారి వేణుగోపాల్, వింజమూరు వ్యవసాయ అధికారి శివనాగప్రసాద్, విజిలెన్స్ హెడ్‌కానిస్టేబుల్ హరికృష్ణ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాలను అధిగమించండి

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 30: తపాలా ఉద్యోగులకు కేటాయించిన లక్ష్యాలను అధిగమించడంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో తపాలా సేవలను మెరుగుపర్చాలని నెల్లూరు డివిజన్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక తపాలా కార్యాలయ ఆవరణలో ఉద్యోగులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్ష్యాలను సాధించేందుకు ప్రజలతో మమేకమై పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంకు ఖాతాల ద్వారా గ్రూప్ యాక్సిడెంట్ పాలసీలు విరివిగా చేయాలన్నారు. అనంతరం తపాలా బీమా పాలసీలు, ఖాతాల ప్రారంభంలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన బీపీఎంలకు సిల్వర్ కాయిన్స్ అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఐపీవో సాయికృష్ణారెడ్డి, ఎస్‌పీఎంలు అనిల్, నజీర్‌బాషా పాల్గొన్నారు.


తాగునీటి ఎద్దడి నివారించాలి

- అధికారులకు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆదేశం


అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

ఉదయగిరి రూరల్, వింజమూరు, సెప్టెంబరు 30: నియోజకవర్గంలోని పంచాయతీల్లో తాగునీటి ఎద్దడి నివారణే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. సోమవారం నెల్లూరు క్యాంపు కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జలసిరి పథకం కింద అర్హులైన రైతులకు బోర్లు వేసేలా ప్రణాళిక రూపొందించాలన్నారు. ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం కింద అవసరమైన గ్రామాల్లో శుద్ధిజల కేంద్రాలు ఏర్పాటుచేయాలని, మదర్‌ప్లాంట్లను వినియోగంలోకి తీసుకురావాలన్నారు. ఫ్లోరైడ్ రహిత నియోజకవర్గంగా ఉదయగిరిని తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ రాధయ్య, డీఈ భావనారాయణ, ఏఈలు జగన్నాథం, హరిత, హాని, మసూద్‌అహ్మద్, సతీష్‌బాబు, జిలానీబాష, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అమరాకు నిత్యాన్న సత్రం సభ్యత్వం


సభ్యత్వ కార్డు అందుకుంటున్న అమరా వేదగిరి

కావలి టౌన్, సెప్టెంబరు 30: పట్టణానికి చెందిన ఆర్యవైశ్య ప్రముఖులు అమరా వేదగిరికి కాశీ అన్నపూర్ణ వృద్ధాశ్రమం, నిత్యాన్న సత్రం సభ్యత్వం లభించింది. సోమవారం తిరుపతి శ్రీవారి సన్నిధిలో జరిగిన కాశీ అన్నపూర్ణ వృద్ధాశ్రయం, నిత్యాన్న సత్రం జనరల్ బాడీ సమావేశంలో వేదగిరిని సభ్యునిగా ఎన్నుకున్నారు. సంస్థల గౌరవాధ్యక్షుడు ఆర్యవైశ్య ప్రముఖులు టీజీ వెంకటేష్ నుంచి సభ్యత్వ గుర్తింపుకార్డు అందుకున్నారు. వేదగిరి మాట్లాడుతూ పేదలు, వృద్ధులకు సేవచేసే భాగ్యం కల్పించిన ఆర్యవైశ్య పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రముఖులు వేదగిరిని అభినందించారు.

టిడ్కో లబ్ధిదారులను ఆదుకోవాలి : సీపీఐ

కందుకూరు, సెప్టెంబరు 30: టిడ్కో గృహాల లబ్ధిదారుల జప్తులకు ప్రమాదం పొంచి ఉన్నందున ప్రభుత్వం వారిని ఆదుకోవాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి సురేష్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. టిడ్కో గృహాలను బ్యాంకు రుణాలతో 2019లో టీడీపీ ప్రభుత్వం చివరి దశలో వారికి కేటాయించారని, అయితే వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో వాటిని లబ్ధిదారులకు స్వాధీనం చేయకుండా పనుల అసంపూర్తి పేరుతో కాలయాపన చేయటంతో వడ్డీలు పెరిగిపోయి ఆగృహాలపై రుణభారం పెరిగిపోయిందన్నారు. మన ప్రభుత్వం వచ్చాక టిడ్కో గృహాలను లబ్ధిదారులకు ఒక్కరూపాయి కూడా కట్టాల్సిన అవసరం లేకుండా పూర్తిగా ఉచితంగా ఇస్తానని జగన్ ఇచ్చిన హామీలు ఏమైనట్లు అని వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ సమస్యను పరిశీలించి న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

హెచ్‌ఎంలకు పాఠ్య పుస్తకాల అందజేత


ప్రధానోపాధ్యాయులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈవో

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 30: స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో సోమవారం మండలంలోని 1-10వ తరగతి చదివే విద్యార్థులకు ప్రభుత్వం మంజూరు చేసిన సెమిస్టర్-2 పాఠ్య పుస్తకాలను ఎంఈవో-2 శ్రీనివాసులు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి 8,484 పాఠ్య పుస్తకాలు వచ్చాయని, వాటిని విద్యార్థులకు పంపిణీ చేయాలని ప్రధానోపాధ్యాయులకు సూచించామన్నారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సయ్యద్ జాఫర్‌మొహిద్దీన్, షేక్ మహమ్మద్‌గౌస్, నాగయ్య, హుస్సేన్, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శిక్షణా తరగతులు ప్రారంభం


శిక్షకులకు పుస్తకాలు అందజేస్తున్న లక్కినేని ప్రకాష్

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 30: స్థానిక నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్) కేంద్రంలో పీఎం విశ్వకర్మ పథకంలో భాగంగా బ్రిక్ మెషిన్ బేసిక్ శిక్షణా తరగతులను సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా న్యాక్ ఎస్పీవోసీ లక్కినేని ప్రకాష్ మాట్లాడుతూ ఆరు రోజుల పాటు ఉచిత శిక్షణ తరగతులు జరుగుతాయన్నారు. అందులో భాగంగా బ్రిక్ మెషిన్ బేసిక్ శిక్షకులకు తాపీ పని, టూల్ కిట్‌పై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా శిక్షకులకు హ్యాండ్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్టిఫైడ్ శిక్షకుడు సూరిబాబు, శిక్షకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు చెకుముకి టాలెంట్ టెస్టు

కావలిటౌన్, సెప్టెంబరు 30: రెడ్‌క్రాస్ భవనంలోని యోగా కేంద్రంలో పట్టణస్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్టు మంగళవారం ఉదయం 9 గంటల నుంచి నిర్వహించనున్నట్లు జేవీవీ పట్టణశాఖ అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు తెలిపారు. ఇదివరకు పాఠశాల స్థాయిలో నిర్వహించిన ఈ టెస్ట్‌లో ఎంపికైన విద్యార్థులు పోటీల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. పట్టణ స్థాయి టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబరిచిన వారు 27న జరగబోయే జిల్లాస్థాయి టెస్టులో పాల్గొంటారని చెప్పారు.

●**వింజమూరు:** పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో మంగళవారం ఉదయం 11గంటలకు మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జనవిజ్ఞాన వేదిక నాయకులు జి చెంచలబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని పాఠశాలల్లోని ఆసక్తి ఉన్న విద్యార్థులు పాల్గొనాలని కోరారు. పాఠశాల స్థాయిలో గెలుపొందిన జట్టు మండల స్థాయిలో పాల్గొంటారని, మండల స్థాయిలో గెలుపొందిన వారు జిల్లాస్థాయిలో పోటీ పడతారని వారు తెలిపారు.

వరద బాధితుల కోసం విరాళాల అందజేత

వింజమూరు, సెప్టెంబరు 30: వరద బాధితుల సహాయార్థం స్థానిక శ్రీనేతాజీ వికాస్ విద్యాసంస్థల విద్యార్థులు సుమారు రూ. లక్షా12వేలకు పైగా విరాళాలను సేకరించి విద్యాసంస్థ అధినేత కేవీ రత్నంకు సోమవారం అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

చల్లపల్లి, సెప్టెంబరు 30: కృష్ణాజిల్లా చల్లపల్లి మండలం నూకలవారిపాలెంలో 216 జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందారు. ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. నెల్లూరు జిల్లా కందుకూరుకు చెందిన లారీలో ఇనుము, స్టీలు రాడ్లులను ఒరిస్సా నుంచి చెన్నై తీసుకువెళుతున్నారు. కందుకూరుకు చెందిన లారీ డ్రైవర్ షేక్ ఖాదర్ బాషా(41)కు తెల్లవారుజామున నిద్ర రావటంతో లారీపైన పడుకున్నాడు. క్లీనర్ షేక్ బాబు లారీ నడుపుతున్నాడు. నూకలవారిపాలెం అడ్డరోడ్డు సమీపంలో జాతీయ రహదారిపైకి ఒక్కసారిగా యాచకుడు రావడంతో లారీ అతన్ని ఢీకొని అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లారీపైన పడుకుని ఉన్న డ్రైవర్ ఖాదర్ బాషా ఇనుపరాడ్డుల కింద నలిగి అక్కడికక్కడే మృతి చెందాడు. లారీ నడుపుతున్న బాబుకు కాళ్లు విరిగాయి. లారీ ఢీకొనటంతో యాచకుడు మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సోమవారం క్రేన్‌ల సహాయంతో లారీని పైకితీసి ఇనుప రాడ్డుల కింద పడి ఉన్న డ్రైవర్ ఖాదర్ బాషా మృతదేహాన్ని బయటకుతీశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అవనిగడ్డ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఖాదర్ బాషా సోదరుని కుమారుడు షేక్ ఫయాజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు చల్లపల్లి ఎస్‌ఐ పి.ఎస్.వి.సుబ్రహ్మణ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.